తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
# జనంసాక్షి
www.janamsakshi.org
మంగళవారం 01.07.2025 | సంపుటి : 11 సంచిక : 343 | పేజీలు : 12 వెల : రూ. 4/-
RNI NO.TELTEL / 2013 /50370

ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698




తెలంగాణ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

# మహావిషాదం

## పాశమైలారం పారిశ్రామికవాడలో ఘోర దుర్ఘటన
## సిగాచి రసాయన పరిశ్రమలో పేలిన రియాక్టర్
## 16 మంది మృతి



- 34 మందికి గాయాలు.. పలువురి పరిస్థితి విషమం
- ప్రమాదంలో కంపెనీ వైస్ ప్రెసిడెంట్ దుర్మరణం
- ప్రధానమంత్రి మోడీ దిగ్భ్రాంతి..ఎక్స్‌గ్రేషియా ప్రకటన
- గవర్నర్, సీఎం రేవంత్, కేసీఆర్,కిషన్‌రెడ్డి విచారం



ఘటన స్థలం వద్ద ఎగిసిపడుతున్న మంటలు..



పాశమైలారంలోని సిగాచి పరిశ్రమ వద్ద పేలుడు బీభత్స దృశ్యం

- క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని సీఎం ఆదేశం
- ప్రమాద స్థలాన్ని పరిశీలించిన దామోదర రాజనర్సింహ
- భాధిత కుటుంబాలను అన్నిరకాలుగా అదుకుంటామని హామీ
- ప్రమాదంపై సమగ్ర విచారణ జరిపిస్తాం : మంత్రి వివేక్
- తమవారి ఆచూకీ చెప్పాలంటూ బాధిత కుటుంబాల ఆందోళన
- పరిశ్రమలోకి చొచ్చుకు వెళ్లేందుకు యత్నం.. నెలకొన్న ఉద్రిక్తత



ఆస్పత్రిలో క్షతగాత్రులను పరామర్శిస్తున్న మంత్రులు రాజనర్సింహ వివేక్..

సంగారెడ్డిప్రతినిధి పటాన్చెరు(జనంసాక్షి): సంగారెడ్డి జిల్లా పాశమైలారం పారిశ్రామికవాడలో భారీ పేలుడు సంభవించింది. సిగాచీ రసాయన పరిశ్రమలో రియాక్టర్ పేలడంతో మంటలు ఎగిసిపడ్డాయి. మిగతా 2లో..



# బనకచర్లకు అనుమతులివ్వలేం

- కేంద్ర పర్యావరణ నిపుణుల కమిటీ ప్రకటన
- ప్రాజెక్టుపై అనేక అభ్యంతరాలు వచ్చాయి
- జీడబ్ల్యూడీటీ తీర్పును పరిశీలించాల్సి ఉంది
- అన్ని అనుమతులు, నీటి నిల్వ, పర్యావరణంపై ప్రభావం తదితర అంశాలు అంచనా వేసిన తర్వాతే నిర్ణయమని వెల్లడించిన కమిటీ

న్యూఢిల్లీ(జనంసాక్షి):పోలవరం-బనకచర్ల ప్రాజెక్టుకు అనుమతులు ఇవ్వలేమని కేంద్ర పర్యావరణ నిపుణుల కమిటీ స్పష్టం చేసింది. ప్రాజెక్టుపై అనేక అభ్యంతరాలు వచ్చాయని, అనుమతులు ఇవ్వాలంటే గోదావరి వాటర్ డిస్ప్యూట్ ట్రైబ్యునల్ (జీడబ్ల్యూడీటీ) తీర్పును పరిశీలించాల్సి ఉందని తెలిపింది. పర్యావరణ అనుమతులకు సీడబ్ల్యూసీని సంప్రదించడం అత్యవసరమని కమిటీ అభిప్రాయపడింది. బనకచర్ల ప్రాజెక్టును ఎలాంటి ఇబ్బందులు లేకుండా చేపట్టినట్లు ఏపీ ప్రభుత్వం ఇచ్చిన నివేదికను నిపుణుల కమిటీ పరిశీలించింది. అయితే, 1983లో గోదావరి ట్రైబ్యునల్ ఇచ్చిన తీర్పునకు విరుద్ధంగా మిగతా 2లో..

## కేంద్రం ప్రకటనపై హరీశ్‌రావు హర్షం 2లో

# ఇంజినీరింగ్ ఫీజులు యధాతథం

### తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం



హైదరాబాద్(జనంసాక్షి):ఇంజినీరింగ్ ఫీజుల విషయంలో తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. కోర్సులన్నింటికీ ఈ ఏడాది పాత ఫీజులే కొనసాగించాలని నిర్ణయించింది. ఈ మేరకు 2025-26 విద్యా సంవత్సరానికి పాత ఫీజులు కొనసాగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. బీటెక్, బీఈ, ఎంఈ, ఎంటెక్ సహా, బి- ఒకేషనల్ కోర్సులకు ఈ ఉత్తర్వులు వర్తిస్తాయని పేర్కొంది. ఇంజినీరింగ్‌లో ఫీజులు భారీగా పెరుగుతుండటంపై సీఎం రేవంత్‌రెడ్డి అసంతృప్తి వ్యక్తం చేయడం, రుసుములు ఖరారుచేసే ముందు అన్ని కోణాల్లో అధ్యయనం చేయాలని ఇటీవల ఆదేశించిన విషయం తెలిసిందే. అందుకు అనుగుణంగా ఓ కమిటీని నియమించి ఇతర రాష్ట్రాల్లో ఫీజుల విధానంపైనా అధ్యయనం చేసేందుకు కసరత్తు మిగతా 2లో..

# నిఘా మరింత బలోపేతం

### అంతరిక్షంలోకి 52 మిలిటరీ ఉపగ్రహాల ప్రయోగం వేగవంతం

న్యూఢిల్లీ(జనంసాక్షి):'ఆపరేషన్ సిందూర్' తర్వాత అంతరిక్షంలో నిఘాను భారత్ మరింత బలోపేతం చేసేందుకు చర్యలు చేపట్టింది. ముఖ్యంగా చైనా, పాకిస్థాన్, హిందూ మహాసముద్రంపై నిఘా పెట్టేందుకు వీలుగా 52 మిలిటరీ ఉపగ్రహాలను ప్రయోగించాలని నిర్ణయించింది. రియల్ టైమ్ మానిటరింగ్ తదితర అవసరాల కోసం రూ.26,968 మిగతా 2లో..





# కమలదళపతిగా రామచందర్‌రావు

### ప్రకటించిన అధిష్టానం • విధేయత..సీనియారిటికే ప్రాధాన్యత

హైదరాబాద్(జనంసాక్షి):తెలంగాణ భాజపా అధ్యక్షుడిగా ఎవరనే ఉత్కంఠకు తెరపడింది. ఈ పదవికి మాజీ ఎమ్మెల్సీ రామచందర్‌రావు పేరు ఖరారైంది. ఈ మేరకు నామినేషన్ వేయాలని పార్టీ అధిష్ఠానం ఆయన్ను ఆదేశించింది. మధ్యాహ్నం 2 గంటలకు రామచందర్‌రావు నామినేషన్ దాఖలు చేసారు. రాష్ట్ర అధ్యక్ష పగ్గాలు ఎవరికి అప్పగించాలన్న విషయంపై భాజపా అగ్రనేతలు తీవ్ర కసరత్తు చేశారు. ఎంపీలు ఈటల రాజేందర్, ధర్మపురి అర్వింద్, కె.లక్ష్మణ్, మాజీ ఎమ్మెల్సీ రామచందర్‌రావు పేర్లు బలంగా మిగతా 2లో..

## అధికారమిస్తే బీసీని సీఎం చేస్తాం

### కేంద్రమంత్రి బండి సంజయ్

వార్త 2లో

## ఏపీ భాజపా అధ్యక్షుడిగా పీవీఎన్ మాధవ్ పేరు ఖరారు

# సున్నం చెరువులో ఆక్రమణల తొలగింపు



హైదరాబాద్(జనంసాక్షి):హైదరాబాద్ నగర పరిధి మాదాపూర్‌లోని సున్నం చెరువులో ఆక్రమణలను హైడ్రా తొలగించింది. 32 ఎకరాల విస్తీర్ణంలోని సున్నం చెరువులో భారీగా ఆక్రమణలు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఎఫ్‌టీఎల్ పరిధిలో అక్రమంగా నిర్మించిన గుడిసెలను మిగతా 2లో..

# భాజపాలో ప్రజస్వామ్యం లేదు

- పార్టీ సభ్యత్వానికి ఎమ్మెల్యే రాజాసింగ్ రాజీనామా
- కిషన్‌రెడ్డిని కలిసి రాజీనామా లేఖ అందజేత
- బీజేపీ గెలవకూడదనుకునేవాళ్లు పార్టీలో ఎక్కువయ్యారని వ్యాఖ్య



హైదరాబాద్(జనంసాక్షి): పార్టీపై గతకొంతకాలంగా బహిరంగ విమర్శలు చేస్తూ..పార్టీ విధానాలను తప్పుపడుతూ వచ్చిన ఎమ్మెల్యే రాజాసింగ్ మరో సంచలన నిర్ణయం తీసుకున్నారు. బీజేపీకి గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ రాజీనామా చేశారు. రాజీనామా లేఖను రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు, కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డికి సోమవారం హైదరాబాద్‌లో అందజేశారు. అనంతరం పార్టీ కార్యాలయంలో వద్ద విలేకర్లతో ఎమ్మెల్యే రాజా సింగ్ మాట్లాడుతూ.. రాష్ట్ర అధ్యక్ష పదవికి నామినేషన్ వేసేందుకు వెళ్లితే.. తనను అడ్డుకున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఆ క్రమంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఎమ్మెల్యే రాజా సింగ్ వివరించారు. కిషన్ రెడ్డికి లిఖిత పూర్వకంగానే లేఖ రాసినట్లు తెలిపారు. పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు కిషన్ రెడ్డికి చెప్పి.. లేఖ రాశానన్నారు. ఎమ్మెల్యేగా డిస్ క్వాలీఫై చేసేలా అసెంబ్లీ స్పీకర్‌కు లేఖ పంపమని ఆయనతో పేర్కొన్నట్లు చెప్పారు. మిగతా 2లో..



# ప్రజాసమస్యలు పరిష్కరించండి

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కమ్యూనిస్టు నేతల వేడుకోలు వార్త 2లో



- హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్‌లలో కుంభవృష్టి
- భారీ వర్షాలకు కూప్పకూలిన 5 అంతస్తుల భవనం
- హిమాచల్‌లోని పది జిల్లాలకు వరద హెచ్చరికలు జారీ చేసిన అధికారలు వార్త 2లో

# భారీ వర్షాలతో ఉత్తరాది అతలాకుతలం

# అర్ధరాత్రి నుంచి రైల్వే ఛార్జీల మోత

### తత్కాల్ బుకింగ్‌కు ఆధార్ తప్పనిసరి

న్యూఢిల్లీ(జనంసాక్షి): కొత్త రైల్వే ఛార్జీలు, టికెట్‌బుకింగ్‌లో నిబంధనల అమలుపై రైల్వేబోర్డు కీలక ఆదేశాలు జారీ చేసింది. సోమవారం అర్ధరాత్రి నుంచి కొత్త రైల్వే ఛార్జీలు, టికెట్ బుకింగ్‌లు అమలులోకి వస్తాయని తెలిపింది. జూలై 1నుంచి ఈ మార్పులు అమలు కానున్నాయని ఇప్పటికే ప్రకటించింది. తత్కాల్ టికెట్ల బుకింగ్‌కు ఆధార్‌ను తప్పనిసరి చేసిన రైల్వేశాఖ.. జులై 1 నుంచి అమలులోకి తీసుకుని రావాలంటూ అన్ని జోన్‌ల మేనేజర్లకు సర్క్యులర్ జారీ చేసింది. దీంతో అర్ధరాత్రి 12గంటల నుంచి పెంచిన రైల్వే ఛార్జీలు అమలులోకి రానున్నాయి. సెకండ్ క్లాస్ ఆర్డినరీకి 500కి.మీ వరకు సాధారణ ఛార్జీలే ఉండనున్నాయి. 501 కి.మీ నుంచి 1500 కి.మీ వరకు టికెట్‌పై రూ.5; 201 కి.మీ నుంచి 2500 కి.మీ వరకు టికెట్‌పై రూ.10; 2501 నుంచి 3వేల మిగతా 2లో..



# అమెరికాలోని భారతీయులకు భారీ ఊరట



### రెమిటెన్స్ ట్యాక్స్ 1 శాతంగా నిర్ణయం • ఈ వారంలోనే భారత్-అమెరికా ట్రేడ్‌డీల్!

వాషింగ్టన్(జనంసాక్షి):అమెరికాలో నివసిస్తున్న భారతీయులకు పెద్ద ఊరట. భారత్‌లోని తమ కుటుంబ సభ్యులకు పంపే సొమ్ములపై ప్రతిపాదిత రెమిటెన్స్ ట్యాక్స్‌ను ఒక శాతానికే పరిమితం చేశారు.ట్రంప్ ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన 'వన్ బిగ్ బ్యూటిఫుల్ బిల్లు'లో తొలుత దీన్ని 5 శాతంగా నిర్ణయించారు. ఈ బిల్లు తాజా ముసాయిదాలో ఒక శాతానికి తగ్గించారు. బ్యాంక్ ఖాతాలు, డెబిట్/క్రెడిట్ కార్డు ద్వారా చేసే చెల్లింపులను పన్ను నుంచి మినహాయించారు. మనీ ఆర్డర్, క్యాషియర్ చెక్ వంటి మార్గాల్లో పంపే నగదుకే ఈ పన్ను వర్తిస్తుందని పేర్కొన్నారు.అమెరికా నుంచి భారత్‌లోని కుటుంబీకులకు డబ్బులు పంపే భారతీయులపై 5% రెమిటెన్స్ ట్యాక్స్‌ను ఈ ఏడాది మేలో ప్రతిపాదించారు. అమెరికా పౌరులు మినహా హెచ్1బీ వీసాదార్లు, గ్రీన్‌కార్డు హోల్డర్లు విదేశాలకు పంపే నిధులపై ఈ పన్ను వర్తిస్తుందని బిల్లులో పేర్కొన్నారు. దీంతో అమెరికాలో నివసిస్తున్న కోట్లాది మంది భారతీయుల్లో ఆందోళన వ్యక్తమైంది. దీనివల్ల ఏడాదికి 1.6 బిలియన్ డాలర్లు (దాదాపు రూ.13,600 కోట్లు) మేర పన్ను భారం పడొచ్చని అప్పట్లో అంచనా వేశారు.బిగ్ బ్యూటిఫుల్ బిల్లు ప్రతినిధుల సభను దాటుకుని తాజాగా సెనెట్ ఆమోదం కూడా పొందింది. అయితే, ప్రతినిధుల సభకొచ్చేటప్పటికే ప్రతిపాదిత ఐదు శాతం పన్నును 3.5 శాతానికి తగ్గించారు. సెనెట్‌కు వచ్చిన తాజా వెర్షన్‌లో రెమిటెన్స్ పన్నును ఒక శాతంగా పేర్కొనడం భారతీయులకు ఊరట కల్పించే అంశం. మరోవైపు సెనెట్‌లో ఉత్కంఠ నడుమ స్వల్ప ఓట్లతో (51-49) ఈ బిల్లు ఆమోదం పొందింది. చివరకు ఇద్దరు రిపబ్లికన్లు కూడా ఈ బిల్లుకు వ్యతిరేకంగా ఓటేశారు. బిల్లులోని మెడికల్ ఎయిడ్‌ను, ఆహార కూపన్లను తగ్గించే ప్రతిపాదనలు, 3.8 ట్రిలియన్ డాలర్ల పన్ను విరామాన్ని వంటి అంశాలను పలువురు రిపబ్లికన్లు వ్యతిరేకిస్తున్నారు. బిల్లు మళ్లీ ప్రతినిధుల సభకు వెళ్తుంది. అక్కడ ఆమోదం మిగతా 2లో..

## ఇరాన్ అణు కార్యక్రమం త్వరలోనే పుంజుకుంటుంది:ఐఏఈఏ


వార్త 2లో

## ట్రంప్, నెతన్యాహులపై ఇరాన్ 'ఫత్వా'..

### జారీ చేసిన మతపెద్ద అయతుల్లా నాసర్ మకరెం షిరాజీ పశ్చాత్తాపపడేలా చేయాలని పిలుపు

## ఇరాన్‌కు నేనేమీ ఆఫర్ చేయలేదు

### ఆ దేశంతో ఇకపై మాటలూ లేవు: ట్రంప్



వాషింగ్టన్(జనంసాక్షి):ఇరాన్ అణు కార్యక్రమం నుంచి బయటకు వస్తే వాషింగ్టన్ నుంచి భారీ మొత్తంలో నజరానాలు అందుతాయన్న వార్తలను అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కొట్టిపారేశారు. మిగతా 9లో..

# 8 రోజులపాటు విదేశాలకు మోదీ

### ఘనా, ట్రినిడాడ్ అండ్ టొబాగో, అర్జెంటీనా, బ్రెజిల్, నమీబియాల్లో పర్యటన



న్యూఢిల్లీ(జనంసాక్షి) ప్రధాని నరేంద్ర మోదీ ఎనిమిది రోజుల పాటు ఐదు దేశాల్లో పర్యటించనున్నారు. జులై 2 నుంచి ఘనా, ట్రినిడాడ్ అండ్ టొబాగో, అర్జెంటీనా, బ్రెజిల్, నమీబియాల్లో ఆయన పర్యటిస్తారని కేంద్ర విదేశాంగ శాఖలోని ఆర్థిక సంబంధాల కార్యదర్శి దమ్ము రవి వెల్లడించారు. ఐదు దేశాల పర్యటనలో భాగంగా తొలుత జూలై 2, 3 తేదీల్లో ఘనాలో పర్యటిస్తారని తెలిపారు. ఈ సందర్భంగా ఘనా అధ్యక్షుడితో ప్రధాని మోదీ ద్వైపాక్షిక చర్చలు జరుపుతారన్నారు. ఇరు దేశాల ద్వైపాక్షిక భాగస్వామ్యాన్ని సమీక్షించి.. ఆర్థిక, ఇంధన, రక్షణ సహకారంపై భాగస్వామ్యాన్ని పెంపొందించేందుకు ఉన్న అవకాశాలపై మిగతా 2లో..



# ప్రజాసమస్యలు పరిష్కరించండి

## సీఎం రేవంత్‌కు కమ్యూనిస్టు నేతల వేడుకోలు

**హైదరాబాద్**(జనంసాక్షి):ప్రజాసమస్యలను పరిష్కరించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కమ్యూనిస్టు నేతలు కోరారు. సోమవారం జూబ్లీహిల్స్ నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కలిసిన కలిసిన ఎమ్మెల్యే కూనమనేని సాంబశివరావు, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, మాజీ ఎమ్మెల్యే పల్లా వెంకట్ రెడ్డి, తదితరులు ప్రజా సమస్యలు, పలు అభివృద్ధి పనులకు సంబంధించిన అంశాలపై చర్చించారు. గ్రామ పంచాయతీ కార్మికులు, అంగన్వాడీ, ఆర్టీసీతో పాటు పలు ప్రజా సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజా ప్రభుత్వం ఎప్పుడూ ముందుంటుందని సీఎం స్పష్టం చేశారు.

# బనకచరకు అనుమతులివ్వలేం

ఈ ప్రాజెక్టు నిర్మిస్తున్నారని అభిప్రాయపడింది. ఈ ప్రాజెక్టులో నీటి నిల్వపై కేంద్రంతో అధ్యయనం, రెండు రాష్ట్రాలకు సంబంధించిన అంశాలకు అన్ని అనుమతులు, పర్యావరణ ప్రభావంపై అంచనా వేసిన తర్వాతే ప్రాజెక్టుకు పూర్తిస్థాయి అనుమతివ్వడానికి సాధ్యమవుతుందని నిపుణుల కమిటీ తేల్చి చెప్పింది.

# ఇరాన్ అణు కార్యక్రమం త్వరలోనే పుంజుకుంటుంది

టెహ్రాన్(జనంసాక్షి):ఇరాన్ అణుకేంద్రాలపై అమెరికా చేసిన దాడుల ప్రభావం కొన్ని నెలలు మాత్రమే ఉంటుందని అంతర్జాతీయ అణు ఇంధన సంస్థ (ఐఏఈఏ) అధిపతి రఫేల్ గ్రాసీ పేర్కొన్నారు. ఇరాన్ అణు కేంద్రాలను నుజ్జునుజ్జు చేశామంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన ప్రకటనకు ఇది పూర్తి భిన్నంగా ఉండటం గమనార్హం. టెహ్రాన్ మరికొన్ని నెలల్లోనే అణు ఇంధనం శుద్ధి చేయడాన్ని ప్రారంభించగలదని చెప్పారు.

# ట్రంప్, నెతన్యాహులపై ఇరాన్ 'ఫత్వా'..

## జారీ చేసిన మతపెద్ద అయతుల్లా నాసర్ మకరెం షిరాజీ పశ్చాత్తాపపడేలా చేయాలని పిలుపు

టెహ్రాన్(జనంసాక్షి):తమ దేశం విషయంలో అమెరికా, ఇజ్రాయెల్‌ల వైఖరిని ఇరాన్ తీవ్రంగా ఖండిస్తున్న విషయం తెలిసిందే. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహులను లక్ష్యంగా చేసుకొని విమర్శలు గుప్పిస్తోంది. ఈక్రమంలోనే ఇద్దరు నేతలపై ఇరాన్‌లో 'ఫత్వా' జారీ అయ్యింది. ట్రంప్, నెతన్యాహులను శత్రువులుగా పేర్కొన్న మత పెద్ద అయతుల్లా నాసర్ మకరెం షిరాజీ ఈమేరకు చర్యలు తీసుకున్నారు. ఇస్లామిక్ రిపబ్లిక్ నాయకత్వాన్ని బెదిరిస్తున్న ఈ ఇరుదేశాల నాయకులను ఓడించాలని నాసర్ మకరెం షిరాజీ ఈసందర్భంగా పిలుపునిచ్చారు. ఇస్లామిక్ దేశాలు వారికి సహకారం అందించడం నిషిద్ధమని, వారి తప్పులకు పశ్చాత్తాపపడేలా చేయడం అవసరమని పేర్కొన్నారు.

# నిఘా మరింత బలోపేతం

కోట్లను వెచ్చించనుంది. ఓ వైపు చైనా శరవేగంతో అంతరిక్షంలో ఆధిపత్యం కోసం యత్నిస్తున్న నేపథ్యంలో భారత్ ఈ చర్యలు చేపట్టింది. స్పేస్ బేస్ సర్వైలెన్స్ ఎస్‌బీఎస్ మూడోవిడత కార్యక్రమంలో భాగంగా.. ఇస్రో 21 ఉపగ్రహాలను ప్రయోగించనుంది. మిగిలిన 31 శాటిలైట్స్‌ను మూడు ప్రైవేటుసంస్థలు అభివృద్ధి చేసి కక్ష్యలోకి చేర్చనున్నాయి. ఈ కార్యక్రమంలో భాగంగా తొలి ఉపగ్రహాన్ని ఏప్రిల్ 2026న కక్ష్యలో ప్రవేశపెట్టనున్నారు. 2029 చివరికి మొత్తాన్ని అంతరిక్షంలోకి చేర్చనున్నారు. ఇస్రో స్మాల్ శాటిలైట్ లాంచ్ వెహికల్ టెక్నాలజీని ప్రైవేటు సంస్థలకు బదలాయించి.. వాటికి ఈ ప్రాజెక్టులో కీలక భాగస్వామ్యం ఇవ్వనుంది. అత్యవసర సమయాల్లో వేగంగా ఉపగ్రహాలను ప్రయోగించడానికి ఇది ఉపయోగపడనుంది. లోఎర్త్, జియో స్టేషనరీ కక్ష్యలపై దృష్టిపెట్టే ఈ ప్రాజెక్టును ఇంటిగ్రేటెడ్ డిఫెన్స్ స్టాఫ్ పర్యవేక్షించనున్నారు. చైనా యాంటీ శాటిలైట్ సామర్థ్యానికి కౌంటర్‌గా కూడా ఈ ప్రాజెక్టు ఉపయోగపడనుంది. భారత్ భారీ స్థాయిలో ఉపగ్రహాలను కూడా ఆపరేషన్ సిందూర్ కోసం మోహరించింది. వీటిల్లో ఇస్రో వాడుతున్న ఉపగ్రహాలతో పాటు.. అంతర్జాతీయ మద్దతు కూడా తీసుకొంది. భారత్ వద్ద 9-11 మిలిటరీ ఉపగ్రహాలు ఉన్నాయి. ఇస్రో వీటి నుంచి నిరంతరం డేటాను దళాలకు చేరవేసింది. దీంతోపాటు ఓ కమర్షియల్ గ్లోబల్ ఆపరేటర్ నుంచి చిత్రాలను సేకరించింది. ఇస్రో సొంతంగా వాడే కార్టోశాట్ సిరీస్‌లోని వాటిని కూడా రంగంలోకి దించింది. వీటి ఆధారంగా మన దళాలు పక్కా ప్లానింగ్ చేసి.. పాక్ సైనిక స్థావరాలను దెబ్బతీశాయి. అమెరికాకు చెందిన మ్యాక్సర్, ఐరోపాకు చెందిన సెంటినెల్ సేవలు కూడా భారత్ వాడుకొంది. ఇవి అయితే.. రోజుకు ఒకసారి అయినా చిత్రాలను డౌన్‌లోడ్స్ చేసుకోవచ్చు. ఇక మన దేశానికి చెందిన ఉపగ్రహాలు పీరియాడిక్ డేటాను 14 రోజులకు ఒకసారి తీసుకొనే అవకాశం ఉంది. తాజాగా చేపట్టిన ప్రాజెక్టు పూర్తయితే భారత్ చేతికి యుద్ధరంగంలోని రియల్‌టైమ్ డేటా వేగంగా అందే అవకాశం ఉంది.

# అమెరికాలోని భారతీయులకు భారీ ఊరట..

భారత్-అమెరికాల మధ్య వాణిజ్యఒప్పందంపై చర్చలు జోరుగా జరుగుతున్నాయి. దీనికి సంబంధించి కీలక ప్రకటన జులై 8 కంటే ముందే వెలువడవచ్చని అధికారిక వర్గాలు చెబుతున్నాయి. ఇప్పటికే ఈ చర్చలకు నాయకత్వం వహిస్తున్న వాణిజ్యశాఖ ప్రత్యేక కార్యదర్శి రాజేష్ అగర్వాల్ వాషింగ్టన్‌లో ఉండి తుదివిడత సంప్రదింపులు మొదలుపెట్టారు. ఇప్పటికే ట్రంప్ విధించిన టారిఫ్‌ల సస్పెన్షన్ జులై 9వ తేదీ వరకు మాత్రమే అమల్లో ఉంటుంది. ఎందుకంటే ఈ డెడ్‌లైన్‌ను మరోసారి పొడిగించే ఉద్దేశం తనకు లేదని అమెరికా అధ్యక్షుడు ఫాక్స్ న్యూస్‌కు వెల్లడించారు. అతిత్వరలోనే టారిఫ్‌లు అమల్లోకి వస్తాయని పేర్కొన్నారు. ట్రంప్ భారత్ నుంచి చేసుకొనే దిగుమతులపై విధించిన 26 శాతం టారిఫ్‌లు జులై 9 వరకు అమల్లోకి రావు. ఇక బేస్‌లైన్ టారిఫ్ 10శాతం మాత్రం వర్తిస్తోంది..

# 8 రోజులుపాటు విదేశాలకు మోదీ

నేతలిద్దరూ చర్చించే అవకాశం ఉన్నట్లు తెలిపారు. బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశాల్లో పాల్గొనేందుకు బ్రెజిల్ వెళ్తున్న ప్రధాని.. ఈ నేపథ్యంలో గ్లోబల్ సౌత్‌లోని పలు కీలక దేశాలతో భారత్ సంబంధాలను విస్తరించడమే లక్ష్యంగా తన పర్యటన కొనసాగించనున్నారు. దీంతో గత 11 ఏళ్లలో మోదీ అత్యంత సుదీర్ఘమైన దౌత్య పర్యటనల్లో ఇదీ ఒకటి కానుంది. జులై 9 వరకు కొనసాగే ఎనిమిది రోజుల పర్యటనలో ప్రధాని రెండు ఖండాలను కవర్ చేయనున్నారు. మోదీ ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఒకేసారి ఐదు దేశాల్లో పర్యటించడం ఇది రెండోసారి. 2016లో ఆయన అమెరికా, మెక్సికో, స్విట్జర్లాండ్, ఆఫ్ఘనిస్థాన్, ఖతార్‌లో ఒకేసారి పర్యటించారు. అలాగే, 2015 జులైలో ఆయన ఎనిమిది రోజుల పాటు ఆరు దేశాల్లో పర్యటించారు. ఆ సమయంలో రష్యాతో పాటు మధ్య ఆసియా దేశాల్లో మోదీ పర్యటన కొనసాగింది. ఇకపోతే.. ఈసారి జరగనున్న సుదీర్ఘ పర్యటనలో భాగంగా ప్రధాని నరేంద్ర మోదీ తొలుత జులై 2, 3 తేదీల్లో ఘనాలో పర్యటిస్తారు. దాదాపు మూడు దశాబ్దాల తర్వాత ఘనాలో భారత ప్రధాని పర్యటించడం ఇదే ప్రథమం. ఈ పర్యటన సందర్భంగా మోదీ.. ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక భాగస్వామ్యాన్ని సమీక్షించనున్నారు. ఆర్థిక, ఇంధన, రక్షణ సహకారం తదితర అంశాలపై ఆ దేశాధ్యక్షుడితో చర్చిస్తారని విదేశాంగ శాఖ తెలిపింది. అనంతరం ప్రధాని ట్రినిడాడ్ అండ్ టొబాగోలలో జులై 3, 4 తేదీల్లో పర్యటించనున్నారు. 1999 తర్వాత ఈ దేశంలో భారత ప్రధాని పర్యటించడం ఇదే తొలిసారి. అనంతరం జులై 4న అర్జెంటీనాకు వెళ్లనున్న ప్రధాని మోదీ.. 5వ తేదీ వరకు అక్కడే పర్యటిస్తారు.





# మహావిషాదం

ఈ ప్రమాదంలో 12 మంది మృతిచెందారు. తీవ్రంగా గాయపడిన వారిలో సంఘటన స్థలిలోనే ఐదుగురు మృతి చెందగా.. మరో 7 మంది ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోయారు. పేలుడు ధాటికి కార్మికులు సుమారు 100 మీటర్ల దూరం ఎగిరిపడ్డారు. పేలుడు తీవ్రతకు ఉత్పత్తి విభాగం ఉన్న భవనం కూలిపోగా.. మరో భవనానికి బీటలు వచ్చాయి. పరిశ్రమ లోపల మరికొందరు చిక్కుకున్నట్లు సమాచారం. కార్మికుల్లో పలువురు ఫోన్లు పనిచేయకపోవడంతో వారి కుటుంబసభ్యుల్లో ఆందోళన నెలకొంది. భవనం, శిథిలాల కింద మరికొందరు చిక్కుకున్నట్లు అధికారులు అనుమానిస్తున్నారు. వెలికితీసిన మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. మృతుల సంఖ్య ఇంకా పెరిగే అవకాశమున్నట్లు అధికారులు చెబుతున్నారు. ప్రమాద సమయంలో పరిశ్రమలో 108 మంది కార్మికులు ఉన్నట్లు సమాచారం. క్షతగాత్రుల్లో 12 మంది పరిస్థితి విషమంగా ఉంది. వారికి ఐసీయూలో చికిత్స అందిస్తున్నారు. సోమవారం పాశమైలారం పారిశ్రామికవాడలో భారీ పేలుడు సంభవించిన సంగతి తెలిసిందే. సిగాచి రసాయన పరిశ్రమలో రియాక్టర్ పేలడంతో మంటలు ఎగిసిపడ్డాయి. దీంతో పలువురికి గాయాలయ్యాయి. కాగా సిగాచి రసాయన పరిశ్రమలో జరిగిన పేలుడు ఘటనలో ప్లాంట్ వైస్ ప్రెసిడెంట్ ఎల్ఎన్ గోవన్ దుర్మరణం పాలయ్యారు. గోవన్ ప్లాంట్‌లోకి అడుగుపెట్టిన సమయంలోనే పేలుడు సంభవించింది. ప్రమాద ధాటికి ఆయన కారు నుజ్జునుజ్జయింది. సిగాచి ప్రమాద బాధితుల కోసం సంగారెడ్డి కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. ప్రమాద బాధితుల వివరాల కోసం 08455276155ను సంప్రదించాలని కలెక్టర్ సూచించారు. సంగారెడ్డి జిల్లా పాశమైలారం రసాయన పరిశ్రమ వద్ద ఉద్రిక్తత చోటు చేసుకుంది. రియాక్టర్ పేలడంతో ఇప్పటి వరకు 16 మంది ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. మరోవైపు పలువురు కార్మికులు ఇంకా పరిశ్రమలోనే చిక్కుకున్నట్లు అధికారులు అనుమానిస్తున్నారు. ఈ క్రమంలో పరిశ్రమలోకి చొచ్చుకెళ్లేందుకు కార్మికుల కుటుంబాలు యత్నించాయి. తమవారి ఆచూకీ చెప్పాలంటూ బంధువులు ఆవేదన వ్యక్తం చేశారు. పరిశ్రమలోకి వారిని వెళ్లనివ్వకుండా పోలీసులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో కుటుంబసభ్యులు, పోలీసుల మధ్య తోపులాట చోటు చేసుకుంది. ఘటనాస్థలిలో కార్మికుల కుటుంబాల రోదనలు మిన్నంటుతున్నాయి. క్షతగాత్రుల్లో 12 మంది పరిస్థితి విషమంగా ఉంది. వారికి ఐసీయూలో చికిత్స అందిస్తున్నారు. సోమవారం పాశమైలారం పారిశ్రామికవాడలో భారీ పేలుడు సంభవించిన సంగతి తెలిసిందే. సిగాచి రసాయన పరిశ్రమలో రియాక్టర్ పేలడంతో మంటలు ఎగిసిపడ్డాయి. దీంతో పలువురికి గాయాలయ్యాయి. తీవ్రంగా గాయపడిన వారిలో సంఘటన స్థలిలోనే ఐదుగురు మృతి చెందగా..క్షతగాత్రులకు మెరుగైన వైద్య సాయాన్ని అందించాలని జిల్లా కలెక్టర్‌ను మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశించారు. వెంటనే సహాయక చర్యలు చేపట్టాలన్నారు. మరోవైపు మాజీ మంత్రి, భారాస నేత హరీశ్‌రావు సంఘటనా స్థలిని పరిశీలించారు. కార్మికులను అడిగి ప్రమాద వివరాలు సేకరించారు. మదీనాగూడలోని ప్రణామ్ ఆస్పత్రిలో 18 మంది చికిత్స పొందుతున్నారని ఆస్పత్రి ఎండీ మనీష్‌గౌర్ తెలిపారు. వీరిలో ఇద్దరు మృతిచెందగా.. ముగ్గురి పరిస్థితి విషమంగా ఉందన్నారు. మిగిలినవారి పరిస్థితి నిలకడగా ఉందని చెప్పారు. పరిశ్రమల్లో భద్రతపై త్వరలోనే ఓ కమిటీ వేస్తామని మంత్రి వివేక్ తెలిపారు. అధిక పని గంటలపై కార్మికులు ఫిర్యాదు చేస్తే లేబర్ కమిషన్ దర్యాప్తు చేస్తుందన్నారు. మరోవైపు సిగాచి పరిశ్రమ ఘటన దురదృష్టకరమని మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. ప్రమాదం జరిగిన తర్వాత అన్ని విభాగాల అధికారులు సత్వరమే స్పందించారని, ప్రమాదానికి గల కారణాలను ఇప్పుడే చెప్పలేమన్నారు. ఈ పరిశ్రమలో మైక్రో క్రిస్టలైన్ సెల్యులోజ్ అనే పౌడర్ తయారు చేస్తున్నట్లు చెప్పారు. గత 40 ఏళ్లుగా ఈ సంస్థ పని చేస్తోందని తెలిపారు.

**ఈ విషాద ఘటనపై ప్రధాని దిగ్భ్రాంతి..**

మంత్రి నరేంద్ర మోదీ ఎక్స్ వేదికగా స్పందించారు. రసాయనిక పరిశ్రమలో రియాక్టర్ పేలి కార్మికులు మృతిచెందడం దిగ్భ్రాంతికి గురి చేసిందన్నారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. అలాగే పీఎంఆర్‌ఎఫ్ ఫండ్ నుంచి మృతుల కుటుంబాలకు, క్షతగాత్రులకు ప్రధాని మోదీ ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. 'తెలంగాణ రాష్ట్రం సంగారెడ్డిలో ఒక కర్మాగారంలో జరిగిన అగ్నిప్రమాదంలో చాలా మంది ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధాకరం. తమ ప్రియమైన వారిని కోల్పోయిన వారికి ప్రగాఢ సంతాపం తెలియజేస్తున్నాను. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నాను. మృతుల బంధువులకు పీఎంఎన్‌ఆర్‌ఎఫ్ నుంచి రూ.2 లక్షలు, క్షతగాత్రులకు రూ.50,000 ఎక్స్ గ్రేషియా అందిస్తాము' అని ప్రధాని మోదీ ప్రకటించారు.

ఘటనపై సీఎం రేవంత్ విచారం

సంగారెడ్డి జిల్లా పాశమైలారం పారిశ్రామికవాడలో పేలుడు ఘటనపై సీఎం రేవంత్‌రెడ్డి విచారం వ్యక్తం చేశారు. ప్రమాదంలో చిక్కుకున్న కార్మికులను కాపాడేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలన్నారు. ఘటనపై కిషన్‌రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నట్లు పేర్కొన్నారు. సంగారెడ్డి జిల్లా అధికారులతో మాట్లాడిన ఘటన వివరాలను తెలుసుకున్నట్లు కిషన్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు 'ఎక్స్'లో ఆయన పోస్ట్ చేశారు. బాధితులకు కేంద్ర ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. సంగారెడ్డి జిల్లా పాశమైలారం పారిశ్రామికవాడలో జరిగిన పేలుడు ఘటన పట్ల గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ప్రిన్సిపల్ సెక్రటరీ దానకిషోర్ ద్వారా ఘటనకు సంబంధించిన వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ దురదృష్టకర ఘటనలో ప్రాణాలు కోల్పోయిన కార్మికుల కుటుంబాలకు ఆయన సంతాపాన్ని వ్యక్తం చేశారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. బాధితులకు మెరుగైన వైద్యం అందేలా చూడాలని ప్రిన్సిపల్ సెక్రటరీని ఆదేశించారు.

**పాశమైలారం ఘటనపై కేసీఆర్ దిగ్భ్రాంతి**

సంగారెడ్డి జిల్లా పాశమైలారం పారిశ్రామికవాడలో జరిగిన పేలుడు ఘటనపై మాజీ సీఎం కేసీఆర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. సిగాచి పరిశ్రమలో 8 మంది కార్మికుల మృతిపట్ల సంతాపం తెలిపారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. చనిపోయిన వారి కుటుంబాలని ఆదుకోవాలన్నారు.

ప్రభుత్వ నిర్లక్ష్యం : మాజీ మంత్రి హరీష్ రావు

పాశమైలారం సిగాచి కంపెనీ పేలుడు ఉదయం 9 గంటలకు జరిగినా .. మధ్యాహ్నం వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. పెద్ద ప్రమాదం జరిగి 145 మంది పరిశ్రమలో చిక్కుకున్న ప్రభుత్వం సమాచారం అందిచడంతో నిర్లక్ష్యం వహించింది. కంపెనీలో పనిచేసే కుటుంబ సభ్యులు అందోళన చెందుతున్నారు, భాదిత కుటుంబాలను ప్రభుత్వం అదుకోవాలని మాజీ మంత్రి ,ఎమ్మెల్యే హరీష్ రావు డిమాండ్ చేశారు. సంఘటన ప్రదేశం ను పరిశీలించడంతో పాటు , గాయపడిన కార్మికులను పరామర్శించి , కుటుంబాలతో మాట్లాడారు.

**యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి:ఎమ్మెల్యే గూడెం**

సిగాచి కంపెనీ యాజమాన్య నిర్లక్ష్యం వల్లనే ప్రమాదం జరిగిందని, ఎలాంటి జాగ్రత్తలు పాటించకుండా కార్మికులు ప్రాణాలను బలి తీసుకుందని పటాన్ చెరువు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అరోపించారు.

# ఇంజినీరింగ్ ఫీజులు యధాతథం

జరుగుతున్నట్లు ఇటీవల వార్తలు వచ్చాయి. అయితే, ఈ వ్యవహారం ఇప్పట్లో తేలే అవకాశం లేకపోవడంతో.. ప్రవేశాల కౌన్సెలింగ్ ఆలస్యం కాకుండా పాత ఫీజుల ప్రకారమే (ఇంజినీరింగ్‌లో గరిష్ఠ ఫీజు రూ.1.65 లక్షలు) తొలుత ఎప్‌సెట్ కౌన్సెలింగ్ ప్రారంభించాలని ఉన్నత విద్యామండలి అధికారులు భావించిన నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం తాజాగా కీలక నిర్ణయం తీసుకుంది. మరోవైపు, పాలిటెక్నిక్ డిప్లొమా పూర్తిచేసిన వారు ఈసెట్ ద్వారా నేరుగా బీటెక్, బీఫార్మసీ రెండో ఏడాది కోర్సుల్లో చేరనున్నారు. దీంతో ఇంజినీరింగ్ ద్వితీయ సంవత్సరంలో ప్రవేశాలు పొందుతున్నందున ఆ విద్యార్థులకు సైతం తాజా నిర్ణయం ప్రకారం పాత ఫీజులే వర్తించనున్నాయి.

# అధికారమిస్తే బీసీని సీఎం చేస్తాం

**హైదరాబాద్(జనంసాక్షి):** భాజపా ప్రజాస్వామ్య పార్టీ అని కేంద్రమంత్రి బండి సంజయ్ అన్నారు. రాష్ట్ర అధ్యక్ష పదవికి నామినేషన్ ఎవరైనా వేసుకోవచ్చని..అధిష్ఠానం చెప్పిన ప్రకారం నడుచుకోవాలని సూచించారు. నాంపల్లిలోని భాజపా కార్యాలయంలో మీడియాతో ఆయన మాట్లాడారు."భాజపా అధిష్ఠానం ఇంకా అధ్యక్షుడిని అధికారికంగా ప్రకటించలేదు. భాజపా.. ఎవరో చెప్పారని అధ్యక్షుడిని నియమించే పార్టీ కాదు. అధిష్ఠానం చెప్పిన వ్యక్తే అధ్యక్షుడు అవుతారు. పార్టీకి వ్యతిరేకంగా వ్యవహరించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో భాజపా అధికారంలోకి వస్తుంది.. బీసీని సీఎం చేస్తాం. అధిష్ఠానం నిర్ణయానికి కార్యకర్తలు కట్టుబడి ఉంటారు. దళితులను సీఎం చేస్తామని భారాస మోసం చేసింది. ఆ పార్టీ బీసీలకు సీఎం, పార్టీ అధ్యక్ష పదవులు ఇస్తామని ప్రకటించగలదా?"అని సంజయ్ వ్యాఖ్యానించారు.

# ఏపీ భాజపా అధ్యక్షుడిగా పీవీఎన్ మాధవ్ పేరు ఖరారు



**విజయవాడ(జనంసాక్షి):** ఏపీ భాజపా అధ్యక్షుడి ఎంపిక కొలిక్కి వచ్చింది. అధ్యక్ష పదవికి మాజీ ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్ పేరును ఆ పార్టీ అధిష్ఠానం ఖరారు చేసింది. ప్రస్తుతం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఉన్న ఆయన.. గతంలో శాసన మండలిలో భాజపా ఫ్లోర్ లీడర్‌గా పనిచేశారు. ఆర్‌ఎస్‌ఎస్, బీజేవైఎంలో బాధ్యతలు నిర్వర్తించారు. మాధవ్.. భాజపా సీనియర్ నేత, దివంగత చలపతిరావు కుమారుడు. ఆయన తండ్రి రెండుసార్లు ఎమ్మెల్సీగా పనిచేశారు. అధ్యక్ష పదవికి మధ్యాహ్నం 2 గంటల తర్వాత మాధవ్ నామినేషన్ దాఖలు చేయనున్నారు. విజయవాడలోని భాజపా రాష్ట్ర కార్యాలయంలో మంగళవారం అధ్యక్ష ఎన్నిక నిర్వహించనున్నారు. కర్ణాటక ఎంపీ మోహన్ ఎన్నికల పరిశీలకుడిగా వ్యవహరించనున్నారు.

# కమలదళపతిగా రామచందర్‌రావు

వినిపించాయి. ఈ క్రమంలో రామచందర్‌రావు పేరును ఖరారు చేశారు. ఆరెస్సెస్‌తో పాటు కొందరు సీనియర్ నేతలు ఆయన పేరును బలంగా ప్రతిపాదించినట్లు తెలిసింది. అధికార కాంగ్రెస్‌ను ఎదుర్కోవడం, పార్టీని బలోపేతం చేయడం, స్థానిక సంస్థల ఎన్నికలు తదితర అంశాలను కొత్త అధ్యక్షుని ఎంపికలో పరిగణనలోకి తీసుకున్నట్లు సమాచారం. ఇకపోతే గత 40 ఏళ్లుగా పార్టీలో రామచంద్రరావు వివిధ హోదాల్లో పనిచేశారు. విద్యార్థి పరిషత్ నాయకుడిగా, లాయర్‌గా సేవలు అందించారు. ముందునుంచి పార్టీలో ఉంటూ సేవ చేసిన కారణంగా ఆయనను అధ్యక్ష పదవి వరించింది. అంతా కలిసికట్టుగా ముందుకెళ్తాం అని బిజెపి మాజీ ఎమ్మెల్సీ రామచందర్ రావు తెలిపారు. బిజెపి పార్టీలో ఆధిపత్య పోరు లేదని అన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. వివాద రహితుడుగా అవకాశం ఇచ్చిందని, 40 ఏళ్లుగా పార్టీకి చేస్తున్న సేవను అధిష్టానం గుర్తించిందని తెలియజేశారు. ఇప్పటికే ఆశావాహుల్లో అనేక మంది పేర్లు తెరపైకి వచ్చినప్పటికీ మాజీ ఎమ్మెల్సీ రామచందర్ రావు పేరును జాతీయ నాయకత్వం ఖరారు చేసినట్లు వార్తలు వినిపిస్తున్నారు. పార్టీలో అంతర్గత కుమ్ములాటలు ఉన్నట్లు వస్తున్న వార్తలు అవాస్తవమన్నారు. అందరినీ కలుపుకుని ముందుకు వెళ్తానని స్పష్టం చేశారు. తెలంగాణలో బీజేపీని అధికారంలోకి తీసుకువచ్చేందుకు తన వంతు కృషి చేస్తానని మాజీ ఎమ్మెల్సీ రామచందర్ రావు వెల్లడించారు. ఇక తెలంగాణ బీజేపీ అధ్యక్ష పదవికి, జాతీయ కౌన్సిల్ సభ్యుల ఎన్నికకు సంబంధించి ఆదివారం నోటిఫికేషన్ విడుదలైన విషయం తెలిసిందే. బీజేపీ ఎన్నికల ఇంచార్జ్ కేంద్రమంత్రి శోభా కరంద్లజే సమక్షంలో నామినేషన్ దాఖలు చేయనున్నారు. రామచందర్‌రావు నామినేషన్‌ను రిటర్నింగ్ అధికారి యెండల లక్ష్మీ నారాయణ స్వీకరించనున్నారు. పార్టీ విధేయుడిగా, సౌమ్యుడిగా గుర్తింపు పొందిన రామచందర్ రావుకే సంఘ్‌తో పాటు పలువురు సీనియర్ నాయకులు మద్దతు తెలిపినట్లు తెలుస్తోంది. మంగళవారం రామచందర్ రావు పేరును అధికారికంగా ప్రకటించే అవకాశం ఉంది. ఇదిలావుంటే గోషామహల్ ఎ÷-మెల్యే రాజాసింగ్ మరోమరు సంచలన ప్రకటన చేశారు. తెలంగాణలో భాజపా అధ్యక్షుడి నియామకంపై ఆ పార్టీ ఎమ్మెల్యే రాజాసింగ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. 'రాష్ట్ర అధ్యక్షుడిగా ఒక వ్యక్తిని అధిష్ఠానం నిర్ణయించినట్లు ప్రచారం జరుగుతోంది. అధ్యక్షుడిని బూత్ కార్యకర్త నుంచి ముఖ్య నేత వరకు ఓటేసి ఎన్నుకోవాలి. నావాడు, నీవాడు అంటూ నియమించుకుంటూ పోతే పార్టీకి తీవ్ర నష్టం. తెలంగాణలో భాజపా అధికారంలోకి రావాలంటే ఎన్నిక నిర్వహించాలి' అని రాజాసింగ్ పేర్కొన్నారు.

# భాజపాలో ప్రజస్వామ్యం లేదు

2014 నుంచి ఎన్నో ఇబ్బందులు పడ్డానన్నారు. తాను టెర్రరిస్టుల హిట్ లిస్ట్‌లో ఉన్నానని గుర్తు చేశారు. తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రాకూడదని పార్టీలోని కొందరు పెద్ద నాయకులు కోరుకుంటున్నారని వివరించారు. అందుకు ఇక తాను బీజేపీలో కొనసాగలేనని ఆయన స్పష్టం చేశారు. తనకు మద్దతు ఇస్తే.. పార్టీ నుంచి సస్పెండ్ చేస్తామంటూ తన అనుచరులను కొందరు బెదిరించారని ఆరోపించారు. బీజేపీ అధ్యక్ష పదవికి పోటీ చేసేందుకు తాను ముహూర్తం సైతం చూసుకున్నానని తెలిపారు. ఈ క్రమంలో రాజీనామా చేస్తూ..మీకో దండం.. మీ పార్టీకో దండమని బీజేపీ అగ్రనాయకత్వాన్ని ఉద్దేశించి ఎమ్మెల్యే రాజా సింగ్ కీలక వ్యాఖ్యలు చేశారు. మరో వైపు తెలంగాణ రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడిగా రామచందర్ రావు పేరును పార్టీ అగ్రనాయకత్వం ఖరారు చేసింది. ఇప్పటికే ఆయన నామినేషన్ దాఖలు చేశారు. రామచందర్ రావు పేరును మంగళవారం ప్రకటించే అవకాశముంది. అదీకాక కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా ఆదివారం తెలంగాణలో పర్యటించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడిగా రామచందర్ రావు పేరును ఎంపిక చేసినట్లు రాష్ట్ర నేతలకు ఈ సందర్భంగా అమిత్ షా సూచించినట్లు తెలుస్తోంది. ఆయన పేరును అధికారికంగా పార్టీ ఎన్నికల కమిటీ మంగళవారం ప్రకటించనుంది. ఇక మరో నామినేషన్ దాఖలైతే ఎన్నికలు అనివార్యమయ్యే పరిస్థితి ఏర్పడేది. కానీ నామినేషన్ దాఖలు చేసేందుకు తన అనుచరగణంలో పార్టీ కార్యాలయానికి వెళ్లిన ఎమ్మెల్యే రాజాసింగ్‌ను లోపలికి అనుమతి ఇవ్వలేదు. దీంతో బీజేపీకి రాజాసింగ్ గుడ్ బై చెప్పారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్ష పదవికి తనను నామినేషన్ వెయ్యనివ్వలేదని ఆరోపించారు. బీజేపీ అధ్యక్ష పదవికి నామినేషన్ వేయడానికి వస్తే.. తన మద్దతుదారులను కొందరు బెదిరించారని, జాతీయ కౌన్సిల్ సభ్యులు మద్దతు ఇవ్వకుండా బెదిరించారనన్నారు. పార్టీలో ఉంటారా? సస్పెండ్ చేయాలా? అని హెచ్చరించారని తెలిపారు. నామినేషన్ పత్రాలపై సంతకాలు చేయనివ్వలేదన్నారు. నా నామినేషన్ పత్రంపై సంతకం చేసేందుకు పది మంది సిద్ధంగా ఉన్నారని.. కానీ, మద్దతుదారులను నామినేషన్‌పత్రంపై సంతకాలు చేయనివ్వలేదని విమర్శించారు. నా విషయంలో లక్షలాది మంది కార్యకర్తలు బాధపడుతున్నారన్నారు. రామచందర్‌రావుకు అధ్యక్ష పదవి ఇవ్వడంపై కార్యకర్తల్లో అసంతృప్తి ఉందన్నారు. 2014 నుంచి అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నానన్నారు. బీజేపీ అధ్యక్ష పదవి ఎవరికి ఇవ్వాలో ముందే డిసైడ్ చేశారని, అన్నారు. ఆ పార్టీకి రాజీనామా చేసిన హిందుత్వం కోసం పోరాడుతూనే ఉంటానన్నారు. తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రాకుండా ఉండేందుకు బీజేపీ నాయకులు అడ్డుపడుతున్నారని ఆరోపించారు. ఇంకోవైపు ఎమ్మెల్యే రాజాసింగ్‌తో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ సమావేశమయ్యారు. పార్టీకి రాజీనామా చేయడంపై మరోసారి ఆలోచించాలంటూ రాజాసింగ్‌కు బండి సంజయ్ సూచించారు. అయితే పార్టీకి రాజీనామా నిర్ణయం జరిగిపోయిందంటూ స్పష్టం చేశారు. దీనిపై పునరాలోచన లేదని కేంద్ర మంత్రి బండి సంజయ్‌కు కుండ బద్దలు కొట్టారు.

# అర్ధరాత్రి నుంచి రైల్వే ఛార్జీల మోత

కి.మీ వరకు టికెట్‌పై రూ.15 చొప్పున పెంచారు. ఆర్డినరీ స్లీపర్ క్లాస్, ఫస్ట్ క్లాస్ ఆర్డినరీ టికెట్లపై కి.మీకు అరపైసా చొప్పున పెంచగా.. మెయిల్/ఎక్స్‌ప్రెస్ (నాన్ ఏసీ) రైళ్లలో టికెట్లపై నాన్ ఏసీ ఫస్ట్, సెకండ్ క్లాస్, స్లీపర్ క్లాస్ టికెట్లపై కి.మీకు ఒక పైసా చొప్పున పెంచారు. అలాగే, అన్ని రకాల రైళ్లలో ఏసీ అన్ని తరగతులకు కి.మీకు 2పైసలు చొప్పున పెంచుతున్నట్లు రైల్వేశాఖ తెలిపింది. రిజర్వేషన్ ఛార్జ్, సూపర్‌ఫాస్ట్ సర్‌ఛార్జీల్లో మాత్రం మార్పు ఉండదని స్పష్టం చేసింది. ఇప్పటికే రిజర్వేషన్ చేసిన టికెట్లకు పెంచిన ఛార్జీలు అమలు కావని తెలిపింది.

# భారీ వర్షాలతో ఉత్తరాది అతలాకుతలం

**సిమ్లా(జనంసాక్షి):** ఉత్తరాదిని భారీ వర్షాలు ముంచెత్తుతున్నాయి. ముఖ్యంగా హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్‌లను కుదిపేస్తున్నాయి. హిమాచల్‌లోని 10 జిల్లాలకు వాతావరణ విభాగం వరద హెచ్చరికలు జారీ చేసింది. శిమ్లాలో ఓ ఐదంతస్తుల భవనం కుప్పకూలింది. ముందుజాగ్రత్త చర్యగా అందులోని నివాసితులను అధికారులు ముందే అక్కడినుంచి ఖాళీ చేయించడంతో ప్రాణనష్టం తప్పింది. సమీపంలోని మరిన్ని భవనాలకూ ముప్పు పొంచి ఉన్న నేపథ్యంలో అధికారులు అప్రమత్తమయ్యారు. మండీ, సిర్మౌర్ జిల్లాల్లో రోడ్లు తీవ్రంగా దెబ్బతిన్నాయి. సోలన్‌లో ఓ వంతెన కొట్టుకుపోయింది. రెడ్ అలర్ట్ నేపథ్యంలో.. కాంగ్రా, మండీ, సోలన్, సిర్మౌర్ జిల్లాల్లో విద్యాసంస్థలకు సోమవారం సెలవు ప్రకటించారు. ఈ ఏడాది వర్షాకాలం ప్రారంభం నుంచి రాష్ట్రంలో 20 మంది మృతి చెందినట్లు అధికారులు తెలిపారు. 2023లో వర్షాకాలంలో 550 మంది ప్రాణాలు కోల్పోయారు. ఉత్తరాఖండ్‌లో వరదల కారణంగా నిలిచిపోయిన చార్‌ధామ్ యాత్ర సోమవారం పునః ప్రారంభమైంది. 24 గంటల నిషేధాన్ని ఎత్తేసినట్లు అధికారులు ప్రకటించారు. ఉత్తర్‌కాశీ జిల్లాలో కుంభవృష్టి కారణంగా యమునోత్రి జాతీయ రహదారిలోని సిలాయ్ బైండ్‌లో ఆదివారం కొండచరియలు విరిగిపడిన విషయం తెలిసిందే. దీంతో నిర్మాణంలో ఉన్న ఓ హోటల్ కుప్పకూలింది. ఈ ఘటనలో గల్లంతైన ఏడుగురి ఆచూకీ కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నట్లు అధికారులు వెల్లడించారు. యమునోత్రి రహదారికి మరమ్మతులు చేపట్టినట్లు తెలిపారు.

## సున్నం చెరువులో ఆక్రమణల తొలగింపు

కూల్చేశారు. చెరువు సమీపంలో అక్రమంగా వేసిన బోరు మోటార్లను తొలగించారు. ఇక్కడ ఏళ్ల తరబడి అక్రమ నీటి వ్యాపారం సాగుతోంది. చెరువు పరిధిలోని భూగర్భ జలాలను వినియోగించొద్దని హైడ్రా సూచించింది. అక్రమంగా నీటిని తరలిస్తున్న పలు వాటర్ ట్యాంకర్లను సీజ్ చేసింది.

# జులై 9 సార్వత్రిక సమ్మెకు వామపక్షాల మద్దతు




హైదరాబాద్ (జనంసాక్షి) : పది కేంద్ర కార్మిక సంఘాలు, అఖిల భారత స్థాయి రంగాలవారీగా స్వతంత్ర సమాఖ్యలు, సంస్థలతో కూడిన కార్మిక సంఘాల సంయుక్త వేదిక ఇచ్చిన పిలుపు మేరకు జులై 9 వ తేదీన జరగనున్న సార్వత్రిక సమ్మెకు తెలంగాణ రాష్ట్రంలోని వామపక్ష పార్టీలు తమ పూర్తి మద్దతు ప్రకటించాయి. ఈ మేరకు ఎంబీ భవన్‌లో సమావేశంలో పాల్గొన్న వామపక్ష నాయకులు మద్దతు ప్రకటిస్తున్నట్టు ప్రకటించారు. ఈ సందర్భంగా వామపక్ష నాయకులు మాట్లాడుతూ కార్మికుల మౌలిక ప్రజాస్వామ్య హక్కులను తీవ్రంగా కుదించడానికి ఉద్దేశించిన కార్పొరేట్ ఎజెండాలో కీలక భాగమైన లేబర్ కోడ్ అమలుచేయాలని కేంద్ర బిజెపి ప్రభుత్వం పూనుకుంటున్నదని, ఈ లేబర్ కోడ్లకు వ్యతిరేకంగా ఈ సార్వత్రిక సమ్మెకు కార్మిక సంఘాలు పిలుపునిచ్చాయని తెలిపారు. మూడోసారి అధికారంలోకి వచ్చిన బిజెపి నేతృత్వంలోని ప్రభుత్వం తన నయా ఉదారవాద ఎజెండాను దూకుడుగా అమలు చేయాలని చూస్తోందన్నారు. అందులో లేబర్ కోడ్లు ప్రధానమైన భాగంగా ఉన్నాయని, కీలకమైన జాతీయ వనరులను ముఖ్యంగా రక్షణ, కమ్యూనికేషన్ వంటి వ్యూహాత్మక రంగాలను ప్రయివేటీకరించే దిశగా చాలా వేగంగా ప్రభుత్వం ముందుకెళుతోందని, ఈ విధానాలను వ్యతిరేకిస్తూ జరుగుతున్న ఉద్యమాలను అణచివేయాలని చూస్తోందని తెలిపారు. రైతాంగం, వ్యవసాయ కార్మికులు, విస్తృత స్థాయిలో ప్రజానీకం వ్యక్తం చేస్తున్న ఆందోళనలతో సహా కార్మిక సంఘాలు లేవనెత్తిన డిమాండ్లను జులై 9 నాటి సార్వత్రిక సమ్మె ఎలుగెత్తి చాటుతుందని తెలిపారు. ఈ సార్వత్రిక సమ్మెకు సంయుక్త కిసాన్‌మోర్చా, వ్యవసాయ కార్మిక సంఘాలు, ఇతర సంఘాలు మద్దతును ఇచ్చాయి. సమ్మెకు మద్దతుగా గ్రామాల్లో ప్రదర్శనలు, మండల కేంద్రాల్లో సభలకు పిలుపునిచ్చాయి. ఆ రోజున పెద్దసంఖ్యలో ప్రజలను సమీకరించాలని పిలుపునిచ్చాయి. కార్మికులను విభజించేందుకు, విద్వేషాన్ని వ్యాప్తి చేసేందుకు జరుగుతున్న ప్రయత్నాలకు వ్యతిరేకంగా కార్మిక లోకం ఐక్యతను బలోపేతం చేయడానికి రైతాంగం సంఘీభావ చర్యలతోపాటు ఈ సార్వత్రిక సమ్మె దోహదపడుతుందని తెలిపారు. సార్వత్రిక సమ్మెకు మద్దతునివ్వాల్సిందిగా వామపక్షాలు ప్రజలకు పిలుపునిస్తున్నాయి. సమ్మెను జయప్రదం చేసేందుకు విస్తృతంగా ప్రచారం చేయాలని, పెద్ద సంఖ్యలో ప్రజలను సమీకరించాలని పార్టీల శాఖలన్నింటికీ పిలుపునిచ్చాయి. సీపీఎం, సీపీఐ రాష్ట్ర కార్యదర్శులు జాన్‌వెస్లీ, కూనంనేని సాంబశివరావు, సీపీఐఎంఎల్ (మాస్‌లైన్) సెక్రటేరియేట్ సభ్యులు ఎం.హన్మేష్, సీపీఐ ఎంఎల్ (న్యూడెమోక్రసీ) నాయకులు సాదినేని వెంకటేశ్వర్‌రావు, ఎంసీపీఐయూ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వనం సుధాకర్, సీపీఐ ఎంఎల్ (లిబరేషన్) రాష్ట్ర కార్యదర్శి మామిండ్ల రమేష్‌రాజా, ఎస్‌యూసీఐ(సీ) రాష్ట్ర కార్యదర్శి సీహెచ్ మురహరి తదితరులు పాల్గొన్నారు.

# టీజీఎస్‌ఆర్టీసీ మరో ముందడుగు

**ఆటోమెటిక్ ఫేర్ కలెక్షన్ సిస్టంతో ప్రజలకు మెరుగైన సేవలు**

**రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్**

**ముషీరాబాద్ డిపోలో పరిశీలన**



హైదరాబాద్ (జనంసాక్షి) : అత్యాధునిక సాంకేతికతను అందిపుచ్చుకుంటూ ప్రజలకు మెరుగైన, నాణ్యమైన సేవలతో ఆర్టీసీ ముందుకువెళ్తోందని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. హైదరాబాద్‌లో అమలు చేస్తోన్న ఆటోమెటిక్ ఫేర్ కలెక్షన్ సిస్టం(ఏఎఫ్‌సీఎస్)తో ఆర్టీసీ సిబ్బంది వేగంగా సేవలందిస్తున్నట్లు ఆయన చెప్పారు. ముషీరాబాద్ డిపోను ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనర్‌తో కలిసి మంత్రి పొన్నం ప్రభాకర్ సోమవారం పరిశీలించారు. ఏఎఫ్‌సీఎస్‌లో భాగంగా ఐటిమ్స్, డిజిటల్ పేమెంట్స్ అమలు తీరును స్వయంగా పరిశీలించారు. క్షేత్రస్థాయిలో ఈ వ్యవస్థ ఎంత సులభతరంగా ఉందో కండక్టర్లు ఆయనకు వివరించారు. అంతకముందు ఆర్టీసీ ఉన్నతాధికారులతో కలిసి ముషీరాబాద్ డిపో ప్రాంగణంలో మొక్కలు నాటారు. హైదరాబాద్‌లోని ఆర్టీసీ బస్సుల్లో ఏఎఫ్‌సీఎస్ అమలు చేస్తోన్న తీరుపై మంత్రి పొన్నం ప్రభాకర్ సంతృప్తి వ్యక్తం చేశారు. "గత మూడు నెలలుగా ఏఎఫ్‌సీఎస్‌ను తమ బస్సుల్లో ఆర్టీసీ అమలు చేస్తోంది. ప్రతి రోజు సగటున 20 శాతం మంది ఈ సదుపాయాన్ని వినియోగించుకుంటున్నారు. త్వరలోనే అన్ని బస్సుల్లోనూ ఈ వ్యవస్థను ఆర్టీసీ అందుబాటులోకి తీసుకువస్తుంది." అని పొన్నం ప్రభాకర్ అన్నారు. భారతదేశంలో ఎక్కడ లేని విధంగా టీజీఎస్‌ఆర్టీసీలో ఆధునిక సంస్కరణలను ప్రవేశపెడుతున్నామని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన మహాలక్ష్మి-మహిళలకు ఉచిత ప్రయాణ సదుపాయం ఆర్టీసీకి ఆర్థికంగా ఎంతో మేలు చేస్తోందని అన్నారు. ఈ పథకంలో భాగంగా ఇప్పటివరకు 191 కోట్ల జీరో టికెట్లను ఆర్టీసీ జారీ చేసిందని, తద్వారా రూ.6300 కోట్లను మహిళలు ఆదా చేసుకున్నారని తెలిపారు. త్వరలోనే ఔటర్ రింగ్ రోడ్డు లోపల మొత్తం ఎలక్ట్రిక్ బస్సులను నడిపేలా ఆర్టీసీ చర్యలు తీసుకుంటుందని పేర్కొన్నారు. అలాగే, కొత్త కాలనీలకు ప్రజా రవాణా సేవలను విస్తరింపజేస్తామని, అందుకు ఆర్టీసీ అధికారులను సంప్రదించాలని ప్రజలకు సూచించారు. ఏఎఫ్‌సీఎస్‌లో భాగంగా ప్రస్తుతం క్యూఆర్ కోడ్ టికెటింగ్ అందుబాటులో ఉందని, త్వరలోనే వాట్సాప్ టికెటింగ్, డిజిటల్ బస్ పాస్‌ల సదుపాయాన్ని అమల్లోకి తీసుకువస్తున్నట్లు ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనర్ తెలిపారు. వాట్సాప్ యాప్‌లో ప్రయాణ వివరాలను నమోదు చేసి సులువుగా టికెట్లు పొందవచ్చని వివరించారు. ఆర్టీసీ యాప్‌లో డిజిటల్ బస్ పాస్‌లను పొందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. వాట్సాప్, డిజిటల్ బస్ పాస్‌లను కండక్టర్ల వద్ద ఉండే ఐటిమ్స్‌తో స్కాన్ చేసి.. రాకపోకలు సాగించవచ్చని పేర్కొన్నారు.

**పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు సన్మానం**

ముషీరాబాద్ డిపో ప్రాంగణంలో జరిగిన పదవీ విరమణ కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్, ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనర్ పాల్గొన్నారు. బస్ భవన్‌లో పదవీ విరమణ పొందిన జె.భాస్కర్, సీసీఈ, జి. సుధాకర్ రెడ్డి, పీవో, పి. శ్రీనివాస రావు, అకౌంట్స్ ఆఫీసర్‌తో పాటు డిప్యూటి సూపరింటెండెంట్‌లు రామచంద్రయ్య, సత్యనారాయణ రావు, శ్రీనివాస రెడ్డిలను సన్మానించారు. అలాగే, ముషీరాబాద్ డిపోలో రిటైర్డ్ అయిన భగవంత్ టీఐ3, జీఎం చారి, ఏడీసీ, ప్రభు సింగ్, ఏఎస్సై, సీహెచ్ రమేశ్, కండక్టర్, డ్రైవర్లు ఎల్. నరేందర్, మహేందర్ రావు, కె. యాదగిరి, హెల్పర్‌ను సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ ఈడీలు మునిశేఖర్, వెంకన్న, రాజశేఖర్, ఫైనాన్స్ అడ్వైజర్ విజయపుష్ప, సీపీఎం ఉషాదేవి, సీఈఐటీ శ్రీదేవి, హైదరాబాద్ ఆర్ఎం సుధా పరిమళ, తదితరులు పాల్గొన్నారు.

# స్వేచ్ఛ మరణాన్ని సంచలనం చేయొద్దు

**మైనర్ల విషయంలో నిబంధనలు అతిక్రమించకూడదు...**

**పాప వీడియోలను ఇప్పటికే డిజిటల్ లో అప్లోడ్ చేసినవారు వెంటనే యూట్యూబ్ నుంచి తొలగించాలి...**

**మీడియా యాజమాన్యాలకు మహిళా జర్నలిస్టుల విజ్ఞప్తి...**



హైదరాబాద్ (జనంసాక్షి) : స్వేచ్ఛ మరణాన్ని చాలా ఛానెల్స్, యూట్యూబ్ ఛానల్స్, సోషల్ మీడియాలో సంచలనం చేసే ప్రయత్నం చేస్తున్నారని, వ్యూస్ కోసం బాధితురాలిని, ఆమె కుటుంబ సభ్యులను రోడ్ మీదకు లాగే ప్రయత్నాలు జరుగుతున్నాయని, ఇది ఎంతవరకు సమంజసం కాదని మహిళా జర్నలిస్టులు పేర్కొన్నారు. ఇది బాధితురాలికి ఏమాత్రం న్యాయం చేయదు. ఏదైనా ఒక ఘటనను రిపోర్ట్ చేయడం వరకే జర్నలిస్టుల పని.. కానీ విచారణ కాదు.. దానికంటూ పోలీసులు, చట్టం ఉన్నాయని, ఆ విషయాన్ని మనం ఎవ్వరం మర్చిపోకూడదని పేర్కొన్నారు. హైదరాబాద్ ప్రెస్‌క్లబ్‌లో మహిళా జర్నలిస్టులు మాట్లాడారు.ప్రెస్ కౌన్సిల్ నిబంధనలను పాటిస్తూ మన మీడియా వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు. మైనర్ల విషయంలో అన్ని మీడియా ఛానెల్స్, డిజిటల్, సోషల్ మీడియా నిబంధనలను అతిక్రమించాయని, ప్రజాస్వామ్యంలో ఫోర్త్ ఎస్టేట్ గా ఉన్న మీడియా సెన్సేషన్ కోసం సెన్సిటివిటి నీ మరిచిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.. స్వేచ్ఛ కూతురు ఫోటోలను, వీడియో లను వెంటనే తొలగించాలని, స్వేచ్ఛ నీ మరోసారి చంపొద్దు..అని విజ్ఞప్తి చేశారు. ఇది ఏ ఒక్క స్వేచ్ఛ కోసం కాదు.. చిన్నారుల విషయంలో, మహిళల విషయంలో మీడియా, డిజిటల్ మీడియా, సోషల్ మీడియా ఎడిటర్స్, గిల్డ్ ఆఫ్ ఇండియా గైడ్ లైన్స్ పాటించాలి.. స్వేచ్ఛ మరణాన్ని రాజకీయం చెయ్యొద్దు. పోలీసులకు, ప్రభుత్వానికి కూడా స్వేచ్ఛ కేసును న్యాయబద్ధంగా విచారణ జరిపి స్వేచ్ఛ కు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

# బీజేపీపై దుష్ప్రచారం చేస్తే కఠిన చర్యలు

**బీసీకి అధ్యక్ష పదవి గురించి అడిగే నైతిక హక్కు బీఆర్ఎస్ కు లేదు**

**కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్**




హైదరాబాద్, జూన్ 30 (జనంసాక్షి) : "ప్రపంచంలోనే అత్యధిక సభ్యత్వమున్న పార్టీ బీజేపీ. దేశంలో, అనేక రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న పార్టీ. సిద్ధాంతం కోసం కమిట్ మెంట్ తో పనిచేసే లక్షలాది కట్టర్ కార్యకర్తలున్న పార్టీ బీజేపీ. అంత గొప్ప చరిత్ర కలిగిన బీజేపీ ఒకరు చెబితేనే, ఇంకొకరు ఒత్తిడి తెస్తేనో తలొగ్గి నిర్ణయం తీసుకునే పార్టీ బీజేపీ కాదనే విషయాన్ని గుర్తుంచుకోవాలి" అంటూ కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. రామచంద్రరావు పేరును బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఖరారు చేయడం వెనుక చంద్రబాబు కీలక పాత్ర పోషించారంటూ సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారంపై విలేకరులు అడిగిన ప్రశ్నకు బండి సంజయ్ పైవిధంగా స్పందించారు. ఇది కావాలని కొంతమంది చేస్తున్న దుష్ప్రచారమన్నారు. అట్లాంటి వారిపై కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు. బీజేపీలోనూ కొందరు ఇలాంటి ప్రచారమే చేస్తున్నారంటూ మీడియా ప్రస్తావించగా "బీజేపీలో అట్లాంటివి జరగవు. ఇట్లాంటి పోకడలను ఇప్పడే చూస్తున్నా. ఇది కరెక్ట్ కాదు. బండి సంజయ్ ఉంటేనే పార్టీ ఉన్నట్లు, లేకపోతే పార్టీయే లేనట్లు అనుకుంటే అంతకంటే మూర?త్వం ఇంకోటి లేదు. ఎవరు లేకపోయినా పార్టీ నడుస్తుందనే విషయాన్ని గుర్తుంచుకోవాలి"అని స్పష్టం చేశారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్ష పదవి కోసం నామినేషన్లు స్వీకరిస్తున్న నేపథ్యంలో బండి సంజయ్ పార్టీ రాష్ట్ర కార్యాలయానికి విచ్చేసిన బండి సంజయ్ ను ఈ అంశంతోపాటు మీడియా అడిగిన పలు ప్రశ్నలకు బండి సంజయ్ కుండ బద్దలు కొట్టినట్లుగా సమాధానమిచ్చారు. "జాతీయ నాయకత్వం ఇంకా రాష్ట్ర అధ్యక్షుడి పేరును ప్రకటించలేదు. పదవి కోసం ఎవరైనా నామినేషన్ వేసే అవకాశముంది. అధ్యక్షుడు కావాలని కోరుకోవడంలో కూడా తప్పులేదు. కానీ అన్ని విషయాలను పరిగణలోకి తీసుకుని పార్టీ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని హైకమాండ్ నిర్ణయం తీసుకుంటుంది. దానికి కట్టుబడి ఉండాల్సిన బాధ్యత కమిట్ మెంట్ తో పనిచేసే ప్రతి కార్యకర్తపై ఉంది. ఎవరికి ఏ బాధ్యత అప్పగించాలో హైకమాండ్ నిర్ణయిస్తది. అధ్యక్ష పదవి రానంత మాత్రాన మిగితా వాళ్లు డమ్మీ అనుకోవడం కూడా సరికాదు" అని అన్నారు.



# 8వ వేతన సవరణ కమిషన్ ఏర్పాటు చేయాలి

**తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి నారాయణ రెడ్డి, పి కృష్ణమూర్తి**

హైదరాబాద్ (జనంసాక్షి) : 8వ వేతన సవరణ కమిషన్‌ను ఏర్పాటు చేయాలని తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి నారాయణ రెడ్డి, పి కృష్ణమూర్తి చేశారు. ఆ సంఘం రాష్ట్ర కమిటీ సమావేశం పి నారాయణ రెడ్డి అధ్యక్షతన కార్యాలయ భవనంలో జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల, పెన్షనర్ల వేతన/పెన్షన్ సవరణకు ఢిల్లీ ఎన్నికలకు ముందు త్వరలోనే వేతన సవరణ అని కేంద్రం ప్రకటించిందని, 6 నెలలు కావస్తున్నా కమిషన్‌ను ఏర్పాటు చేయలేదని, టర్మ్స్ ఆఫ్ రిఫరెన్స్ ని ప్రకటించలేదు. వచ్చే జనవరి మొదటి తేదీ నుండి సవరణ జరగాల్సి ఉండగా ఇప్పటికి కూడా కమిషన్ నియమించలేదనీ, వెంటనే నియామకం చేయాలని డిమాండ్ చేస్తూ ప్రధాన మంత్రి గారికి ఈ మెయిల్ క్యాంపెయిన్ చేయాలని సూచించారు. జులై 9వ తేదీన దేశవ్యాప్తంగా జరుగుతున్న సార్వత్రిక సమ్మెలో ప్రత్యక్షంగా పాల్గొనాలని సూచించారు. ఈ సమావేశంలో ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి, నాగేశ్వర్ రావు, ఎం రంగయ్య, యు. ఆంజనేయులు, డా. ఎల్. అరుణ, ఎం జనార్ధన్ రెడ్డి, స్వరాజ్ కుమార్ భట్, ఎన్ బ్రహ్మాచారి, జి అశోక్, వై కొండల్ రావు, టి సీతారాం, కృష్ణారావు, రాంమోహన్, వైకుంఠరావు, సోమయ్య, కృష్ణమోహన్, శివలింగం, శంకర్ రావు, బాలరాజు, రామారావు, జి నర్సింగరావు, రాధాకృష్ణ, శంకర్ రావు, బాలగంగాధర్, గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

# నిరుద్యోగ యువతకు శుభవార్త

**ఉచితంగా డేటా ఇంజినీర్ కోర్సు**

**'శ్రీ సత్యసాయి స్కిల్ డెవలప్‌మెంట్'లో భాగంగా డేటా ఇంజినీర్ కోర్సు ప్రకటన**



కరీంనగర్/ వరంగల్/ మహబూబ్ నగర్, జూన్ 30 (జనంసాక్షి) : శ్రీ సత్యసాయి సేవా సంస్థ, నిరుద్యోగ యువత కోసం శ్రీ సత్యసాయి స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమంలో భాగంగా ఉచిత డేటా ఇంజనీర్ కోర్సును అందిస్తోంది. ఈ కోర్సుకు 2022-2025 మధ్య బీఎస్సీ, ఎమ్మెస్సీ, బీటెక్, ఎంటెక్ లేదా ఎంసీఏ పూర్తిచేసిన పట్టభద్రులు అర్హులు. ఆసక్తి ఉన్నవారు www.sethu.aiలో నమో దు చేసుకోవచ్చు లేదా 9052372023 కు ఫోన్ చేసి వివరాలు తెలుసుకోవచ్చు. ఎంపికైన అభ్యర్థులకు బేసిక్, అడ్వాన్స్‌డ్ పైథాన్, ఎస్ క్యూఎల్, బీఐ టూల్స్‌తో పాటు సాఫ్ట్ స్కిల్స్‌లో 90 రోజుల పాటు శిక్షణ ఇస్తారు. తరగతులు హైదరాబాద్‌లోని సత్యసాయి స్కిల్ సెంటర్‌లో ఆఫ్‌లైన్‌లో జరుగుతాయి. కోర్సు పూర్తయిన తర్వాత ప్లేస్‌మెంట్ సహాయం కూడా అందిస్తారు.

# స్వేచ్ఛ ఆత్మహత్యలో పూర్ణ ప్రమేయం లేదు

**పూర్ణచందర్ అమాయకుడని భార్య స్వప్న వ్యాఖ్య**

హైదరాబాద్, జూన్ 30(జనంసాక్షి) : ప్రముఖ టీవీ చానల్ న్యూస్ యాంకర్ స్వేచ్ఛ వొటార్కర్ (40) అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన కేసులో నిందితుడు పూర్ణచందర్ భార్య స్వప్న తెరపైకి వచ్చారు. నా భర్త పూర్ణచందర్ నిర్దోషి, అమాయకుడని స్వప్న సంచలన వ్యాఖ్యలు చేశారు.పూర్ణ చందర్ ద్వారానే స్వేచ్ఛ తనకు పరిచయం అయిందన్నారు. వారిద్దరి మధ్య సంబంధం గురించి ముందు తనకు తెలియదన్నారు. వారిద్దరి వ్యవహారం తెలిశాక పూర్ణను వదిలేశానని పేర్కొన్నారు. పూర్ణచందర్‌పై స్వేచ్ఛ కూతురు అరణ్య చేస్తున్న ఆరోపణలు అసత్యమని, అరణ్యను పూర్ణచందర్ సొంత కూతురిలా చూసుకున్నాడని స్వప్న వ్యాఖ్యానించారు. స్వేచ్ఛ నన్ను మానసికంగా టార్చర్ చేసిందని, స్వేచ్ఛ పూర్ణచందర్‌ను బ్లాక్‌మెయిల్ చేసిందని స్వప్న షాకింగ్ కామెంట్స్ చేశారు. నా పిల్లలను కూడా అమ్మా అని పిలవాలని భయపెట్టిందని స్వప్న వివరించారు. స్వేచ్ఛ వొటార్కర్ ఆత్మహత్య కేసులో పూర్ణచందర్‌ను పోలీసులు నిన్న అరెస్ట్ చేశారు. అతడి వేధింపుల కారణంగానే తమ కూతురు మరణించినట్టు చిక్కడపల్లి పోలీసులకు స్వేచ్ఛ తండ్రి ఫిర్యాదు చేయడంతో అతడిని అదుపులోకి తీసుకున్నారు. అయితే, ఈ నేపథ్యంలోనే నిందితుడు పూర్ణచందర్ రాసిన లేఖ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. స్వేచ్ఛ, నేను స్నేహితులుగా ఉండేవాళ్లం. ఐదేళ్లుగా ఆమె మానసికంగా ఆందోళన చెందుతూ చికిత్స పొందుతుంది. ఇందుకు సంబంధించిన ఆధారాలు నా వద్ద ఉన్నాయి. స్వేచ్ఛ ఆత్మహత్యతో నాకు ఏలాంటి సంబంధం లేదని లేఖలో పూర్ణచందర్ పేర్కొన్నారు.

# బిజెపి, బిఆర్ఎస్ బంధం బయటపడింది

**రాంచందర్ రావు నియామకమే ఇందుకు నిదర్శనం**

**టీపీసీసీ మీడియా చైర్మన్ సామా రామ్మోహన్ రెడ్డి**



హైదరాబాద్, జూన్ 30 (జనంసాక్షి): రాష్ట్రంలో బీజేపీ, బీఆర్ఎస్ పొత్తుకు తొలి అడుగు పడిందని టీపీసీసీ మీడియా చైర్మన్ సామా రామ్మోహన్ రెడ్డి అన్నారు. రాష్ట్రంలో బీఆర్ఎస్‌కు బీజేపీ మద్దతు ఇస్తుందని.. అలాగే కేంద్రంలో బీజేపీకి బీఆర్ఎస్ మద్దతు ఇస్తుందని తెలిపారు. ఇదే రెండు పార్టీల సారాంశమని ఆయన పేర్కొన్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్ష పదవికి నామినేషన్ పక్రియ ప్రారంభమైన వేళ.. రామ్మోహన్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. అందులో భాగంగానే బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా రామచందర్ రావు నియామకం జరగనుందని ఆయన వివరించారు. వచ్చే ఎన్నికల్లో ఈ రెండు పార్టీలు కలిసి పోటీ చేస్తాయంటూ ఆయన జోస్యం చెప్పారు. బీజేపీ ఈక్వల్ టూ బీఆర్ఎస్ పార్టీ అని ఆయన స్పష్టం చేశారు. ఈ మేరకు సామా రామ్మోహన్ రెడ్డి.. తన ఎక్స్ ఖాతా వేదికగా సోమవారం వెల్లడించారు. రామ్మోహన్ రెడ్డి ఈ తరహా వ్యాఖ్యలు చేయడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. ఎందుకంటే.. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా బీసీ నియమించాలని ఆ పార్టీ అగ్రనాయకత్వం భావిస్తుంది. ఈ నేపథ్యంలో రామచందర్‌రావు పేరు దాదాపుగా ఖరారైనట్లు తెలుస్తుంది. అదీకాక ఈ పదవికి మరో నామినేషన్ దాఖలు కాకపోవడంతో రామచందర్‌రావు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటించే అవకాశముంది. ఇక ఇప్పటి వరకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షులుగా పని చేసిన కిషన్ రెడ్డి, బండి సంజయ్‌లతో బీఆర్ఎస్ పార్టీ నేతలకు రాజకీయంగా వైరం ఉన్న సంగతి అందరికి తెలిసిందే. మరోవైపు 2023 తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలకు కొద్ది రోజుల ముందు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్న బండి సంజయ్‌ను ఆ పదవి నుంచి తొలగించి.. ఆ స్థానంలో కిషన్ రెడ్డిని పార్టీ అగ్రనాయకత్వం నియమించిన సంగతి తెలిసిందే. నిర్ణయాన్ని ఆ పార్టీలోని పలువురు సీనియర్లు తీవ్రంగా వ్యతిరేకించారు. వారిలో ప్రముఖ నటి విజయశాంతి సైతం ఉన్నారు. కానీ ఆమె సూచనలు, సలహాలను సైతం ఆ పార్టీ అగ్రనాయకత్వం పక్కన పెట్టింది. దీంతో బీజేపీకి విజయశాంతి గుడ్ బై చెప్పి.. కాంగ్రెస్ పార్టీలో చేరిన సంగతి తెలిసిందే. అంతేకాకుండా తెలంగాణలో బీఆర్ఎస్ గెలుపు కోసమే బీజేపీ అగ్రనాయకత్వం ఈ నిర్ణయం తీసుకుందనే ఒక వాదన ఆ సమయంలో బలంగా నడిచింది.కేసీఆర్ ప్రభుత్వ హయాంలో జరిగిన ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం.. ప్రస్తుతం ఆ పార్టీపై తీవ్ర ప్రభావం చూపనుందనే ఓ చర్చ అయితే సాగుతుంది. అలాంటి వేళ.. టీపీసీసీ మీడియా చైర్మన్ సామా రామ్మోహన్ రెడ్డి వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి.

# కెమికల్ ఫ్యాక్టరీలో భారీ పేలుడు

**సంఘటన స్థలాన్ని సందర్శించిన కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి**



చెన్నూర్, జూన్,30 జనం సాక్షి): పాశమైలారం ప్రాంతంలో ఉన్న కెమికల్ ఫ్యాక్టరీలో జరిగిన భారీ పేలుడు ఘటనను తెలుసుకున్న కార్మిక శాఖ మంత్రి డాక్టర్ వివేక్ వెంకటస్వామి సంఘటన స్థలాన్ని సందర్శించడం జరిగింది. ప్రమాద పరిస్థితులను పరిశీలించి ప్రమాదంలో చిక్కుకున్న కార్మికులకు తక్షణ వైద్య సహాయం అందించాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. అనంతరం ఫ్యాక్టరీలో పేలుడుకు సంబంధించిన ఘటనపై అధికారులు ఇచ్చిన వివరాలను సమీక్షించి ప్రమాదం జరిగిన తీరును తెలుసుకున్నారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అధికార యంత్రాంగం పటిష్టమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. కార్మికుల ప్రాణభద్రతకు ఎలాంటి రాజీ పడే ప్రసక్తి లేదు, బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు.


# అదుపుతప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న కారు

**ఒకరు మృతి..పలువురికి గాయాలు**

**శంషాబాద్ ఓఆర్ఆర్ పరిధిలో వరుసగా గుద్దుకున్న పదికార్లు**

హైదరాబాద్, జూన్26 (జనంసాక్షి) : నగరంలోని బాలానగర్‌లో కారు అదుపుతప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న నలుగురిలో ఒకరు అక్కడికక్కడే మృతి చెందారు. మృతుడిని ముస్తాక్(19)గా గుర్తించారు. మరో ఇద్దరికి తీవ్రగాయాలు కాగా చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఇదిలావుంటే శంషాబాద్ పరిధిలో ఓఆర్ఆర్ పై రోడ్డు ప్రమాదం జరిగింది. 10 కార్లు వరుసగా ఒకదానినొకటి ఢీకొన్నాయి. ఆదివారం అర్ధరాత్రి చెన్నమ్మ హోటల్ సమీపంలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో కార్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి. అందులోని ప్రయాణికులు స్వల్పగాయాలతో బయటపడ్డారు. ఓ కారు డ్రైవర్ మితిమీరిన వేగంతో వెళ్లి ఒక్కసారిగా బ్రేక్ వేశాడు. దీంతో దాని వెనుక వస్తున్న 10 కార్లు వరుసగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంతో 2 కి.మీ మేర ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. పోలీసులు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

## ఇందిరా గాంధీ ప్రకటిత ఎమర్జెన్సీకి
# మోదీ అప్రకటిత ఎమర్జెన్సీకి మధ్య భేదాలు



భారత రాజకీయ చరిత్రలో 1975-77లో ఇందిరా గాంధీ ప్రకటించిన ఎమర్జెన్సీ ఒక కీలకమైన సంఘటనగా నిలిచిపోయింది. అదే విధంగా, 2014 నుండి నరేంద్ర మోదీ నాయకత్వంలోని ప్రభుత్వం కొన్ని చర్యలను “అప్రకటిత ఎమర్జెన్సీ”గా వామపక్ష విమర్శకులు, కొంతమంది మీడియా సంస్థలు అభివర్ణించాయి. ఈ వ్యాసం ఈ రెండు దశల మధ్య పోలికలు, భేదాలను విశ్లేషిస్తూ, దేశ విదేశీ మీడియా కథనాలు, వామపక్ష విమర్శలను సమీక్షిస్తుంది.

**ఇందిరా గాంధీ ఎమర్జెన్సీ (1975-77):**
1975 జూన్ 25న, శ్రీమతి ఇందిరా గాంధీ రాజ్యాంగంలోని 352వ అధికరణం ప్రకారం దేశవ్యాప్తంగా అత్యయిక స్థితిని అనూహ్యంగా ప్రకటించారు. ఈ నిర్ణయం రాజకీయ అస్థిరత, అలహాబాద్ హైకోర్టులో ఆమె ఎన్నికను రద్దు చేయడంతో, ప్రతిపక్ష ఆందోళనల నేపథ్యంలో వచ్చింది. ఎమర్జెన్సీ సమయంలో పౌరస్వాతంత్ర్యాలు తీవ్రంగా క్షీణించాయి. మీడియాపై సెన్సార్‌షిప్ విధించబడింది, ప్రతిపక్ష కీలక నాయకులు అందరూ జైళ్లకు పంపబడ్డారు. మరియు అనేక రాజ్యాంగ సవరణలు జరిగాయి. ఈ కాలంలో ఇందిరా గాంధీ “ఇన్‌కమ్ టాక్స్ రిటర్న్లు రహస్యంగా ఉండాల్సిన అవసరం లేదు” అని పేర్కొనడం వివాదాస్పదమైంది. ఈ చర్యలు ప్రజాస్వామ్య స్ఫూర్తిని దెబ్బతీసినట్లు విమర్శలు వచ్చాయి.
దేశీయంగా, ఈ ఎమర్జెన్సీని కాంగ్రెస్ పార్టీ శాంతి భద్రతల కోసం తీసుకున్న చర్యగా సమర్థించగా, ప్రతిపక్ష పార్టీలు, మీడియా దీనిని నియంతృత్వంగా అభివర్ణించాయి. విదేశీ మీడియా, ముఖ్యంగా “న్యూయార్క్ టైమ్స్” వంటి సంస్థలు, ఎమర్జెన్సీని “ప్రజాస్వామ్య హననం”గా విమర్శించాయి. వామపక్ష రాజకీయవేత్తలు, మేధావులు ఈ కాలాన్ని “ఫాసిస్ట్ ధోరణి”గా చిత్రీకరించారు, దీనిని రాజ్యాంగ వ్యవస్థను దుర్వినియోగం చేసిన సందర్భంగా చూశారు.

**మోదీ హయాంలో “అప్రకటిత ఎమర్జెన్సీ” అనే విమర్శ:**
2014లో నరేంద్ర మోదీ ప్రధానమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన పుటి నుండి, వామపక్ష విమర్శకులు, కొన్ని మీడియా సంస్థలు ఆయన పాలనను “అప్రకటిత ఎమర్జెన్సీ”గా అభివర్ణించాయి. ఈ విమర్శలు ప్రధానంగా కొన్ని కీలక నిర్ణయాలు, చట్టాలపై ఆధారపడి ఉన్నాయి: ఆర్టికల్ 370 రద్దు, సిటిజన్‌షిప్ అమెండ్‌మెంట్ యాక్ట్ (సీఏఏ), నేషనల్ రిజిస్టర్ ఆఫ్ సిటిజన్స్ (ఎన్.ఆర్.సీ.), మీడియాపై ఒత్తిడి, ప్రతిపక్ష నాయకులపై, కవులు, కళాకారులు, మీడియా సంపాదకులు, జర్నలిస్ట్‌లపై అక్రమ కేసుల్లో ఇరికించి జైళ్ళకు పంపిచింటం,కేంద్ర ఏజెన్సీలు ఎన్నికల కమిషన్, ఆర్బీఐ, సీబీఐ,ఈడీ, ఐటీ మొదలైన వాటిని దుర్వినియోగం చేయడం వంటి ఆరోపణలు అనేకం వచ్చాయి. కనీసం స్టేజి కమెడియన్ లాంటి వ్యంగ్య విమర్శలను కూడా సహించ లేని పరిస్థితి దేశం అంతటా ఆవరించిందని దేశ, విదేశీ మీడియాలో వార్తా కథనాలు అనేకం వచ్చాయి.
వామపక్ష విమర్శకులు, ఉదాహరణకు, సీపీఐ(ఎం) నాయకులు సీతారాం యెచూరీ, మోదీ ప్రభుత్వాన్ని “ప్రజాస్వామ్య సంస్థలను బలహీనపరిచే” ధోరణిగా విమర్శించారు. 2025 జూన్ 25న “ది వైర్”లో ప్రచురితమైన ఒక వ్యాసం, మోదీ పాలనను ఎమర్జెన్సీతో పోల్చుతూ, “ప్రజాస్వామ్యం లోపలి నుండి క్రమంగా క్షీణిస్తోంది” అని వాదించింది. విదేశీ మీడియాలో, “ది గార్డియన్” మరియు “వాషింగ్టన్ పోస్ట్” వంటి సంస్థలు మోదీ ప్రభుత్వం మీడియా స్వాతంత్ర్యాన్ని, మత సామరస్యాన్ని దెబ్బతీస్తోందని విమర్శించాయి.

**కేంద్రీకృత అధికారం:**
ఇందిరా గాంధీ ఎమర్జెన్సీ సమయంలో ప్రభుత్వంలోనూ, కాంగ్రెస్ పార్టీలోనూ ఏకఛత్రాధిపత్యం చెలాయించారు. అదే విధంగా, మోదీ పాలనలో బీజేపీ తన ప్రభుత్వ నిర్ణయాలలో ఆయన వ్యక్తిగత ప్రభావం ఎక్కువగా ఉందని ఆరెస్సెస్ కూడా విపక్షాలతో సమానంగా విమర్శించాయి.

**మీడియా నియంత్రణ :**
1975 ఎమర్జెన్సీలో సెన్సార్‌షిప్ స్పష్టంగా కనిపించింది. మోదీ హయాంలో, సెన్సార్‌షిప్ బాహాటంగా లేనప్పటికీ, ప్రధాన మీడియా సంస్థలు మోదీ ఆధీనంలో కి వచ్చాయి.సొంత గోదీ మీడియా గా పేరు పడిన ప్రధాన మీడియా, సోషల్ మీడియా సంస్థలు బీజేపీ నాయకత్వంలో స్థాపించటం జరిగింది. స్వతంత్ర మీడియా పై, విదేశీ మీడియా (బీబీసీ)ఎన్డీ టీవీ పై ఒత్తిడి పెరిగింది.అలాగే దేశీయ మీడియాపై స్వీయ-సెన్సార్‌షిప్ కొనసాగుతున్న ఆరోపణలు ఉన్నాయి.

**ప్రతిపక్ష దమనం:**
ఇందిరా హయాంలో ప్రతిపక్ష నాయకులను, జేపీ లాంటి వారిని సైతం జైల్లో వేశారు. మోదీ పాలనలో, ఈడీ, సీబీఐ వంటి ఏజెన్సీల ద్వారా ప్రతిపక్ష నాయకులు (డిల్లీ ముఖ్యమంత్రి తో సహా క్యాబినెట్ మంత్రులపై కేసులు నమోదు చేసి జైళ్ళలో నిర్బంధించడం విమర్శ లకు దారితీసింది. మోడీ, ఐటీ కేసుల వేదింపులు పడలేక బీజేపీలో చేరారు.వారందరు వాషింగ్ పౌడర్ నిర్మాతో కడగబడి...దోష విముక్తులు అయ్యారు.

**రాజ్యాంగ చట్రం:**
ఇందిరా గాంధీ ఎమర్జెన్సీ రాజ్యాంగబద్ధంగా ప్రకటించబడింది, దీనివల్ల పౌర హక్కులు స్థగితమయ్యాయి. మోదీ హయాంలో ఎటువంటి రాజ్యాంగ ఎమర్జెన్సీ లేదు, కానీ “అప్రకటిత ఎమర్జెన్సీ” అనే విమర్శలు చట్టాలు, విధానాల ద్వారా జనాభిప్రాయాన్ని నియంత్రించే ప్రయత్నంగా చూడబడుతున్నాయి.

**మీడియా స్వాతంత్ర్యం:**
ఇందిరా హయాంలో సెన్సార్‌షిప్ స్పష్టంగా ఉండగా, మోదీ హయాంలో మీడియా స్వాతంత్ర్యం ఉన్నప్పటికీ, కొన్ని సంస్థలు ఒత్తిడిని ఎదుర్కొన్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

**సామాజిక ధ్రువీకరణ:**
ఇందిరా ఎమర్జెన్సీ ప్రధానంగా రాజకీయ దమన కాండ పై దృష్టి సారించింది. మోదీ హయాంలో మైనారిటీ మతాల పట్ల విద్వేషం , కుల, మత జాతీయ విద్వేషాలు వంటి సమస్యలు సామాజిక ధ్రువీకరణకు దారితీసినట్లు విమర్శలు ఉన్నాయి, ఇది ఇందిరాగాంధీ విధించిన ఎమర్జెన్సీ సమయంలో లేదు.

**ఆర్థిక విధానాలు:**
ఇందిరా గాంధీ ఎమర్జెన్సీ సమయంలో సోషలిస్ట్ ధోరణులు బలంగా ఉండగా, మోదీ హయాంలో ఆర్థిక సంస్కరణలు, ప్రైవేటీకరణ, కార్పొరేటీకరణ పెరిగింది. జీఎస్‌టీ వంటి చర్యలు ఆర్థిక స్వేచ్ఛను ప్రోత్సహించాయి, అయితే వీటిని కార్పొరేట్‌లకు అనుకూలమైనవిగా విమర్శలు వచ్చాయి.

**దేశ విదేశీ మీడియా కథనాలు:**
ఇందిరా గాంధీ ఎమర్జెన్సీ విమర్శించటంలో దేశీయ మీడియాలో, “ది హిందూ”, “ఇండియన్ ఎక్స్‌ప్రెస్” వంటి పత్రికా సంస్థలు పోటీ పడ్డాయి. మోదీ ప్రభుత్వ చర్యలను ప్రజాస్వామ్య సంస్థలపై ఒత్తిడిని చూస్తూ కొన్ని వామపక్షాల పత్రికలు లేదా వామపక్ష భావజాలంతో ఏకీభవించే మీడియా ప్రధానంగా విమర్శనాత్మక కథనాలను ప్రచురించా యి. ఉదాహరణకు, రాహుల్ గాంధీ “అంబానీ-అదానీ ప్రభుత్వం” అని వ్యాఖ్యానించడం “బిబిసి” మీడియాలో ప్రసారితమైంది. విదేశీ మీడియా, ముఖ్యంగా “ది గార్డియన్”, “అల్ జజీరా”, మోదీ పాలనను హిందూ జాతీయవాద ఎజెండాగా, మతపరమైన సామరస్యాన్ని దెబ్బతీసే ధోరణిగా చిత్రీకరించాయి. అయితే, కొన్ని మీడియా సంస్థలు మోదీ ఆర్థిక సంస్కరణలను, విదేశాంగ విధానాలను ప్రశంసించాయి, ఉదాహరణకు, బాంగ్లాదేశ్‌తో సంబంధాలను బలోపేతం చేసినందుకు అవి ఉపయోగపడ్డాయి.
వామపక్ష రాజకీయవేత్తలు, మేధావులు మోదీ ప్రభుత్వాన్ని “ఫాసిజం” మరియు “కార్పొరేట్ అనుకూల” ధోరణిగా విమర్శించారు. సీపీఐ(ఎం) జనరల్ సెక్రటరీ సీతారాం యెచూరీ, ఆర్టికల్ 370 రద్దు మరియు సీఏఏ ని “పౌరస్వామ్యాన్ని దెబ్బతీసే” చర్యలుగా ఆరోపించారు. వామపక్ష రచయితలు, ఉదాహరణకు, అరుంధతి రాయ్, మోదీ పాలనను “సామాజిక విభజన”గా “మత ధ్రువీకరణ”కు దారితీసినట్లు విమర్శించారు. ఈ విమర్శలు ఎమర్జెన్సీ సమయంలో ఇందిరా గాంధీపై చేసిన “నియంతృత్వ” ఆరోపణలతో పోల్చబడుతున్నాయి.
ఇందిరా గాంధీ ఎమర్జెన్సీ మరియు మోదీ హయాంలోని ఆరోపిత “అప్రకటిత ఎమర్జెన్సీ” మధ్య పోలికలు కేంద్రీకృత అధికారం, మీడియా ఒత్తిడి, ప్రతిపక్ష అణచివేత వంటి అంశాలలో కనిపిస్తాయి. అయితే, ఇవి రెండూ భిన్నమైన సందర్భాలలో జరిగాయి. ఇందిరా ఎమర్జెన్సీ రాజ్యాంగ సంక్షోభంగా ఉండగా, మోదీ హయాంలో చట్టబద్ధమైన నిర్ణయాల ద్వారా జరిగిన మార్పులు ఎక్కువ వివాదాస్పదమైనవి. ఇందిరా హయాంలో స్పష్టమైన రాజ్యాంగ ఉల్లంఘనలు జరిగాయి, కానీ మోదీ హయాంలో చట్టబద్ధమైన మార్గాల ద్వారానే విధానాలు అమలు చేయబడ్డాయి. ఇది ప్రజాస్వామ్య స్వరూపంపై చర్చను రేకెత్తిస్తోంది.
మోదీ ప్రభుత్వం ఆర్థిక వృద్ధి, జాతీయ భద్రత, మరియు సామాజిక సంక్షేమ కార్యక్రమాలపై దృష్టి సారించినట్లు ఆయన మద్దతుదారులు వాదిస్తున్నారు. అయితే, విమర్శకులు ఈ చర్యలు సామాజిక సామరస్యాన్ని, పౌరస్వాతంత్ర్యాలను దెబ్బతీస్తున్నాయని ఆరోపిస్తున్నారు. ఈ రెండు దశల మధ్య ఉన్న ముఖ్యమైన భేదం ఏమిటంటే, ఇందిరా ఎమర్జెన్సీ ఒక స్పష్టమైన నియంతృత్వ చర్యగా ఉండగా, మోదీ హయాంలోని విమర్శలు చట్టబద్ధమైన నిర్ణయాలు, సామాజిక ధ్రువీకరణలపై ఆధారపడి ఉన్నాయి.
ఇందిరా గాంధీ ఎమర్జెన్సీ మరియు మోదీ హయాంలోని “అప్రకటిత ఎమర్జెన్సీ” మధ్య పోలికలు, భేదాలు భారత రాజకీయాలలో ప్రజాస్వామ్యం, అధికారం, మరియు స్వాతంత్ర్యాలపై లోతైన చర్చను రేకెత్తించాయి. ఇందిరా ఎమర్జెన్సీ స్పష్టమైన రాజ్యాంగ సంక్షోభంగా ఉండగా, మోదీ హయాంలోని విమర్శలు సూక్ష్మమైన, చట్టబద్ధమైన చర్యలపై ఆధారపడి ఉన్నాయి. దేశ విదేశీ మీడియా, వామపక్ష విమర్శలు ఈ రెండు దశలను విభిన్న దృక్కోణాల నుండి చూస్తున్నాయి. ఈ విశ్లేషణ భారత ప్రజాస్వామ్య వ్యవస్థ యొక్క బలాలు, బలహీనతలను గుర్తించడానికి సహాయపడుతుంది. భవిష్యత్తులో ఈ చర్చలు మరింత తీవ్రతరం కావచ్చు.



డాక్టర్ కోలాహలం
రామ్ కిశోర్
9849328496.




*రైతు లేనిదే రాజ్యం లేదు,అన్నదాతలే దేశానికి వెన్నెముక.జై కిసాన్ అంటూ జేజేలు పలుకుతూ పల్లకి మోతలే, “మాటలు కోటలు దాటుతున్నాయి-చేతలు తంగేళ్లు దాటడం లేదు” అన్నట్లుగా ఉంది.నిజానికి రైతు శ్రమకు తగ్గ గుర్తింపు,గౌరవం ఇస్తున్నామా! అంటే లేదని చెప్పాల్సి వస్తుంది. ఎందుకంటే?. దళా(వ్యాపా)రుల దోపిడీ నుంచి విముక్తి కలిగించి,పంటకు గిట్టుబాటు(మద్దతు)ధర కల్పించిన నాడే ఈ తరం యువత వ్యవసాయం వైపు మళ్ళుతారు.పట్టణాలకు వలస నివారించబడుతోంది.*

# రైతు రాజయ్యేదెన్నడు!

మన దేశానికి స్వాతంత్ర్యం వచ్చి ఇన్నేళ్లయినా వ్యవసాయ రంగం తీవ్ర ఒడిదుడుకులకు లోనవుతుంది.కానీ పారిశ్రామిక, సాంకేతిక,సేవారంగాలు వేగంగా అభివృద్ధి చెందుతున్నాయి. జాతీయ స్థూల విలువ జోడింపు (జీఏవి)లో వ్యవసాయం దాని అనుబంధ రంగాల వాటా తగ్గుతోంది. కృత్రిమ మేధ (ఏఐ)అన్ని రంగాల్లోనూ ప్రవేశించి ప్రగతి పరుగులు పెట్టిస్తుంటే!. వ్యవసాయ రంగం “ఎక్కడ వేసిన గొంగళి అక్కడే”అన్న చందంగా కునారిల్లుతుంది. రైతు ఆత్మహత్యలను ఆపలేకపోవడం పాలకుల లోపమా?, రైతుల శాపమా!. ఏది ఏమైనా బలిపీఠంపై ఉన్న సాగును బాగుపడేలా చేస్తూ, రైతును రాజును చేసే సంగతేమో కాని కనీసం ఆత్మహత్యలను నివారించాల్సి ఉందనేది కాదనలేని నిజం.అప్పుడే నేటి తరం యువత ఆ రంగంలోకి రాగలరు.ఈమధ్య రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా కల్పించడం అభినందనీయమే. కానీ మన దేశంలో ఎక్కువ మందికి జీవనోపాధి కల్పించే సాగును, దాన్నే నమ్ముకున్న రైతాంగం బాగుపడ్డ రోజే వారి జీవితాల్లో నిజమైన ఆనందం.
ఈ సంవత్సరం వర్షాలు జోరుగా కురుస్తాయని,రుతుపవనాలు ముందే వస్తాయని వాతావరణ శాఖ చెప్పింది.అలానే జూన్ మొదట్లో రుతుపవనాలు వచ్చి తొలకరి కురిసి మురిపించింది.ఆ తర్వాత జూన్ నెల చివరకు వస్తున్నా ఆకాశం మేఘావృతమై ఉంటుందే కానీ వర్షాలు పడడం లేదు.తొలకరి వానలకు నాటిన పత్తి తదితర పంటల కోసం రైతులు నొసటిన చేయి పెట్టి ఆకాశం వైపు ఎదురుచూస్తున్న పరిస్థితులు ఇన్నేళ్లైనా మారనేలేదు.
మన దేశంలో అన్నదాతలకు ఎంతో ముఖ్యమైన కాలమిది. జాతికి మెతుకునిచ్చి,బతుకు నిలిపే రైతన్న పుడమినే పుత్తడి (పులకింప)చేసి పూతలు పూయించి కాతలు కాయిస్తు,బురదను మలిచి బువ్వను చేసే పుణ్య పురుషుడు అన్నదాత.తొలకరి వానలకు ముందుగా నాలుగు సార్లు దుక్కి దున్ని విత్తనాలు నాటుతారు. మొక్క మొలకెత్తింది మొదలు దానిని పసి బిడ్డను చూసినట్లు అపురూపంగా చూసుకుంటాడు.
కలుపుతీస్తాడు, మందులు వేస్తాడు పంట చేతికందే సరికి అనావృష్టో లేదా అతివృష్టి వలనో ఆ పైరు ఎండిపోవడమో,కొట్టుకపోవడమో జరుగుతుంది.విత్తనాల ఖర్చులు కూడా తిరిగి రాని దయనీయ స్థితి. వ్యవసాయం అంటే పండినా- పండకపోయినా రైతు నిరాశ చెందకుండా ముందుకే సాగుతాడు. ఈ పరిస్థితి ఈనాటిది కాదు? తరతరాలుగా తాత ముత్తాతల నుంచి చూస్తున్నారు.మన దేశంలో సాగు రంగంలో దండుగ!పండుగ రెండూ ఉంటాయి.ఈ రంగంలో ఒక ఏడు పండితే? మరో ఏడు పండదు.అయినా పండలేదని రైతు కాడి-మేడి వదిలేస్తే!. అందరికీ ఆహారం ఎలా?.ప్రకృతి విపత్తులకు తోడు పాలకుల ఉదాసీనత, వ్యాపా(దళా)రుల దోపిడీ నాసిరకం విత్తనాలు,నకిలీ పురుగుమందులు, నాణ్యతలేని ఎరువులు ఇలా అనేక విధాలుగా అష్ట కష్టాలైనా అనుభవిస్తూ, అధిగమిస్తూ పంట పండిస్తాడు.చివరకు పండిన పంట అమ్ముకునే నాటికి గిట్టుబాటు (మద్దతు)ధర ఉండదు.అలా అని రైతు నిరాశకు, నిస్పృహకు లోనైతే మనం బతికేదెలా! అని సాగు చేస్తున్నారు.రైతులను ప్రకృతి,పాలకులు, వ్యాపారులు దగా చేస్తున్నా వ్యవసాయాన్ని వదులు కోడు. కాడి దించే ప్రసక్తే లేదు. రేయింబవళ్లు ఎండా వానా ఏదైనా సరే నిత్యం పుడమి తల్లిని, వ్యవసాయాన్ని నమ్ముకొని అదే పని చేస్తుంటాడు.వారి శ్రమ వెలకట్టలేనిది.”సూర్యుడైనా మబ్బుల చాటుకెళ్ళి కాసేపు విశ్రాంతి తీసుకుంటాడేమో..!” కానీ రైతు మాత్రం అవిశ్రాంతంగా దేశానికి పట్టెడు అన్నం పెట్టడం కోసం ఫలితం మీద ధ్యాస లేకుండా పోరాడుతూనే ఉంటాడు..
సాయం కోసం వ్యవసాయాన్ని వదులు కోలేని త్యాగమూర్తి అన్నదాత.పాలకులు ఏం చేస్తున్నారు! ఏంచేయాలి..? దేశసౌభాగ్యానికి పునాది రాళ్లయిన అన్నదాతలు చల్లగా ఉంటేనే మన కడుపు చల్లగా ఉంటుంది.ఈ దేశంలో సాగు రంగాన్ని తరతరాలుగా పట్టిపీడిస్తున్న ఆత్మహత్యల సామాజిక రుగ్మతను తరిమి వేయాల్సిన బాధ్యత ముమ్మాటికి ప్రభుత్వాలదే.ఇదంతా రైతుకు చేయాల్సిన మీ కనీస బాధ్యత. పాలకులు,పాలితులు ఏమిచ్చినా రైతు రుణం తీర్చుకోలేరు.సాగునే నమ్ముకున్న అన్నదాతల ఆత్మహత్యలు నివారించబడి,వారి జీవితాల్లో వెలుగులు నింపిన రోజే నిజమైన పండుగ..



మేకిరి దామోదర్
సామాజిక విశ్లేషకులు
వరంగల్ 9573666650

### శ్రీ కాళ హస్తి!

గుడికొచ్చిన వాళ్ళు
అంతా శివభక్తులే!
ప్రదర్శన భక్తి
కావలసింది ముక్తి!
సాధనలే వేరు!
లోకోభిన్నరుచి!
అంతా శ్రీకాళహస్తి!
ఒకరికి నచ్చింది
మరొకరికినచ్చదు!
సంసారంలోనూ ఇంతే!
ఈ కథ సార్వజనీనం!

-తమ్మినేని అక్కిరాజు
హైదరాబాద్



❄❄❄

కురవని మేఘాలు
రాలని చినుకులు
నేల బీటలు
మొలకల వాలిన చూపులు
పశువుల ఆకలి అరుపులు
రైతు గుబులు
కరువు కనుసన్నల్లో...

❄❄❄❄

గంజి కేంద్రాలు
గంజాయి కేంద్రాలు
జీవనాధారాలు
జీవన హనన ద్వారాలు
సత్యం నిత్య నూతనం
పాటిస్తే ఆరోగ్య యవ్వనం
లేదా భూతం చేత హతం

రేడియమ్
9291527757




### స్వేచ్ఛకే ఒక ప్రశ్న

నువ్వు ప్రశ్నించే తీరు
ఆ ప్రశ్నకే అందం వచ్చేది
నీ నవ్వులో ఉన్న గులాబీనే చూశాం
దానివెనుక ఉన్న ముల్లుంటదని
ఎన్నడు అలోచించనేలేదు
అందుకు సిగ్గు పడడం లేదు
ఎందుకంటే నీ ధైర్యం
నీ ఆత్మవిశ్వాసం
చూశాక
మాది ప్రశ్నే కాదని
నీ జీవితం లోకి తొంగి చూడలేదు
అందమైన నవ్వు వెనుక కూడా
అంతు లేని అగాధం ఉంటుందని
స్వేచ్ఛ కూడ ప్రశ్నే అని
స్వేచ్ఛ కూడ ప్రతిబంధకం అని
మీ అమ్మ నాన్న లు కూడ
నీ తెలివి తెగువ ను చూసి
అడ్డుపడడం తప్పు అని
నువ్వు శిక్ష వేసే దాకా తెలియలేదు
ఇప్పుడు అనుమానం, పరిమాణం
పెంచుకోని, నవ్వుతుంది
ప్రేమ ఉన్నంత స్వేచ్ఛగా
స్వేచ్ఛ దగ్గర ఉండదని
ఇంత కాలం స్వేచ్ఛ కూడ
నలిగిపోయిన హృదయంతో
జీవితం ముగింపు వాక్యం పలికే దాకా
ఇదంతా స్వేచ్ఛనే అనుకున్నాం
నీకించిన స్వేచ్ఛ కూడ
మాకు శిక్ష అయ్యేదాకా
తెలుసుకోలేక పోయాం
రంగుల ప్రపంచంలో ఉన్నా
ఏ రంగులో వెతకాలి నిన్ను స్వేచ్ఛా

డబ్బీకార్ సురేందర్
యువ సాహితీ సమితి
తెలంగాణ రాష్ట్రం.

# వికసిత్ భారత్ వికసించి పరిమళించేనా!



“యదార్థవాది లోక విరోధి “అన్నది అక్షరాల నగ్న సత్యం. స్వాతంత్ర్యం వచ్చి 78 వసంతాలు దాటిందా? జాతీయ గీతాలు ఐక్యంగా పాడి మువ్వన్నె జెండా ఎగుర వేసి ఎర్రకోటపై ప్రసంగాలు చేసి సాధించిన ఘనత ఏమిటో తెల్సా! మతాలను రెచ్చగొట్టడం దేశాన్ని కాషాయ రంగులో ముంచడం ఒక్కటే కాదండోయి ! గ్లోబల్ హంగర్ ఇండెక్స్ లో భారత్ 105 స్థానంలో ఉందని చెప్పడం దేశానికే అవమానకరం. ఇ లా అయితే ప్రజాస్వామ్యం మొగ్గలు తొడిగేనా !.. ఆకలి చావు కేకలకు పవిత్ర భరతమాత ఎక్కి ఎక్కి ఏడుస్తుంటే కన్నీరు తుడిచి ఓదార్చిన బిడ్డ ఎవరున్నారు ?
ముక్కోటి దేవతలు ఆదుకుంటే ఒట్టు
కౌరవులు పాండవులు ఆస్తులకు కోట్లాడినట్లు అస్త్రాలతో ఒకరిపై ఒకరు వేసుకొన్నట్లు రాజకీయ నాయకులు అధికార పీఠం కొరకు హెూరాహెూరి పోరాటం చేయడములో నిమగ్నమై ఉన్నారు .ఇంకా సుపరిపాలన ఎక్కడా ? రాజ్యాంగం డాక్టర్ అంబేద్కర్ విగ్రహాన్ని కౌగలించుకొని ఏడుస్తుంది .దారిద్ర్య దిగువ రేఖ లో కొట్టు మిట్టాడుతున్న వారికి ప్రజా సంక్షేమ పథకాలు అందముగా కనబడే ఎండమావులైనాయి .బాల కార్మికుల బతుకులు చింపిన విస్తరి ఆకులుగా మారి పోయినాయి .”బేటి బచావో బేటి పడోవో” చిరునామా లేకుండా పోయింది
మనిషికి బతుకడానికి కనీసం రోటీ ,కపడా, ఔర్,మకాన్ అర్జెంట్ గా కావాలి అదెక్కడా ప్రభుత్వం కల్పించిన దాఖలాలు మచ్చుకైనా లేవు “ వికసిత్ భారత్” వికసించి ప్రధాన మంత్రి మోడీ గారి కలలు సాకారం అయ్యే నా ! ఆదాయమునకు మించి దుబారా ఖర్చులు పెడితే అభివృద్ధికి కళ్ళెం వేసినట్లే కదా! మతం తో కులం తో ఛాందస భావాలతో పెనవేసుకున్న పాలకులుంటే అన్ని కోణాలలో భారత్ లో అభివృద్ధి చెందేనా! తన స్వంత ఇంటిని
చక్కబెట్టని ప్రధాన మంత్రి గారు ప్రపంచ దేశాలు చుట్టి బిరుదుల లో సిక్సర్ కొట్టి అందరికీ నీతులు చెబుతున్నాడు.శాంతి మంత్రం ఉపదేశిస్తున్నాడు. ”ఉట్టి కెక్కలేనమ్మ స్వర్గానికెక్కునా” ? అన్న చందంగా ఉంది. మన్ కి బాత్ మోడీ గారి
రాజా-కీయం .అయోధ్య రాముని ఆశీర్వాదం
కడుపు నింపని ప్రార్థనా మందిరాలు,తొక్కిసలాట లో కుంభమేళాలు ,కోరిన వరాలు ఇవ్వని బ్రహ్మోత్సవాలు, కాసులు మింగే యజ్ఞ యాగాదులు మన కెందుకండోయి !
అందుకే సోక్రటీస్ ఒక చక్కటి మాట చెప్పాడు.” ఏ దేశములో బడులలో పెచ్చులు ఊడి పోతాయో ఏ దేశములో దేవాలయాలలో ( గుడి మసీదు, చర్చ్ ) గోపురాలు బంగారముతో మెరుస్తూ ఆకాశాన్ని అంటుతాయో ఆదేశం తనంతట తానే సర్వనాశనం అవుతుంది”” అని పాలకులు విద్యాసంస్థలకు, విజ్ఞాన శాస్త్రానికి నూతన ఆవిష్కరణలకు ,పెద్ద పీట వేస్తున్నారా ! బాబా లకు మాత్రం తివాచీలు పరచి మంగళ వాయిద్యాలతో ఆహ్వానించి వారి దొంగ వ్యాపారాలకు అండగా నిలుస్తున్నారు .నేటి పాలకులు కట్టుకథల మను ధర్మశాస్త్రం నెత్తిన పెట్టుకొని ఊరేగుతు కులాలలో మతాలలో చిచ్చు రేపుతున్నారు.ఇది ప్రజాస్వామ్య మేనా ? మూఢనమ్మకాలు భారత దేశాన్ని స్మశానము వైపు ఈడ్చుకొని పోతున్నాయి.! మతాలకు అతీత శక్తులకు అతీతంగా ఉన్న చైనా ,జపాన్, మరియు ఇతర యూరోపియన్ కంట్రీస్ మాత్రం విజ్ఞాన పరముగా ప్రగతి పథంలో రాకెట్ లా దూసుకొని పోతుంది. నేటి కేంద్ర ప్రభుత్వ పరిపాలన అంతా గోల్ మాల్. బతుకు దెరువు కొరకు బాబాల ,అఘోరీల అవతారం ఎత్తే వారు ఆధ్యాత్మిక ముసుగులో రేప్ లు హింసలు హత్యలు చేసే వారు దేశములో కరోనా లా ఎగబడుతున్నారు.వీరంతా దేశద్రోహులు కరడు ఉగ్రవాదులు కాదా ! అభివృద్ధి నిరోధ శక్తులు కావా ! .దేశ సంపద కొంత మంది ధనవంతుల చేతుల్లో కేంద్రీకృతమై ఉంది. ఆ ధనవంతులు పాలకులకు జిగ్రీ దోస్తీలు అందుకే కాబోలు అనిల్ అంబానీ కంపెని రిలయన్స్ కమ్యూనికేషన్స్ కు ఉన్న అప్పు 46.796 కోట్లు బ్యాంకులు మాఫీ చేశాయి. ఎవడబ్బ సొమ్ము మాఫీ చేయడానికి మరో దిక్కు రైతులు అప్పులు కట్టలేక ఆత్మ హత్యలు చేసుకుంటుంటే వారికి లేని బాధ కుబేరులకు మాత్రమే ఉందా ! ప్రభుత్వ ఆదాయం గండికొట్టే పనులు చేస్తే ప్రభుత్వం అప్పులకొరకు వేట తప్పదు ధరలు పెరగక తప్పదు. సామాన్య మానవుడు బతికి బట్ట కట్టే అవకాశాలు కనబడడం లేదు .అందుకే ఆత్మ హత్యల సంఖ్య పెరుగుతుంది .దేశ సంపద అందరికీ పంచుతేనే సమ సమాజ స్థాపన.
మతాలతో ముడి పడి ఉన్న ప్రభుత్వాలు ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నాయి మణిపూర్ లో జరిగిన సంఘటన ప్రపంచ చరిత్ర లో చెరగని ముద్ర వేసింది.అక్కడ మానవత్వం మంటకల్సింది.”మనుషులను చంపి మతాన్ని రక్షించడం కంటే మతాన్ని చంపి మనుషులను రక్షించడం” సరైనదని గౌతమ బుద్ధుడు హిత బోధ చేశాడు బి జె.పి ప్రభుత్వం మాత్రం మతానికే ప్రాముఖ్యత ఇస్తున్నది. నోబెల్ బహుమతి గ్రహీత అమర్త్యసేన్ కూడా విమర్శించాడు “” బి .జె పి పాలన ప్రజాస్వామ్యాన్ని కాలరాస్తుంది””అన్నాడు. ఇది అంత ఈజీ గా కొట్టిపారెయ్యలేము .రాజ్యాంగ విరుద్ధమైన పనులు పాలకులు చేస్తే ప్రతి పౌరుడు ఖండించాలి ఓటు హక్కుతో గుణపాఠం చెప్పాలి .జాతీయ జెండా లో కాషాయ రంగు ఎందుకు ఉన్నట్లు ? దేశమంతా కాషాయ వస్త్రాలు ధరించాలని కాదండోయి .అలా అయితే పప్పులో కాలేసినట్లే ! ప్రతి పౌరుడు సిపాయి గా నిలిచి దేశాన్ని కాపాడాలని అర్థం. తెలుపు గుర్తు కుల మత వర్ణాలతో కొట్టుకొని చావడానికి అసలే కాదండోయి ! దేశమంతా ఐక్యంగా శాంతిగా ప్రశాంతముగా ఉండాలని అందరూ సమానమే అని మల్లె పూవు లాంటి తెలుపు సంకేతం ఇస్తుంది. ఆకు పచ్చ రంగు జెండా పై ఎందుకు నవ్వుతుంది ? ఫ్యాక్టరీల నుండి విషపు నీరు నదులలో కలవడానికి కాదండోయి ! చెట్లను నరకడానికి అనుకునేరు సుమా ! హరిత వనాలతో ప్రకృతి శోభాయ మానంగా ఉండ డానికే ! సిరి పంటలు పండించ డానికే ! ఊపిరి పీల్చుకొని బతికి బట్టకట్టడానికే !
మరో దిక్కు మన పవిత్ర భారత దేశములో న్యాయ వ్యవస్థ భ్రష్టు పట్టి దేశాన్ని అప్రతిష్ట పాలు చేస్తుంది
ఢిల్లీ హై కోర్టు జడ్జ్ యశ్వంత్ వర్మ ఇంట్లో కట్టలకొద్దీ నగదు కనిపించిన ఉదంతం ఇప్పటికీ ఎటూ తేలకుండా ఉండడం వలన ప్రజలంతా ముక్కున వేలేసి కొంటున్నారు.సుప్రీమ్ కోర్టు కోలీజయం కోరలు లేని పులిగా ఉండడం లో అర్థమేమీ ? .ఇటువంటి తరుణంలో చట్టాలు దిశ నిర్దేశం చేసే పరిస్థితి లో లేవు అవినీతి లో నిండా మునిగిన జస్టిస్ యశ్వంత్ వర్మ ఇంకా పదవిలో కొనసాగుతూ రాజీనామా చేయక పోవడం ఏమిటి ? జడ్జికి సిగ్గుచేటు .ఇది కేంద్ర ప్రభుత్వ అసమర్థకు నిలువెత్తు సాక్ష్యం .న్యాయ వ్యవస్థ కుప్ప కూలి పోయింది .ఇంకా సామాన్యునికి న్యాయం ఎక్కడ దొరుకుతుంది ? .ప్రజలలో విశ్వాసం కోల్పోతుంది . అశోక ధర్మచక్రం న్యాయ దేవత ను తీసుకొని సరిహద్దులు దాటి పోతుంది .ఇంకెప్పుడు చర్యలు తీసుకునేది.. మరో పక్క ఆపరేషన్ కగార్ పేరుతో మావోయిస్టుల ను కాల్చి చంపడం శాంతి చర్చలకు పిలువక పోవడం ఏమిటి ? మానవతా వాదులు కమ్యూనిస్టు నాయకులు కేంద్ర ప్రభుత్వ వైఖరిని తప్పు పట్టి నిరసన తెలియ చేస్తున్నారు. .మానవత్వాన్ని మంట గలుపుతున్నారని ఉద్యమాలు లేవనెత్తుతున్నారు “ఆపరేషన్ కగార్ “ వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేస్తున్నారు .ఇంతకు శాంతి చర్చలు ఎందుకు జరుపడం లేదు ? ప్రధాన మంత్రి గారు సమాధానం చెప్ప వలసిన అవసరం ఉంది మావోయిస్టులు జన జీవం స్రవంతి లో కలసి ఉద్యమాలు చేపట్ట వచ్చు దేశ భవిష్యత్తు తీర్చి దిద్దవచ్చు. వారిలో కూడా మార్పు రావాలి.నీతి నిజాయితీ గల సమర్థవంతమైన పరిపాలకుడిగా ప్రపంచ ప్రఖ్యాతి చెందిన మోడీ గారు విద్యా సంస్థల సంఖ్య పెంచి యువతకు ఉపాధి కల్పించి పరిశోధనలకు పెద్ద పీట వేసి నూతన విజ్ఞానంతో కొత్త ఆవిష్కరణలు చేయించి అమెరికా, చైనా, జపాన్ లకు పోటీ గా స్మార్ట్ గా సవాల్ విసురు తాడని దేశాన్ని అన్ని కోణాలలో అభివృద్ధి చేస్తాడని వికసిత్ భారత్ వికసించి పరిమళాలు చిలికింప చేస్తాడని ఆశిద్దాం

పూసాల సత్యనారాయణ
హైదరాబాద్
9000792400

# సున్నంచెరువు ఆక్రమణల తొలగింపు

- విషతుల్యమైన నీటి దందాకు హైడ్రా బ్రేకులు
- బోర్లను తొలగించి.. నీటి ట్యాంకర్ల సీజ్ చేసిన హైడ్రా
- హైడ్రా విధులకు ఆటంకం కలిగిస్తున్న వెంకటేష్‌పై కేసు



**హైదరాబాద్, జూన్ 30 (జనంసాక్షి) :** సున్నం చెరువు పునరుద్ధరణ పనులను హైడ్రా స్పీడప్ చేసింది. ఈ క్రమంలో ఫుల్ ట్యాంక్ పరిధిలో మిగిలిన ఆక్రమణలను సోమవారం తొలగించింది. విషతుల్యం అని తెలిసినా.. సున్నం చెరువు ఆవరణలో బోర్ల ద్వారా నీటి వ్యాపారం చేస్తున్న వారిపై చర్యలు తీసుకుంది. పదుల సంఖ్యలో ఉన్న బోర్లను తొలగించడమే కాకుండా.. ట్యాంకర్లను సీజ్ చేసింది. బోర్లుకు ఆనుకుని వేసిన షెడ్డులను కూడా హైడ్రా తొలగించింది. పీసీబీ ద్వారా పరీక్షలు చేయించి.. అక్కడి నీరు చాలా ప్రమాదకరమని వివరించినా పట్టించుకోకుండా నీటి దందా చేస్తున్నవారిపై కేసులు పెట్టింది. ఎవరి ఆరోగ్యాలు ఎలా పాడైనా ఫర్వాలేదు.. తన నీటి వ్యాపారం కొనసాగడమే చాలు అని హైడ్రా విదులకు ఆటంకం కలిగిస్తున్న వెంకటేష్‌పై మాధాపూర్ పోలీసులకు హైడ్రా ఫిర్యాదు చేసింది. ఈ మేరకు వెంకటేష్‌ను మాధాపూర్ పోలీసులు ఆదివారం రాత్రి అరెస్టు చేశారు.

### ఎఫ్‌టీఎల్ పరిధిలోని ఆక్రమణపైనే చర్యలు

1970లో సర్వే ఆఫ్ ఇండియా టోపో షీట్‌ల ప్రకారం సున్నం చెరువు విస్తీర్ణం 26 ఎకరాలు. ఈ క్రమంలోనే 2016లో హెచ్ ఎండీఏ ఈ చెరువు విస్తీర్ణాన్ని 32 ఎకరాలుగా పేర్కొంటూ ప్రాథమికంగా నిర్ధారించింది. అలాగే 2014లో ఇరిగేషన్ శాఖ, రెవెన్యూ శాఖలు నిర్ధారించిన హద్దుల మేరకే నగరంలో చెరువుల పునరుద్ధరణ జరుగుతోంది. సున్నం చెరువు విషయంలో కూడా అలాగే అభివృద్ధి చేస్తున్నామని హైడ్రా స్పష్టం చేసింది. అందుకే అక్కడ గతంలో వేసిన లే ఔట్‌ను ఏళ్లక్రితం హుడా రద్దు చేసింది. చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్నందునే అక్కడ నిర్మాణాలు చేపట్టడానికి 10 ఏళ్లుగా అనుమతులు ఇవ్వడంలేదు. కోర్టు కేసుల్లో ఈ అంశం ఉందని అక్కడి ప్లాట్ యజమానులు చెబుతున్నారు. ఒక వేళ ఎవరైనా నష్టపరిహారానికి అర్హులమని భావిస్తే వెంటనే ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకోవాలని హైడ్రా సూచించింది. అలాగే టీడీఆర్ (ట్రాన్స్‌ఫర్‌బుల్ డెవలప్‌మెంట్ రైట్స్) కింద కూడా చట్ట ప్రకారం నష్టపరిహారం పొందవచ్చునని పేర్కొంది.

### బోర్లను తొలగించిన హైడ్రా..

బోరు బావుల నీరు విషతుల్యమని తెలిసినా వెంకటేష్ నేతృత్వంలో అక్కడ నీటి వ్యాపారం కొనసాగుతోంది. వెంకటేష్‌కు చెందిన షెడ్డులో రూ. లక్షల మొత్తంలో ఉన్న నగదును మాధాపూర్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అక్కడ సిండికేట్‌గా నీటి వ్యాపారం చేయించడమే కాకుండా.. అక్కడే మందు పార్టీలు జరిగినట్టు పోలీసులు గుర్తించారు. ఏకంగా చెరువు పరిధిలో బోర్లు వేసినట్టు అక్కడి మోటార్లు, వాటికి అమర్చిన ప్లాస్టిక్ పైపులు రుజువు చేస్తున్నాయి. దుర్గంధభరితంగా మారిన సున్నం చెరువు చెంత ఉన్న బోర్లలో ప్రమాదకర రసాయనాలు, భార లోహాలైన సీసం, కాడ్మియం, నికెల్ ఉందని.. ఇవి ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతాయని హైడ్రా గతంలోనే హెచ్చరించింది. ఈ మేరకు పీసీబీ ఇచ్చిన నివేదికను కూడా బయట పెట్టింది. క్యాన్సర్, కాలేయం, గుండె సంబంధిత వ్యాధులతో పాటు.. కిడ్నీలు పాడౌతాయని.. గర్భస్రావాలు కూడా అవుతాయని హెచ్చరించింది. అయినా ఆ నీటిని తాగునీటిగా హాస్టళ్లు, నివాసాలకు, కార్యాలయాలకు సరఫరా చేస్తూనే ఉన్నారు. ఎఫ్‌టీఎల్ పరిధిలోనే ఉన్న బోర్లను పూర్తిగా తొలగించింది.

### చకచకా చెరువు పునరుద్ధరణ పనులు..

మాదాపూర్ ఐటీకారిడార్‌కు చేరువగా.. బోరబండ బస్తీకి ఆనుకుని.. గుట్టలబేగంపేట వద్ద ఉన్న సున్నం చెరువు పునరుద్ధరణ పనులు వేగంగా జరుగుతున్నాయి. చెరువులో కొన్ని దశాబ్దాలుగా రెండు మూడు మీటర్ల మేర పోగైన ప్లాస్టిక్ వ్యర్థాలతో పాటు చెత్తను హైడ్రా తొలగించింది. చెరువులోకి మురుగు నీరు కలవకుండా డైవర్ట్ నాలాలను ఏర్పాటు చేసింది. వర్షపు నీరు సులభంగా చేరేలా ఏర్పాట్లు చేస్తోంది. చెరువు చుట్టూ బండ్ ఏర్పాటు చేసి వాకింగ్ ట్రాక్‌లు నిర్మించే పనులకు కూడా శ్రీకారం చుట్టింది. అలాగే పిల్లలు ఆడుకునేందుకు చిల్డ్రన్స్ పార్కు, ఓపెన్ జిమ్‌లను ఏర్పాటు చేసి.. పరిసర ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని సృష్టించేందుకు చర్యలు తీసుకుంటోంది. దోమలు, క్రిములు, కీటకాలతో దుర్గంధ భరితంగా ఉన్న వాతావరణం తొలగిపోవడంతో అక్కడ ఇంటి కిరాయిలు పెరిగాయి. ఇంటి స్థలాల ధరలు కూడా పెరిగాయని స్థానికులు చెబుతున్నారు. చెరువు పూర్తి స్థాయిలో అభివృద్ధి చెందితే మాకు ఎంతో ఊరటని స్థానికులంటున్నారు. ఈ వర్షాకాలంలోనే చెరువును పూర్తి స్థాయి అభివృద్ధి చేయడానికి హైడ్రా చకచకా పనులు సాగిస్తోంది.

## అవకాశాలను అందిపుచ్చుకొని ఉన్నత స్థానాలకు ఎదగాలి

- కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి



**హయత్‌నగర్, జూన్ 30 (జనం సాక్షి) :** హయత్ నగర్ కార్పొరేటర్ కళ్లెం నవ జీవన్ రెడ్డి తండ్రి గారైన కళ్లెం పెంట రెడ్డి నాలుగవ వర్ధంతిని పురస్కరించుకొని 2024-25 వ విద్యా సంవత్సరానికి గాను పదవ తరగతి లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థినీ, విద్యార్థు లకు నగదు ప్రోత్సాహం అందించారు. నగదు బహుమతి అందుకున్న విద్యార్థులు రవి కిరణ్ చారి, శివ చరణ్, అజయ్ కుమార్, ధరణి లు. ఈ సందర్భంగా కళ్లెం నవజీవన్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు బాగా కష్టపడి చదవాలని వచ్చిన అవకాశాలను అందిపుచ్చుకొని ఉన్నత స్థానాలకు ఏదగాలని వారు ఆకాంక్షించారు. మీరు చదువుకున్న పాఠశాలకు, తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు, మంచి పేరు, ప్రఖ్యాతలు తీసుకురావాలని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రమాదేవి, కళ్లెం శంకర్ రెడ్డి, కళ్లెం జయవర్ధన్ రెడ్డి, పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ నక్క దర్శన్ గౌడ్, తల్లిదండ్రులు, ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు, తదితరు పాల్గొన్నారు.

## విద్యార్థులు చదువుతోపాటు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకోవాలి

- మణికొండ మున్సిపాలిటీ మాజీ చైర్మన్ కస్తూరి నరేందర్ ముదిరాజ్



**రాజేంద్రనగర్, జూన్ 30 (జనంసాక్షి) :** విద్యార్థులు కష్టపడి చదివి పాఠశాలకు తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని మణికొండ మున్సిపాలిటీ మాజీ చైర్మన్ కస్తూరి నరేందర్ పేర్కొన్నారు. సోమవారం ఆయన ఆదేశాల మేరకు పుప్పాలగూడ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు నోట్ పుస్తకాలను స్టేషనరీ పరికరాలను వారి సొంత నిధులతో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మహేష్ బాబు ఉపాధ్యక్షులు మహేశ్వర్ రెడ్డిలు అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన కస్తూరి నరేందర్ విద్యార్థులకు నోటు పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు జీవితంలో ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని ముందుకు వెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జితేందర్, కార్యనిర్వాక అధ్యక్షులు కిరణ్ కుమార్, మాజీ కౌన్సిలర్ పురుషోత్తం, మాజీ కోఆప్షన్ సభ్యులు అహ్మద్ షా ఖాన్, సీనియర్ నాయకులు మల్లేష్, ప్రభావతి, సావిత్రి, శ్రీకాంత్ రెడ్డి, నాగరాజు, కోటేశ్వర్, మహేందర్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు మంగ్య నాయక్, ఉపాధ్యాయులు పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

## ఉద్యమకారులకు హామీలు నెరవేర్చాలి


- తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో శాంతియుత దీక్షలు



**అల్వాల్, జూన్ 30 (జనంసాక్షి) :** తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం డిమాండ్ చేసింది. ఈ నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఫోరం ఆధ్వర్యంలో శాంతియుత దీక్షలు నిర్వహిస్తున్నారు. అల్వాల్ జెఎసి ప్రాంగణంలో నిర్వహించిన దీక్షలో పలువురు ఉద్యమకారులు పాల్గొన్నారు. ఉద్యమకాలంలో ముందుండి పోరాడిన కార్యకర్తలకు గుర్తింపు కార్డులు, ఇండ్ల స్థలాలు, పింఛన్లు వంటి వనరులు వెంటనే అందజేయాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన వారికి ఈవరకు న్యాయం జరగలేదని, తక్షణమే ప్రభుత్వం స్పందించి హామీలు నెరవేర్చాలన్నారు. ఈ దీక్ష కార్యక్రమానికి స్థానిక కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్ రెడ్డి సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో పట్లోళ్ల సురేందర్ రెడ్డి, పుట్నాల కృష్ణ, డోలి సుధీర్, రవి, సతీష్, శోభన్ బాబు తదితరులు పాల్గొన్నారు.

## చట్టాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలి

- ఎస్సై గఫర్



**మర్పల్లి, జూన్ 30 (జనంసాక్షి) :** చట్టాల పైన ప్రతి ఒక్కరికి అవగాహన కలిగి ఉండాలని ఎస్సై గఫార్ అన్నారు. సోమవారం మర్పల్లి మండల పరిధిలోని సిరిపురం సంక్షేమ అధికారి తుల్జా రామ్ గౌడ్ మండలం పరిధిలోని పెద్దాపూర్ గ్రామంలో పౌర హక్కుల దినోత్సవం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పసిపిల్లలను చదివించాలని, 18 సంవత్సరాల లోపు పిల్లల ను చదువుకోవాలని, బాల కార్మికులను పని పెట్టుకున్నట్లయితే వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు. బాల్యవివాల చట్టం గురించి వివరిస్తూ బాలికలకు 18 సంవత్సరాలు నిండిన తర్వాతనే పెళ్లిళ్లు చేయాలని చట్టం చెబుతుందని అందుకు అనుగుణంగానే నడుచుకోవాలని తెలిపారు. ఎక్కడైనా బాల్యవివాహాలు జరిగినట్లయితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలి అని అన్నారు. వేధింపులకు గురైన మహిళలకు వరకట్న వేధింపుల చట్టం ఉందని ఆ చట్టం గూర్చి మహిళలు తెలుసుకోవాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ వెంకటేశం, బాలికల వసతి గృహ సంక్షేమ అధికారి సుష్మ, పంచాయతీ కార్యదర్శి ప్రేమ్ కుమార్, గోపాల్ రెడ్డి, అంగన్వాడీ ఉపాధ్యాయులు కే నాగమణి, ఆశా వర్కర్ శకుంతల, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## నరేంద్రమోదీ విధానాలపై ఉద్యమిద్దాం




**వరంగల్, జూన్ 30 (జనంసాక్షి) :** భారత దేశ ప్రయోజనాలను, ప్రతిష్టను మెరికాకు తాకట్టు పెడుతున్న నరేంద్రమోదీ విధానాలపై ఉద్యమించాలని, భారతీయులపై అమెరికా దుర్మార్గపు చర్యలను ఆపాలని డిమాండ్ చేస్తూ అఖిల భారత యువజన సమాఖ్య(ఏఐవైఎఫ్) తెలంగాణ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో జూలై 2న ఛలో అమెరికా రాయబార కార్యాలయ ముట్టడి కార్యక్రమానికి పిలుపునిస్తున్నట్లు ఏఐవైఫ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ సయ్యద్ వలి ఉల్లా ఖాద్రీ , తెలిపారు. ఈ ముట్టడి కార్యక్రమానికి సంబంధించిన గోడ పత్రికను వరంగల్ లోని ఎల్బీనగర్ లో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఏఐవైఫ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ సయ్యద్ వలి ఉల్లా ఖాద్రీ మాట్లాడుతూ నరేంద్రమోదీ విధానాలు దేశానికి ప్రమాదకరమని, దేశాన్ని తిరోగమన దిశలో తీసుకెళ్లే విధానాలను అనుసరిస్తూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కు వత్తాసు పలుకుతూ దేశ సార్వభౌమత్వాన్ని, ప్రతిష్టను నష్టపరిచే చర్యలను దేశ పౌరులు తిప్పికొట్టాలని వారు అన్నారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇటీవల భారత్-పాక్ యుద్ధాన్ని తానే ఆపానని చెప్పడం చూస్తే, మన దేశ ప్రతిష్టను మోడీ తాకట్టు పెట్టాడనడానికి ప్రత్యక్ష నిదర్శనమన్నారు. మోడీ ట్రంప్ మాటలను సైతం ఖండించలేదని వారు అన్నారు. భారత పౌరులపై అమెరికా దుర్మార్గంగా వ్యవహరించడాన్ని అభ్యంతరం చెప్పడంలో విఫలమవడం ద్వారా మరోసారి తన క్రూరమైన వైఖరిని బహిర్గతం చేసిన మోడీ ప్రభుత్వం మౌనం వహించడం సిగ్గుచేటన్నారు. ప్రపంచవ్యాప్తంగా భారతీయ ప్రయోజనాలను కాపాడతామని గొప్పలు చెప్పుకునే కేంద్ర ప్రభుత్వం వాస్తవానికి, ఇటువంటి కఠినమైన బహిష్కరణ చర్యల నేపథ్యంలో తన సొంత ప్రజలకు కనీస గౌరవాన్ని అందించడంలో మోడీ ప్రభుత్వం విఫలమైందన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అమెరికా ముందు లొంగిపోయారని మండిపడ్డారు. "మోదీ అమెరికా సందర్శించినప్పుడల్లా కోట్లాది రూపాయలు ప్రచారం కోసం ఖర్చు చేస్తారు. ఈ విడుదల కార్యక్రమంలో ఏఐవైఎఫ్ వరంగల్ జిల్లా కార్యదర్శి మస్కా సుధీర్, వేణు గోపాల్, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

## హైడ్రా ప్రజావాణికి 49 ఫిర్యాదులు



**హైదరాబాద్, జూన్ 30 (జనంసాక్షి) :** నాలాలు, పార్కులు, రహదారుల ఆక్రమణలపై ఫిర్యాదులు కొనసాగుతున్నాయి. వర్షాకాలం ముంపు ఇబ్బందులు ఎదుర్కొన్నవారు.. అందుకు గల కారణాలను వివరిస్తూ నాలాల ఆక్రమణలపై ఫిర్యాదు చేస్తున్నారు. అలాగే ఒకప్పుడు నిర్మానుష్యంగా ఉన్న లే ఔట్ల చుట్టూ ఉన్న ప్రహరీలు.. ఇప్పుడు తమ రాకపోకలకు అంతరాయంగా మారుతున్నాయని పలువురు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. లేఔట్లో పార్కులుగా చూపించి వాటిని ప్లాట్లుగా అమ్మేస్తున్నారని.. ప్రజావసరాలైన గుడికి, బడికి, కమ్యూనిటీ హాళ్లకు ఉద్దేశించిన ప్లాట్లను కూడా కబ్జా చేస్తున్నారని పలువురు ఫిర్యాదులందించారు. ఇలా సోమవారం హైడ్రా ప్రజావాణికి మొత్తం 49 ఫిర్యాదులందాయి. నాలాలు, పార్కులను ఆక్రమించి భవనాలు నిర్మించి అద్దెలు వసూలు చేస్తున్నారని సంబంధిత పత్రాలతో ఫిర్యాదు చేస్తున్నారు. ఇలా నగరం నలువైపుల నుంచి వచ్చిన ఫిర్యాదులను హైడ్రా అదనపు సంచాలకులు శ్రీ వర్ల పాపయ్యగారు పరిశీలించారు. ఫిర్యాదు దారుల ముందే వాటిని సంబంధిత అధికారులకు అప్పగించి తదుపరి చర్యలకు ఆదేశించారు.

# స్థానిక ఎన్నికల్లో సత్తా చాటాలి

- ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి



**తాండూరు, జూన్ 30 (జనంసాక్షి) :** రాబోయే స్థానిక ఎన్నికల్లో సత్తా చాటాలని ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం తాండూరు పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో తాండూరు మండల కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా పార్టీ అధ్యక్షులు, పరిగి ఎమ్మెల్యే రాంమోహన్ రెడ్డి హాజరయ్యారు. పార్టీ పదవులు, నామినెటెడ్ పదవుల భర్తీకి నాయకులు, కార్యకర్తల నుంచి ఎమ్మెల్యేలు, పీసీసీ ఉపాధ్యక్షులు వినోద్ రెడ్డి, ఫైనాన్స్ కమిషన్ మెంబర్ రమేష్ మహారాజ్, అధికార ప్రతినిధి నరేందర్ దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రతి సంక్షేమ పథకాన్ని గడపగడపకు అందజేసే బాధ్యత కార్యకర్తల దేనన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీల ప్రకారం ప్రతి సంక్షేమ పథకాన్ని ప్రజలకు అందజేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ ముఖ్య లక్ష్యమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలోని పేద ప్రజలకు సముచిత న్యాయం జరిగిందని తెలిపారు. పాత, కొత్త తేడా లేకుండా కలిసి పనిచేయాలన్నారు. పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేసి, ప్రతి ఒక్కరికీ సముచిత స్థానం కల్పిస్తామన్నారు. పార్టీ కోసం పనిచేసే వారికి పార్టీలో పదవులు వస్తాయన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎంపీటీసీ, సర్పంచ్ టిక్కెట్ లు కార్యకర్తలు చెప్పిన వారికే, కార్యకర్తల మధ్యలోనే చర్చించి ఇస్తామన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజలకు అందిస్తున్న సంక్షేమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. గత నాయకులు జీఓలకే పరిమితం అయ్యారు. మన ప్రభుత్వం వచ్చాక, నేను ఎమ్మెల్యే గెలిచాక 300-400 కోట్లతో బషీరాబాద్ మండలంలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. యాలాల్ మండలంలోనే ఇంటిగ్రేటెడ్ స్కూల్ ఏర్పాటు చేయబోతున్నాం. యాలాల్‌లోని జంటుపల్లి, శివసాగర్ ప్రాజెక్టలను బాగు చేస్తాం. గ్రామాలలో మన సర్పంచ్, ఎంపీటీసీలు ఉంటే అభివృద్ధి ఎక్కువ జరుగుతుంది. ప్రతి గ్రామంలో 20 లక్షల నుండి కోటి రూపాయల వరకు అభివృద్ధి పనులు చేశాం. చిన్న చిన్న పొరపాట్లు ఉంటే సరిదిద్దుకుందాం. ఇటీవల ప్రతీ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పత్రాలు అందజేశాం. పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లను అందిస్తాం. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

# సున్నంచెరువు ఎఫ్‌టీఎల్ హద్దులను నిర్ణయించండి

- హైడ్రాకు అరికెపూడి సూచన



**శేరిలింగంపల్లి, జూన్ 30 (జనంసాక్షి) :** శేరిలింగంపల్లి నియోజకవర్గం మాదాపూర్ పరిధి సున్నం చెరువుకు సంబంధించి ఫుల్ ట్యాంక్ లెవెల్(ఎఫ్టిఎల్), బఫర్ జోన్ సరిహద్దులను పకడ్బందీగా నిర్ణయించి మరోమారు ఆక్రమణలకు గురికాకుండా నిర్దిష్టమైన కార్యాచరణను రూపొందించాలని హైడ్రాధికారులకు రాష్ట్ర ప్రజాపద్దుల కమిటీ చైర్మన్ అరికెపూడి గాంధీ సూచించారు. సోమవారం హైడ్రా విభాగం అధికారులు సున్నం చెరువు వద్దకు విచ్చేసి ఎఫ్ టి ఎల్ పరిధిలో ఉన్న ఆక్రమణలను తొలగింపజేస్తూ చెరువుహద్దులను పరిశీలిస్తున్న విషయాన్ని తెలుసుకున్న అరికెపూడి ఘటనా స్థలానికి చేరుకొని వారితో కలిసి పరిస్థితులను సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మాదాపూర్ పరిధి సున్నం చెరువుకు ఎంతో చరిత్ర ఉందని, ఎట్టి పరిస్థితులలోనూ ఆక్రమణలను, కబ్జాలను నిరోధిస్తూ చెరువు అన్యాక్రాంతం కాకుండా చూడాల్సిన బాధ్యత ఉందని హైడ్రాధికారులకు తెలియజేశారు. సున్నం చెరువు పరిధిని ముందుగా అంచనా వేసి ఎక్కడి వరకు ఎఫ్టిఎల్ పరిధి, ఇంకెక్కడి వరకు బఫర్ జోన్ ప్రాంతం వస్తుందో పక్కా సమాచారాన్ని సేకరించి ఆ తర్వాతే సున్నం చెరువుకు సరిహద్దులను పూర్తిస్థాయి సరిహద్దులను నిర్ణయించాలని అధికారులను ఆదేశించారు. ఇప్పటివరకు రెవెన్యూ, నీటిపారుదల శాఖ విభాగం అధికారుల నిర్లక్ష్యంవల్ల సున్నం చెరువులో చాలా ప్రాంతం కబ్జాకు గురైందని, తాను ప్రతిపక్షంలో ఉన్నప్పుడే సున్నం చెరువు పరిరక్షణ కోసం అధికారులకు అనేక సలహాలు సూచనలు ఇవ్వడం జరిగిందని, ఇప్పటివరకు అందులో ఎలాంటి పురోగతి లేకపోవడం వల్లనే నేడు సున్నం చెరువు కనుమరుగయ్యే దుస్థితికి చేరుకుందన్నారు. సున్నం చెరువు ఎఫ్ టి ఎల్ పరిధిలో ప్రస్తుతం ఉన్న నిర్మాణాలు, మునుముందు కూడా చేపట్టకుండా గట్టి చర్యలు చేపట్టాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్, సైబరాబాద్ సిపికి గతంలో తాను లేఖలు రాసిన సందర్భాన్ని గుర్తు చేస్తూ దీనిపై శేరిలింగంపల్లి డిప్యూటీ కలెక్టర్ కఠినంగా వ్యవహరించి చెరువు పరిరక్షణకు పూర్తి సంసిద్ధతతో కట్టుబడి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో శేరిలింగంపల్లి సీనియర్ నాయకులు, మహిళా నాయకురాళ్లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# మహిళలను అక్కున చేర్చుకున్నది మోడీ యే..

- రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు అయ్యగారి ప్రభాకర్ రెడ్డి
- గ్రామ గ్రామాన మోడీ 11 సంవత్సరాల వికసిత్ భారత్‌పై రచ్చబండ

**వనపర్తి బ్యూరో, జూన్ 30 (జనం సాక్షి) :** భారతదేశ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఏ దేశంలో లేని విధంగా మహిళలకు పెద్దపీట వేసి అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి వారిని అక్కున చేర్చుకున్నారని భాజపా రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు అయ్యవారి ప్రభాకర్ రెడ్డి తెలిపారు. సోమవారం వనపర్తి మండలం చందాపూర్ గ్రామంలో బిజెపి మండల పార్టీ అధ్యక్షులు సంద వెంకటేష్ ఆధ్వర్యంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ 11 సంవత్సరాల అభివృద్ధి పాలన వికసిత్ భారత్ రచ్చబండ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వనపర్తి జిల్లా బిజెపి అధ్యక్షులు డి నారాయణ, బిజెపి రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు అయ్యగారి ప్రభాకర్ రెడ్డి, వనపర్తి జెడ్పీ మాజీ అధ్యక్షులు ఆర్ లోకనాథ్ రెడ్డి ,సర్పంచుల సంఘం మాజీ రాష్ట్ర అధ్యక్షులు పురుషోత్తం రెడ్డి హాజరయ్యారు. ఈ సమావేశాన్ని పురస్కరించుకొని వారు మాట్లాడుతూ మన భారత ప్రధాని 11 సంవత్సరాల పాలన ప్రజలందరికీ ఉపయోగపడే పథకాలను ప్రవేశపెట్టారని, ఆడ పిల్లలకు బేటి పడావో బేటీ బచావో పథకంతో మొదలుకొని నిరుపేదలకు మరుగుదొడ్ల నిర్మాణము, ఉచిత సిలిండర్లు,ఉపాధి హామీ పథకానికి ఒక రోజుకు కూలి 316 రూపాయలు,ఆయుష్మాన్ భారత్ తో ఆరోగ్య గ్యారెంటీ, బ్యాంకుల్లో ప్రతి 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికి ఉచిత బ్యాంక్ అకౌంట్లు,




గరీబ్ కళ్యాణ్ యోజన కింద ఒక మనిషికి ఆరు కిలోల చొప్పున రేషన్ బియ్యం, ఇంకా 500 సంవత్సరాలు వేచి చూసిన శ్రీరాముని ఆలయం నిర్మాణం, 370 ఆర్టికల్ ఇలాంటి ఎన్నో అభివృద్ధి పథకాలు అమలు చేశారని గుర్తు జేశారు. చందాపూర్ గ్రామపంచాయతీలో పనిచేస్తున్న పారిశుద్ధ కార్మికులను సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు రామన్న గారి వెంకటేశ్వర్ రెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ శ్రీనివాస్ గౌడ్,కుమార స్వామి, జిల్లా కౌన్సిల్ సభ్యులు బాలరాజు, మండల ప్రధాన కార్యదర్శులు వాకిటి సుదర్శన్, చిన్న నరసింహ, రాఘవేందర్, శివ, వరాల సంపత్, రామకృష్ణ వివిధ గ్రామాల భూత్ అధ్యక్షులు కార్యకర్తలు వనపర్తి మండల సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

# పోలీసు సేవలను ప్రజలు వినియోగించుకోవాలి

- జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు

**గద్వాల నడిగడ్డ, జూన్ 30 (జనం సాక్షి) :** ప్రజలు నిర్భయంగా, మూడో వ్యక్తి ప్రమేయం లేకుండా ఎలాంటి పైరవీలు లేకుండా స్వచ్ఛందంగా పోలీసు సేవల్ని వినియోగించుకుంటూ, వారి ఫిర్యాదులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకునేల పోలీస్ శాఖ కృషి చేస్తుందని జిల్లా ఎస్పీ టి. శ్రీనివాసరావు అన్నారు. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన బాదితుల నుండి జిల్లా ఎస్పీ 18 ఫిర్యాదులను గద్వాల, ఆలంపూర్, శాంతినగర్ సీఐల సమక్షంలో స్వీకరించారు. పోలీస్ స్టేషన్ కు వచ్చిన ఫిర్యాదులపై ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకున్నారో సీఐ లను అడిగి వాటిని పరిష్కరించేందుకు తగు సూచనలు చేసి వాటినీ చట్ట ప్రకారం పరిష్కరించాలని సంబంధిత ఎస్సైలకు ఫోన్ చేసి ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్పి మాట్లాడుతూ ప్రజలు నిర్భయంగా, మూడో వ్యక్తి ప్రమేయం లేకుండా ఎలాంటి పైరవీలు లేకుండా స్వచ్ఛందంగా పోలీసు సేవల్ని వినియోగించుకుంటూ, వారి సమస్యలు చట్ట ప్రకారం పరిష్కరించుకునేల పోలీస్ యంత్రాంగం కృషి చేస్తుందని, శాంతి భద్రతలు పరిరక్షిస్తూనే ప్రజలకు అన్ని వేళల అందుబాటులో ఉంటూ కమ్యూనిటీ, ఇతర అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజలకు మరింత దగ్గరయ్యేల కృషి చెయ్యడం జరుగుతుందని అన్నారు.



ప్రజా సమస్యలపై ఫిర్యాదులు నేరుగా స్వీకరిస్తూ ప్రతి సోమవారం ప్రజావాణి కార్యక్రమం ద్వారా నేరుగా పిర్యాదులు స్వీకరించి తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా ఎస్పీ అన్నారు. సోమవారం వచ్చిన ఫిర్యాదుల లో భూ వివాదాలకు సంబంధించి 14, వేధింపులకు సంబందించి 2, ఇతర అంశాలకు సంబంధించి 2 ఫిర్యాదులు రావడం జరిగిందనీ ఎస్పీ శ్రీనివాసరావు తెలిపారు.

# గంజాయి, మత్తుపదార్థాల నివారణపై నార్కటిక్స్ డాగ్స్‌తో తనిఖీలు



**చేర్యాల, జూన్ 30 (జనంసాక్షి) :** మండల కేంద్రంలో ఉన్న కిరాణా షాపులు, హోటల్స్ పాన్ షాప్స్, ఇతర అనుమానస్పద ప్రాంతాలలో సోమవారం నార్కటిక్స్ డాగ్స్ తో పోలీసులు తనిఖీలు నిర్వహించారు. యువత తాత్కాలిక ఆనందం కొరకు జీవితాలు నాశనం చేసుకోవద్దని ఈ సందర్భంగా చేర్యాల ఎస్ఐ నిరేష్, మాట్లాడుతూ.. ముఖ్యంగా యువతి యువకులు గంజాయి డ్రగ్స్ ఇతర మత్తుపదార్థాలకు బానిసలు కావద్దని సూచించారు. ఆనందం ఎంజాయ్ గురించి గంజాయి తీసుకుని బంగారు భవిష్యత్తు నాశనం చేసుకోవద్దని తెలిపారు. గంజాయి ఇతర మత్తు పదార్థాలకు అలవాటు పడితే శరీరం శారీరకంగా మానసికంగా కృంగిపోతుందని తెలిపారు. ముఖ్యంగా తల్లిదండ్రులు పిల్లలు ఏం చేస్తున్నారని గమనిస్తూ ఉండాలన్నారు. ఏదైనా పిల్లల ప్రవర్తనలో అనుమానం ఉంటే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. పిల్లలను పిలిపించి కౌన్సిలింగ్ నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. గంజాయి ఇతర మత్తుపదార్థాలు ఎవరైనా కలిగి ఉంటే అమ్మిన విక్రయించిన వెంటనే డయల్ 100 లేదా తెలంగాణ యాంటీ నార్కటిక్స్ బ్యూరో టోల్ ఫ్రీ నెంబర్,1908 లేదా చేర్యాల పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. డాగ్ స్క్వాడ్ సిబ్బంది, కానిస్టేబుళ్లు శ్యాంసుందర్, శంకర్ చేర్యాల పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# గుర్తింపు లేని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

- బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనాథ్

**జడ్చర్ల, జూన్ 30 (జనం సాక్షి) :** మండల కేంద్రంలో ఎలాంటి ప్రభుత్వ గుర్తింపులు లేని ప్రైవేటు పాఠశాలలపై కఠిన చర్యలు తీసుకోవాలని భారతీయ జనతా యువమోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనాథ్ అన్నారు. మండల కేంద్రంలో ప్రభుత్వ గుర్తింపు లేకుండా కొనసాగుతున్న ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సోమవారం బీజేవైఎం జడ్చర్ల శాఖ ఆధ్వర్యంలో మండల విద్యాధికారిని మంజుల దేవికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనాథ్ మాట్లాడుతూ మండల కేంద్రంలో పుట్టగొడుగుల పుట్టుకొస్తున్న ప్రైవేటు పాఠశాలలపై కఠిన చర్యలు తీసుకొని, గుర్తింపు లేని పాఠశాలలను రద్దు చేయాలని, ప్రైవేటు పాఠశాలలు ఫీజుల పేద, మధ్యతరగతి ప్రజలకు భారంగా మారాయని, అధిక ఫీజులు వసూలు చేస్తూ, అధిక ధరలకు నోట్ బుక్స్, టెస్ట్ బుక్స్ లను అమ్ముతూ ప్రైవేటు విద్యను భారంగా మారుస్తున్నాయని, అలాంటి పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో బీజేవైఎం పట్టణ అధ్యక్షులు పిట్టల నరేష్, యశ్వంత్, సూరజ్, సాయి చరణ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.




# కోటి యాభై లక్షలతో నూతన సబ్ స్టేషన్



- ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి, చేతుల మీదుగా భూమి పూజ కార్యక్రమం

**కౌడిపల్లి, జూన్ 30 (జనంసాక్షి) :** మెదక్ జిల్లా కౌడిపల్లి మండలం మహమ్మద్ నగర్ గ్రామానికి నూతన సబ్ స్టేషన్ మంజూరు కావడంతో మహమ్మద్ నగర్ మాజీ సర్పంచ్ మైపాల్ రెడ్డి, గ్రామస్తుల ఆధ్వర్యంలో 30 గుంటల ప్రభుత్వ భూమిని చదును చేసి సోమవారం భూమి పూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నర్సాపూర్ నియోజకవర్గ బిఆర్ఎస్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి, హాజరయ్యారు. అనంతరం భూమి విస్తీర్ణాన్ని సందర్శించి కొబ్బరికాయ కొట్టి భూమి పూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... నర్సాపూర్ నియోజకవర్గంలో మూడు గ్రామాలకు సబ్ స్టేషన్లు మంజూరు కావడం సంతోషకరమని అన్నారు. అలాగే మహమ్మద్ నగర్ గ్రామానికి ఒక కోటి 50 లక్షలు మంజూరు కావడంతో హర్షం వ్యక్తం చేశారు. అసలే వర్షాకాలం ప్రారంభ సమయం అయినందున వర్షాలను దృష్టిలో పెట్టుకొని పనులు చకచకా పూర్తి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మహమ్మద్ నగర్ మాజీ సర్పంచ్ మహిపాల్ రెడ్డి, తోపాటు బీఆర్ఎస్ కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు న్యాయం చేయండి

- మండల సిపిఎం ప్రధాన కార్యదర్శి డి బాల్ రెడ్డి
- కలెక్టర్‌కు వినతిపత్రం అందించిన సిపిఎం నాయకులు

**వీపనగండ్ల, జూన్ 30 (జనం సాక్షి) :** సిపిఎం వీపనగండ్ల మండల కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ప్రజావాణి సందర్భంగా కలెక్టర్ కు ప్రభుత్వ పాఠశాల నుండి డిప్టేషన్ వెళ్లిన ఉపాధ్యాయుల డిప్యూటేషన్లు రద్దుచేసి న్యాయం చేయాలని వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి డి బాల్ రెడ్డి మాట్లాడుతూ డిప్టేషన్ పై వెళ్లిన ఉపాధ్యాయులను వెంటనే రప్పించాలని, బాలిక, బాలుర పాఠశాలలో ఆంగ్ల ఉపాధ్యాయులు లేకపోవడంతో విద్యార్థులకు చదువుకు దూరం అవుతున్నారని అన్నారు. ఈ సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు, ప్రజాప్రతినిధులు పేద విద్యార్థుల గురించి ఆలోచన చేయాలి తప్ప ఉపాధ్యాయ సంఘాల గురించి కాదు, ఇప్పటికైనా స్థానిక మంత్రి జూపల్లి కృష్ణారావు చొరవ తీసుకొని వెంటనే ఏర్పాటు చేయాలని వారు కోరారు. ఈ సమస్య పరిష్కారం కాకపోతే



ఆందోళన పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. స్పందించిన కలెక్టర్ మాట్లాడుతూ వెంటనే పంపిస్తామని హామీ ఇవ్వడం జరిగింది ఆని అన్నారు. ఈ కార్యక్రమంలో అఖిలపక్షం కన్వీనర్ సతీష్ యాదవ్, సిపిఎం జిల్లా నాయకులు దేవేందర్,ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

# మత్స్యకారులకు చేపలకు బదులు నగదు ఇవ్వాలి

- మత్స్యకారుల జిల్లా అధ్యక్షులు బాలయ్య

**వీపనగండ్ల, జూన్ 30 (జనం సాక్షి) :** వీపనగండ్ల మండలం గోవర్ధనగిరి గ్రామ మత్స్య పారిశ్రామిక సహకార సంఘం ఆధ్వర్యంలో మత్స్యకారులకు రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న చేప పిల్లలు నాణ్యమైనవి కాకుండా, తగిన కాలములో చేప పిల్లలను సరఫరా చేయకపోగా, నిర్దిష్ట కాలములో పెరగాల్సిన తూకము చేప పిల్లలు పెరగక పోవడం వలన, మత్స్యకారులు, మత్స్య కార్మికులు లక్షలాది రూపాయలు నష్టపోతున్నారు అన్ని జిల్లా అధ్యక్షులు బాలయ్య అన్నారు. చేప పిల్లల పెంపకంలో రాష్ట్ర ప్రభుత్వం టెండర్ల ద్వారా పిలువగా, అట్టి టెండర్‌ను దక్కించుకున్న కాంట్రాక్టర్ నాణ్యమైనవి కాకుండా ఆయా గ్రామాల చెరువులు, కుంటల నేల స్వభావానికి తగ్గట్టు చేప పిల్లలు ఇవ్వకపోవడం వలన మత్స్యకారులు, మత్స్య కార్మికులు లక్షలాది రూపాయలు కూడా నష్టపోతున్నారు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వము, చేప పిల్లల బదులు మత్స్య పారిశ్రామిక సహకార సంఘాలకు ప్రభుత్వం ఇస్తున్న చేప పిల్లల తయారీకి అవుతున్న ఖర్చు మొత్తం డబ్బులను వారి వారి అకౌంట్లో నగదు బదిలీ చేయాలని కోరుతూ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డికి గోవర్ధనగిరి గ్రామ మత్స్య పారిశ్రామిక సహకార సంఘం లేఖ రాయడం



జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మత్స్య పారిశ్రామిక సహకార సంఘం జిల్లా డైరెక్టర్, గోవర్ధనగిరి గ్రామ మత్స్య పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షులు మేకల సురేంద్రబాబు, ఉపాధ్యక్షులు యాటకిరి నాగన్న, కార్యదర్శి గుంటి మహేష్, కోశాధికారి కొలగారి పడిగెన్న, డైరెక్టర్లు బొలమోని పెంటన్న, ఎం. ఆంజనేయులు, మరియు సంఘం సభ్యులు బొలమోని ధర్గేష్, కోలగారి కృష్ణయ్య, కొట్టం లక్ష్మయ్య, కొలగారి గణేష్ తదితరులు పాల్గొన్నారు.

# కృష్ణ నది తీర ప్రాంత గ్రామల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- జిల్లా ఎస్పీ శ్రీనివాస రావు

**గద్వాల నడిగడ్డ, జూన్ 30 (జనం సాక్షి) :** కర్ణాటక రాష్ట్రంలో ఎగువ ప్రాంతంలో కురుస్తున్న అధిక వర్షాల కారణంగా పై నుండి కృష్ణ నదికి భారీగా వరద వస్తున్నందున జిల్లా లోని నది తీరా గ్రామల ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని, ఇప్పటికే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పోలీస్ సిబ్బందినీ నది తీరా ప్రాంతంలో అందుబాటులో ఉంచినట్లు జిల్లా ఎస్పీ టి. శ్రీనివాస రావు తెలిపారు.

సోమవారం జిల్లా ఎస్పీ పోలీస్ అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించిజూరాల డ్యాం నుండి లక్ష 56 వేల క్యూ సెక్ ల వరద వస్తున్నందున పోలీస్ శాఖ పరంగా చేపట్టవలసిన చర్యల గురించి పోలీస్ అధికారులకు పలు ఆదేశాలు జారీచేశారు. ఎగువ ప్రాంతం కర్ణాటక రాష్ట్రం లో భారీ వర్షాలు కురుస్తునందున కృష్ణ నది ఉధృతంగా ప్రవహిస్తుంది అని,నది పరివాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు ఎప్పటికప్పుడు వాగులు నదులు ఉధృతిని అంచనా వేస్తూ నది తీరా వ్యవసాయ పొలాలలో అన్న రైతులను,గొర్రెలు , పశువుల కాపరులను అప్రమత్తం చేయాలనీ అన్నారు. అలాగే




నది తీరానికి మరింత దగ్గర ఉన్న ఉన్న గ్రామాలలో టామ్ టామ్ వేయించి ప్రజలను అప్రమత్తం చేయాలని,నది ప్రవహక ప్రాంతాలలో ప్రధాన పుష్కర ఘాట్లు అయిన బీచుపల్లి,జూరాల డ్యాంఘాట్, గుంది మల్లలోని పుష్కర ఘాట్ లలో పర్యాటకులు నదిలోకి వెళ్లకుండా హెచ్చరిక బోర్డులు, ఫ్లేక్సీలు ఏర్పాటు చేయించాలని అధికారులను సిబ్బందిని ఆదేశించారు. బ్లూ కోల్ట్స్ సిబ్బందితో 24 గంటలు నది తీరా గ్రామాల్లో గస్తీ ఏర్పాటు చేయాలనీ అధికారులను ఎస్పీ అదేశించారు. పోలీస్ అధికారులు నది తీరా గ్రామాల మాజీ సర్పంచులు, ప్రజా ప్రతినిధులతో ఎప్పటికప్పుడు వరద ఉధృతి గురించి అడిగి తెలుసుకొని ప్రమాద నివారణ చర్యలను చేపట్టడానికి సిద్ధంగా వుండాలని సూచించారు.

## ఆనందాన్ని విషాదం చేసుకోవద్దు

సెలవు రోజులలో సాధారణ రోజులలో జిల్లా లోని జూరాల డ్యాం, బిచూపల్లి వంటి పర్యాటక ప్రదేశాలకు వచ్చే వారు వరదల సమయం లో చాలా అప్రమత్తంగా ఉండాలని, అక్కడి పోలీస్ వారి సూచనలను తప్పకుండా పాటించాలని, సెల్ఫీ ల మోజులో పడి, అజాగ్రత్తగా వెళ్లి సంతోషంగా ఉండే తమ కుటుంబాలను విషాదం చేసుకోవద్దని, ముఖ్యంగా యువత ఈ విషయంలో అజాగ్రత్తగా ఉండొద్దని ఎస్పీ సూచించారు. నది తీరా గ్రామల ప్రజలకు ఏమైనా ఇబ్బందులు తలెత్తిన డయల్ 100 కి కాల్ చేయాలని తెలిపారు. జిల్లాలో శాంతి భద్రతలను కాపాడుతూ, జిల్లా ప్రజల సంక్షేమం లో కూడా పోలీస్ అధికారులు ఎల్లపుడూ ముందు వరసలో ఉంటారని జిల్లా ఎస్పీ శ్రీనివాస రావు అన్నారు.

# ప్రజావాణి కార్యక్రమం ద్వారా ప్రజా సమస్యల సత్వర పరిష్కారం



**గద్వాల నడిగడ్డ, జూన్ 30 (జనం సాక్షి) :** ప్రజావాణి కార్యక్రమం ద్వారా ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ బి.యం. సంతోష్ అన్నారు. సోమవారం కలెక్టర్ కార్యాలయములోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన 67 మంది తమ సమస్యల పరిష్కరం కోసం దరఖాస్తు చేసుకున్నారని కలెక్టర్ తెలిపారు.ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన దరఖాస్తులపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించి వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు లక్ష్మి నారాయణ,నర్సింగ్ రావులతో కలసి కలెక్టర్ ఫిర్యాదులను స్వీకరించారు.వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పథకాలు పక్కాగా అమలు

- అధికారుల నిరంతర పర్యవేక్షణ
- 15 రోజులు.. టార్గెట్ 5000 నిర్మాణాలు
- జిల్లా నుండి మొదలు గ్రామ స్థాయి వరకు అన్ని కార్యాలయాలలో ఇంకుడు గుంతలు
- జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



**జనగామ ప్రతినిధి, జూన్ 30 (జనంసాక్షి) :** అర్హులైన నిరుపేదలకు ప్రభుత్వ పథకాలు చేరేంత వరకు అధికారులందరూ ప్రత్యేక దృష్టి సారించి పర్యవేక్షణ చేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ అన్నారు. సోమవారం గ్రీవెన్స్ కార్యక్రమాన్ని పురస్కరించుకొని అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్, రోహిత్ సింగ్ లతో కలిసి జిల్లా ప్రజల నుండి కలెక్టర్ వినతులను స్వీకరించారు.స్వీకరించిన దరఖాస్తులను సంబంధిత శాఖ వారికి అందజేస్తూ త్వరితగతిన ప్రజల సమస్యలను క్షేత్రస్థాయిలో విచారణ జరిపించి పరిష్కరించాలన్నారు. ఈనాటి గ్రీవన్స్ కి 59 దరఖాస్తు లు రాగా.అందులో కొన్నింటి వివరాలు, కొడకండ్ల మండలం ఏడు నూతల గ్రామానికి చెందిన సోమారపు ఆమని తనకు 9 ఎకరాల భూమి ఉన్నదని...అందులో నుండి మూడు ఎకరాలు తన పేరు మీద పట్టా చేసి పట్టాదార పాస పుస్తకము ఇవ్వమని కోరింది.శ్రీవాణి అనే మహిళ జనగామలోని 11వ వార్డులో నివాసం ఉంటున్నదని... ప్రజాపాలనలో భాగం గా ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్నానని తనకి ఇందిరమ్మ ఇల్లు ఇప్పించమని వినతి సమర్పించింది.లింగాల గణపురం కుందారం గ్రామానికి చెందిన రామక్క అనే మహిళ.. తనకు వారసత్వంగా వచ్చిన భూమిని ఆమె మరిది అక్రమంగా పట్టా చేసుకున్నాడని...తన వాట తనకు ఇప్పించమని దరఖాస్తు పెట్టుకుంది.చిల్పూరు మండలం శ్రీపతి పల్లి గ్రామానికి చెందిన చిన్న వెంకటయ్య అనే వ్యక్తి.. తన భూమి ని ఫోర్జరీ చేసి వేరే వాళ్ళు పట్టా చేయించుకున్నారని... తన దగ్గర ఉన్న పహానీలను పరిశీలించి పట్టా పాసు బుక్కులు, తమ పేరు మీద ఇప్పించగలరని కోరారు.గ్రీవెన్స్ అనంతరం వివిధ అంశాలపై అన్ని శాఖల అధికారులతో లికలెక్టర్లి మాట్లాడుతూ మంజూరు అయిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు త్వరగా పూర్తయి లబ్ధిదారులకు నగదు జమ అయ్యేలా పర్యవేక్షణ చేయాలన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యం ముగిసేంత వరకు పర్యవేక్షణ నిరంతర ప్రక్రియగా జరగాలన్నారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మాత్రమే ఇసుక ఉచితంగా రవాణా జరిగేలా తహసీల్దార్‌లు ప్రత్యేక పర్యవేక్షణ ఉండాలన్నారు.

**ఫీవర్ సర్వేను ప్రారంభించాలి**

సీజనల్ వ్యాదులు ప్రబలకుండా డీపీవో, డీఎంహెచ్‌వో, మున్సిపల్ కమిషనర్ సమన్వయంగా పనిచేయాలన్నారు.జిల్లాలో టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించాలని, జిల్లా లో టీబీ ఉన్న వారిని గుర్తించాలన్నారు. రెవెన్యూ సదస్సులో వచ్చిన దరఖాస్తులకు సంబంధించి భూ భారతి పోర్టల్ లో నమోదు చేసి త్వరగా విచారణ చేయాలన్నారు. మన జిల్లా మన నీరు లో భాగంగా జిల్లాలోని అన్ని శాఖల అధికారులు వారి పరిధిలోని మండల, గ్రామ స్థాయిలోని అన్ని కార్యాలయాల్లో తక్కువ ఖర్చుతో ఇంకుడు గుంతను నిర్మించాలన్నారు. జులై 15లోగా 5000 నిర్మాణాలు పూర్తి కావాలన్నారు. తక్కువ ఖర్చుతో ఇంకుడు గుంతను నిర్మించే విధానం పైన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అధికారులకు అవగాహన కల్పించారు. అనంతరం కలెక్టరేట్లో లిమన జిల్లా మన నీరులో భాగంగా తక్కువ ఖర్చుతో మొట్టమొదటిగా నిర్మించిన ఇంకుడు గుంతను అన్ని శాఖల అధికారులకు చూపించి నిర్మాణ తీరును, ప్రాధాన్యతను తెలియజేశారు. ఈ కార్యక్రమం లో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ లు, ఆర్డీవో లు, డి అర్ డి ఏ పీడీ, వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

# పసుపు బోర్డుకు నిధులేవి ?

**సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ ఆగ్రహం**



**హైదరాబాద్ (జనంసాక్షి) :** అమిత్‌షా వచ్చి నిజామాబాదులో పసుపుబోర్డు కార్యాలయాన్ని ఎంఎల్‌ఏ ఆఫీసులో ప్రారంభించడం తప్ప, బోర్డు పనుల అభివృద్ధికి ఎలాంటి నిధులు కేటాయించకపోవడం పట్ల సీపీఐ(ఎం) తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ ఆగ్రహం వ్యక్తం చేశారు. అమిత్ షా వస్తున్న సందర్భంగా ఎలాంటి నిరసనలకు, ఆందోళనలకు పిలుపులేకున్నా సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి రమేష్‌బాబుతో పాటు, మిగతా నాయకులను, కార్యకర్తలను, ఇతర వామపక్ష పార్టీల నాయకులనంతా ముందురోజే అరెస్టు చేసి పోలీస్ స్టేషన్లల్లో నిర్బంధించడాన్ని సీపీఐ(ఎం) తీవ్రంగా ఖండిస్తున్నది. కేంద్ర ప్రభుత్వానికి వత్తాసు పలికే పద్ధతుల్లో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇలాంటి చర్యలకు పూనుకోవడాన్ని వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. ఇప్పటికే రాష్ట్రంలో కొంత మంది బీజేపీ ఎమ్మెల్యేలను, ఎంపీలను గెలిపించి ప్రజలు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. ఇలాంటి పరిస్థితుల్లో తెలంగాణలో తాము అధికారంలోకి రాబోతున్నామని సభలో అమిత్ షా మాట్లాడడం హాస్యాస్పదమన్నారు. రాబోయే ఎన్నికల్లో బీజేపీకి ఉన్న సీట్లే గల్లంతవుతాయని తెలిపారు. బీజేపీ రాష్ట్రానికి ఏం చేసిందని గెలుస్తామని కలలుగంటుందో అర్థంకావడం లేదన్నారు. నిజామాబాదు ప్రాంతంలో పసుపు ఎక్కువ ఉత్పత్తి అవుతుందని అమిత్‌షా చెప్పినప్పటికీ, ఈ బోర్డుకు కావాల్సిన యంత్రాలు తదితర పరికరాలకు ప్రతిపాదనలు గాని, కేటాయింపులు చేయలేదన్నారు. పసుపు బోర్డు ప్రాంతంలోని రైతుల సమస్యలపై, కనీస మద్దతు ధరపై ఒక్క మాట కూడా మాట్లాడలేదన్నారు. రాష్ట్రంలో ప్రాజెక్టులకు నిధులు కేటాయింపుతో పాటు, జాతీయ హెూదా కూడా ఇవ్వలేదని తెలిపారు. బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీకి, రైల్వే కోచ్ ఏర్పాటుకు కూడా నిధుల కేటాయింపులేదని, ఆదిలాబాదు జిల్లాలో సిమెంట్ ఫ్యాక్టరీని ప్రారంభిస్తామని చెప్పి బీజేపీ ఎంఎల్‌ఏగా గెలిచిన పాయల్‌శంకర్, ఇప్పుడు ఆ ఊసే ఎత్తడం లేదని తెలిపారు. ఆదిలాబాదు అడవీ ప్రాంతంతో పాటు, ఆసిఫాబాద్‌లోని 10మండలాల్లో దాదాపు ఏడు లక్షల ఎకరాల భూమినంతా కాజేసీ కార్పొరేట్ సంస్థలకు అప్పగించి, గిరిజనులనంతా ఆ ప్రాంతాల నుంచి తరిమేసే కార్యక్రమానికి పూనుకుంటున్నదని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఒత్తిడితోనే రాష్ట్ర ప్రభుత్వం కూడా జీవోని తెచ్చిందని, రాష్ట్ర అభివృద్ధికి, హక్కులకు, నిధులకు, సామాజిక న్యాయానికి, రాష్ట్ర ప్రజానీకానికి పూర్తి వ్యతిరేకంగా కేంద్ర బీజేపీ ప్రభుత్వం పని చేస్తున్నదని తెలిపారు. ఈ నేపథ్యంలో మతోన్మాద రాజకీయాలను కొనసాగిస్తున్న బీజేపీని ఓడించడానికి సీపీఐ(ఎం)తో సహా, ఇతర వామపక్ష పార్టీలు కలిసి పనిచేస్తాయి.

# గ్రీవెన్స్ దరఖాస్తులను పరిశీలించాలి

- మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్



**మహబూబాబాద్ బ్యూరో, జూన్ 30(జనం సాక్షి):** ప్రజలు తమ సమస్యల కోసం ప్రజావాణి లో సమర్పించిన దరఖాస్తులను పరిశీలించి పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ అన్నారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ లోని ప్రధాన సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్, రెవెన్యు అదనపు కలెక్టర్ కె.వీరబ్రహ్మాచారీతో కలిసి గ్రీవెన్స్ లో ప్రజల నుండి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా కేసముద్రం మండలం రంగాపురం గ్రామానికి చెందిన లేదల్ల రమాదేవి మహబూబాబాద్ మండలం సింగారం గ్రామంలో గల తన తండ్రి పేరు పైన ఉన్న భూమి ఇతరులకు పేరు మార్పిడి ఎలా జరిగింది, ఏవిధమైన పత్రాలు సమర్పించారో తెలుపగలరని సమాచార హక్కు చట్టం దరఖాస్తు ద్వారా ప్రజావాణిలో కోరారు. తొర్రూరు మండలం మడిపల్లి గ్రామానికి చెందిన సరోజన తను గతంలో రిజిస్ట్రేషన్ చేసుకున్న మడిపల్లి శివారులో ఉన్న భూమి ప్రొహిబిటెడ్ భూమి అని చూపిస్తుందని దానిని సరిచేయగలరని కోరారు. కేసముద్రం మండలం కాట్రపల్లి గ్రామానికి చెందిన బోడ కవిత తను భర్తను కోల్పోయి ఒంటరిగా ఎటువంటి ఆధారం లేకుండా జీవిస్తున్నానని, తనకు ఇందిరమ్మ ఇల్లు రానీయకుండా కొంతమంది ఇందిరమ్మ ఇళ్ళ కమిటీ సభ్యులు ప్రయత్నిస్తున్నారని, తన కుటుంబ పరిస్థితి అలోచించి తనకు ఇందిరమ్మ ఇల్లు వచ్చే విధంగా న్యాయం చేయాలని కోరారు. పట్టణంలోని బాబాగుట్ట ఎర్రబోడ్ కాలనీకి చెందిన షేక్ జరీనా తనకు ఖాళీ స్థలం ఉన్నదని, ఇల్లు లేదని ప్రభుత్వం వారు మంజూరు చేసే ఇందిరమ్మ ఇల్లు ఇప్పించి న్యాయం చేయాలని కోరారు. ఇలా మొత్తం 148 దరఖాస్తులను వివిధ శాఖ ల అధికారులకు సమస్యల పరిష్కారానికై అధికారులను ఆదేశించారు.

# ప్రజావాణి దరఖాస్తులు పరిష్కరించాలి

- వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద..



**వరంగల్ ప్రతినిధి, జూన్ 30 (జనంసాక్షి):** వరంగల్ జిల్లా కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, అదనపు కలెక్టర్ జి సంధ్యారాణి, డియార్వో విజయలక్ష్మి , జడ్పీ సీఈవో రామ్ రెడ్డి, డిఆర్డిఓ కౌసల్యాదేవి,ఆర్డీవోలు వరంగల్ సత్యపాల్ రెడ్డి,నర్సంపేట ఉమారాణి గార్లు పాల్గొని ప్రజలనుండి స్వీకరించారు.స్వీకరించిన దరఖాస్తులను సంబంధిత అధికారులకు ఎండార్స్ చేస్తూ త్వరగా పరిష్కరించాలని జిల్లా అధికారులను ఆదేశించారు. ఈ ప్రజావాణిలో మొత్తం 130 దరఖాస్తులు రాగా ఎక్కువగా రెవెన్యూ 54, హౌసింగ్ 20 దరఖాస్తులు వచ్చాయని మిగతా శాఖలకు సంబందించిన దరఖాస్తులు 56 వచ్చాయని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సంబంధిత శాఖ అధికారుల దృష్టికి వచ్చిన సమస్యల పరిష్కారం లభించకపోవడంతో ప్రజావాణికి దరఖాస్తులు ఎక్కువగా వస్తున్నాయని, మీ పరిధిలో పరీక్షించవలసిన సమస్యలను పరిష్కరించి ప్రభుత్వం దృష్టికి తీసుకురావాలని సంబంధిత జిల్లా అధికారులకు సూచించారు. వ్యవసాయ, ఆరోగ్య, విద్యా శాఖ మరియు తదితర శాఖలు శాఖపరమైన కార్యాచరణ ప్రణాళికలు రూపొందించి నిర్ణీత గడువులోగా పనులు చేయించాలని పనులపై పూర్తి స్థాయిలో పర్యవేక్షణ చేసి లక్ష్యాలను సాధించే దిశగా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమం జిల్లా వ్యవసాయ శాఖ అధికారి, కలెక్టరేట్ పరిపాలన అధికారి విశ్వప్రసాద్ వరంగల్, ఖిలా వరంగల్ తహసిల్దార్లు ఇక్బాల్,నాగేశ్వర్ రావు, హార్టికల్చర్ అధికారి అనసూయ, డిబిసిడివో పుష్పలత,జిల్లా విధ్యాశాఖ అధికారి జ్ఞానేశ్వర్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తులకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలి

- జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్



**ములుగు ప్రతినిధి, జూన్ 30(జనంసాక్షి) :** ప్రజావాణి కార్యక్రమంలో వచ్చే దరఖాస్తులకు అధిక ప్రాధాన్యత ఇచ్చి త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, అదనపు కలెక్టర్లు, సిహెచ్ మహేందర్ జి, సంపత్ రావు లు పాల్గొని ప్రజలనుండి దరఖాస్తులు స్వీకరించారు. స్వీకరించిన దరఖాస్తులను సంబంధిత అధికారులకు ఎండార్స్ చేస్తూ త్వరగా పరిష్కరించాలని, ప్రజల నుండి వచ్చిన దరఖాస్తులకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమంలో 85 దరఖాస్తులు రాగా అత్యధికంగా భూ సమస్యలు 39, గృహ నిర్మాణ శాఖకు 16, ఉపాధి కల్పనకు 03, పెన్షన్ 06, ఇతర శాఖలకు సంబంధించినవి 21 దరఖాస్తులు వచ్చాయని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన దరఖాస్తులను ప్రాధాన్యతా క్రమంలో పరిశీలించి, వాటిని వెంటనే పరిష్కరించేందుకు కృషి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వివిధ జిల్లా స్థాయి అధికారులు, కలెక్టరేట్ పరిపాలన అధికారి, పర్యవేక్షకులు, తహసీల్దార్లు, ఎంపిడిఓ లు, ఎంపిఓ లు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాసమస్యలను పరిష్కరించాలి

- జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** ప్రజావాణిలో వచ్చిన సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు అధికారులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఐడిఓసి కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్ర మంలో జిల్లాలోని వివిధ ప్రాం తాల నుండి వచ్చిన ప్రజల విన తులను జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ స్వీకరించారు. అనంతరం ఆయా సమస్యలపై సంబంధిత అధికారులతో చర్చించి, పరిష్కారానికి తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడు తూ ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 57 దరఖాస్తులు అందాయనీ, వాటి పరిష్కారానికి ప్రత్యేక శ్రద్ధతో పని చేయాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, రెవెన్యూ అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, ఆర్డిఓ రవి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# మీడియా ఆఫీసులపై దాడి అమానుషం

- భూపాలపల్లిలో జర్నలిస్టుల నిరసన, ధర్నా..



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** మీడియా ఆఫీసులపై దాడి అమానుషమని భూపాలపల్లి జర్నలిస్టులు ముక్తకంఠంతో ఖండించారు. హైదరాబాదులో మహా టీవీ ఆఫీస్ పై దాడి చేయడాన్ని నిరసిస్తూ సోమవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలో కాకతీయ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో జర్నలిస్టులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ప్రెస్ క్లబ్ కార్యాలయం నుండి హనుమాన్ టెంపుల్ మీదుగా అంబేద్కర్ చౌరస్తా వద్దకు బైక్ ర్యాలీ నిర్వహించి, ధర్నా చేశారు. అనంతరం జిల్లా ఎస్పీకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీనియర్ జర్నలిస్టులు క్యాతం సతీష్, మంతెన సమ్మయలు మాట్లాడుతూ సమాజంలో అన్యాయాలు, అక్రమాలను అరికట్టేందుకు సేకరించిన సమాచారాన్ని ప్రజలకు తెలియజేయడం కోసం ప్రసారం చేసే హక్కు మీడియా వ్యవస్థలకు ఉంటుందని అన్నారు. ఇది కేవలం మహా టివి సంస్థపై జరిగిన దాడి కాదని, ప్రజల స్వేచ్ఛను హరించడం కోసం ప్రజాస్వామ్యాన్ని నిర్వీర్యం చేయడం కోసం ఈ రాష్ట్రంలో జరుగుతున్న పెత్తందార్ల కుట్ర అని మండిపడ్డారు. ఇప్పటికైనా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఫోర్త్ ఎస్టేట్ గా పిలవబడే జర్నలిజం వ్యవస్థని పటిష్టం చేయడం కోసం కఠినమైన చట్టాలు తీసుకురావాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు సామంతుల శ్యామ్, తడుక సుధాకర్, సామల శ్రీనివాస్, దేవ సతీష్, చెరుకు సుధాకర్, సర్వేశ్వర్ రావు, శేఖర్ నాని, మధు, రడపాక రమేష్, తిక్క ప్రవీణ్, సత్యనారాయణ, నరేందర్, జగన్ తదితరులు పాల్గొన్నారు.


# కాంగ్రెస్ హయాంలోనే ప్రజారవాణా వ్యవస్థ మెరుగు

- మంచిర్యాల ఆర్టీసీ డిపోను అభివృద్ధి చేస్తా
- మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ సాగర్ రావు



**మంచిర్యాల ప్రతినిధి జూన్ 30 (జనంసాక్షి) :** ప్రజా రవాణా వ్యవస్థ కాంగ్రెస్ హయాంలోని ప్రారంభమయ్యాయని, మళ్లీ కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలోనే ప్రజా రవాణా వ్యవస్థను అభివృద్ధి చేస్తామని మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ సాగర్‌రావు పేర్కొన్నారు. సోమవారం నాడు మంచిర్యాల పట్టణంలోని బస్ డిపోను మంచిర్యాల శాసనసభ్యులు కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు పరిశీలించారు .ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు మాట్లాడుతూ తను అధికారంలో వచ్చినప్పటినుండి ప్రజల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తున్నానని తెలిపారు. ప్రజల కోసం అనేక సంక్షేమ పథకాలను , మంచిర్యాల నియోజకవర్గాన్ని అనతి కాలంలోనే అభివృద్ధి చేయడానికి గౌరవ ముఖ్యమంత్రి కి కలిసి ఎన్నో నిధులను తీసుకువచ్చి అభివృద్ధి చేస్తున్నానని తెలిపారు . మంచిర్యాల క్లబ్ లో 3కోట్ల నిధులు గోల్ మాల్ జరిగిందని ఎవరి హయాంలో గోల్‌మాల్ జరిగిందో ఆడిటింగ్ చేయించి వాళ్ళపై లీగల్‌గా చర్యలు తీసుకుంటామని తెలిపారు. సొసైటీకి సంబంధించిన ఆస్తుల అవకతవకల పై నిర్ణయాలు తీసుకునే చర్యలు తీసుకునే హక్కు రాష్ట్ర ప్రభుత్వానికి ఉందని అన్నారు. అతి త్వరలోనే మంచిర్యాల బస్టాండ్ ను అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం సంబంధిత అధికారులు ఎమ్మెల్యే ని శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో బస్ డిపో అధికారులు, తాజా మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, యువజన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్టీ కులధృవీకరణ కోసం లంబాడీ విద్యార్థులు నానాతంటాలు



**నేరడిగొండ జూలై1 (జనంసాక్షి):** ఎస్టి లంబాడీలను క్యాస్ట్ కోసం నోటరీ టీచర్ స్టేట్మెంట్ తో సంతకం అనుకుంటూ సతాయిస్తే ఊరుకోమని జిల్లా లైవ్ అధ్యక్షులు మహేందర్ జాదవ్ అన్నారు.సోమవారం రోజున విలేకరులతో మాట్లాడుతూ లంబాడీ జాతికి చెందిన పెద కుటుంబ విద్యార్థి విద్యార్థుల ఉన్నత స్థాయి చదువు కోసం క్యాస్ట్ సర్టిఫికెట్ అవసరం నిమితం రెవెన్యూ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. రెవెన్యూ అధికారులు లేనిపోని ఏదోఒకటి చెప్పి కాలయాపన చేస్తూ 1977 క్యాస్ట్ లిస్టు గతంలో జారీ చేసిన పాత కుల ధ్రువీకరణ పత్రం నోటరీ వకీల్ బాండ్ పేపర్ ఇతరేతర ప్రూఫ్ పేపర్లు అడిగి కాలయాపన చేస్తూ ఆర్థికంగా పేద గిరిజన లంబాడీ జాతి ప్రజలపైన పడుతుందని,అందుకని ఉన్నతాధికారులు స్పందించి పాత క్యాస్ట్ ప్రకారం క్యాస్ట్ సర్టిఫికేట్ జారీ చేయాలని, పెద గిరిజన లంబాడీ లపై ఆర్థిక భారం పడకుండా ఉండేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా మండల ఎమ్మార్వోలకు మహేందర్ జాదవ్ కోరారు.క్యాస్ట్ సర్టిఫికెట్ జారీ చేయని యెడల లంబాడి జాతి పెద్ద ఎత్తున ఎస్టీ కమిషనరేట్ ముట్టడి చేస్తామని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో బంజారా నాయకులు భారత్ చవాన్ కృష్ణా నాయక్ తదితరులు ఉన్నారు.

# అటవీ హక్కుల భూములకు పట్టాలివ్వాలి



**నెరడిగొండ జులై1(జనంసాక్షి) :** ఆదిలాబాద్ జిల్లాలోని అటవీ ప్రాంతాల్లో తరతరాలుగా సాగుచేస్తు జీవిస్తున్న అనేకమంది గిరిజనులు, ఇతర వ్యవసాయ కుటుంబాలు తమ సొంతంగా సాగుచేస్తున్న భూములపై ఇప్పటికీ యాజమాన్య హక్కులు లేక నానా ఇబ్బందులు పడుతున్నారని జాతీయ మానవ హక్కుల కమిటీ చైర్మన్ బద్దం పురుషోత్తం, వైస్ చైర్మన్ రాథోడ్ సందీప్ అన్నారు.సోమవారం రోజున గతంలో జరిగిన అటవీ హక్కుల సర్వే (ఎఫ్ఆర్ఏ సర్వే)లో చాలామంది రైతుల పేర్లు నమోదు కాకపోవడం వల్ల వారు భూములపై హక్కులను కోల్పోయారని ఇందులో భాగంగా జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లేందుకు జాతీయ మానవ హక్కుల కమిటీ చైర్మన్ బద్దం పురుషోత్తం రెడ్డి వైస్ చైర్మన్ రాథోడ్ సందీప్ రైతులు ఆడే ప్రతిక్ తదితరులు కలెక్టర్ ని కలిసి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ వెంటనే స్పందించి ఐటిడిఏ అధికారులతో చర్చించి, ప్రభుత్వం నుండి ఆదేశాలు వచ్చిన వెంటనే అటవీ హక్కుల సర్వే చేపడతామని హామీ ఇచ్చారు.ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి, భూములపై వాస్తవ సర్వే నిర్వహించి అర్హులైన ప్రతి రైతుకు ఎఫ్ ఆర్ ఏ చట్టం ప్రకారం భూస్వామ్య హక్కుల పట్టాలు వెంటనే ఇవ్వాలని పలువురు రైతులు డిమాండ్ చేస్తున్నారని పేర్కొన్నారు.

# కేటీకే ఓసీ-3 ప్రాజెక్టులో నూతన క్రషర్ బంకర్ ప్రారంభం



**గణపురం, జూన్ 30(జనం సాక్షి):** భూపాలపల్లి ఏరియాలోనికేటీకే ఓసీ-3 ప్రాజెక్టులో ఉత్పత్తి అవసరాల నిమిత్తం నిర్మించిన క్రషర్, కొత్త బంకర్‌ను సోమ వారం భూపాల్ పల్లి ఏరియా జనరల్ మేనేజర్ ఏనుగు రాజేశ్వర్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించారు. జిఎం మాట్లాడుతూఈ క్రష ర్, బంకర్ ల ద్వారా గనుల ఉత్పత్తి, సామర్థ్యం మరింత మెరుగవుతుందని ఆయన అన్నారు. ఉత్పత్తిలో వేగం నాణ్యతకు ఇది తోడుపడుతుందని జిఎం అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓ టు జీఎం శ్రీ కావిందర్, ఓసీ త్రి ప్రాజెక్టు అధికారి శ్రీ బిక్షమయ్య, మేనేజర్లు శ్రీనివాస్ , మధుసూదన్ , ప్రాంతీయ అధికారులు గనుల అధికారులు ఏరియా యూనియన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

జనంసాక్షి www.janamsakshi.org | మంగళవారం 01 జూలై 2025

# పేదల ఇండ్లు కూల్చడానికేనా ఇందిరమ్మ రాజ్యం..?

- హైడ్రా పేరుతో కాంగ్రెస్ రాచరిక పాలన
- 30 ఏళ్ల కాలనీ ప్రజలకు ఇండ్లకు పర్మిషన్ అవసరమా..?
- జెఎంసి బిజెపి ఆధ్వర్యంలో పోరుబాట
- మల్కాజ్‌గిరి పార్లమెంట్ సభ్యుడు ఈటల రాజేందర్



**జవహర్‌నగర్, జూన్ 30 (జనంసాక్షి) :** ఇందిరమ్మ రాజ్యంలో పేదలు సంతోష పడతారు అనుకుంటే పేదల ఇల్లు కూల్చడానికే ఇందిరమ్మ రాజ్యం వచ్చినట్టుందని హైడ్రా పేరుతో తెలంగాణలో అరాచకం ప్రభుత్వం సృష్టిస్తుందని పేదల జోలికి వస్తే ఖబర్దార్ అంటూ తగిన గుణపాఠం చెప్తామని మల్కాజ్గిరి పార్లమెంటు సభ్యుడు ఈటల రాజేందర్ ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. జవహర్ నగర్ లో నివసించే పేద ప్రజలు ఉదయమే నగరానికి బయలుదేరి కూరగాయల అమ్ముతూ సంపన్నుల ఇళ్లల్లో పాచి పనులు చేస్తూ, బట్టల షాపులో పనిచేసుకునే పేదలే నివాసం ఉంటున్నారని, 40, 60 గజాల్లో చిన్నపాటి రేకుల ఇల్లు కట్టుకుందాం అనుకుంటే రెవెన్యూ యంత్రాంగం నేలమట్టం చేయడం దుర్మార్గమని జవహర్ నగర్ కు భారత రాజ్యాంగం వర్తించదా? అంటూ ప్రశ్నించారు. బిజెపి పోరుబాట కార్యక్రమంలో భాగంగా జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని బాలాజీ నగర్ లో ప్రజా సమస్యలపై అంబేద్కర్ ప్రధాన చౌరస్తాలో జవహర్ నగర్ బిజెపి పార్టీ ఈస్ట్ వెస్ట్ అధ్యక్షులు కమల్, జోగారావు ఆధ్వర్యంలో సోమవారం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంపీ ఈటెల రాజేందర్ హాజరై మాట్లాడుతూ డంపింగ్ యార్డ్ తోనే జవహర్ నగర్ లో నివసించే పేదలు దుర్గంధం పీలుస్తూ అనారోగ్యానికి గురవుతుంటే ఇక్కడ పేదలను పట్టించుకునే నాథుడే కరువైపోయారని వాపోయారు. సూరారం, అరుంధతి కాలనీ ,అస్మత్ పేట, జొన్నల బండ బస్తీలలో హైడ్రా వస్తుందని పేదలు బిక్కుబిక్కుమంటూ కన్నీరు కారుస్తుంటే పేదలకు ధైర్యం చెప్పి బుల్డోజర్లకు అడ్డం తిరిగి అండగా నిల్చామని అన్నారు. జవహర్ నగర్ లో కరెంటు మంచినీరు డ్రైనేజీ వంటి మౌలిక వసతులు లేక సతమతమవుతుంటే ప్రభుత్వం ఏం చేస్తుందని దుయ్యబట్టారు. పేదలు కట్టే పన్నులతోనే ప్రభుత్వం అధికారులు బతుకుతున్నారనే విషయం మర్చిపోయారన్నారు. పేదోడికి ఒక న్యాయం సంపన్నుడికి ఒక న్యాయమా? అంటూ ప్రభుత్వాన్ని నిలదీశారు. ప్రభుత్వానికి పేదల ఉసురు ఊరికే పోదని హరిగోసపడుతున్నారని పేదల కన్నీరు చూసిన ప్రభుత్వాలు మనుగడలో ఉన్నట్టు చరిత్ర దాఖలాలో లేవని తెలిపారు. జవహర్ నగర్ లోని ప్రభుత్వ భూములు పేదలకు 60 గజాల్లో ఇండ్లు కట్టించి ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. గిరి ప్రసాద్ నగర్ కాలనీలో గుడిసె వేసుకొని 24 ఏళ్లుగా రోజా ముగ్గురు ఆడపిల్లలతో బతుకుతుంటే పిల్లలు పెద్దయ్యారని ఎంతగానో కలిసి వేసిందన్నారు. ప్రజా సమస్యలపై బిజెపి పోరుబాట ఉద్యమంలో సాగుతుందని భవిష్యత్తులో పేదల జోలికి అధికారులు వస్తే ఊరుకోమని హెచ్చరించారు. అనంతరం పలు సమస్యలపై ప్రజల ఎంపీ ఈటల రాజేందర్ కు వినతి పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు భేతు సుభాష్ రెడ్డి ,ఎన్ వి ఎస్ ఎస్ ప్రభాకర్, బిజెపి మేడ్చల్ జిల్లా అధ్యక్షులు బుద్ధి శ్రీనివాస్ మాజీ, జిల్లా అధ్యక్షుడు విక్రం రెడ్డి ,రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సుదర్శన్ రెడ్డి, శోభరెడ్డి, మేడ్చల్ జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షుడు మహేందర్ యాదవ్, సంతోష్, రాజు, శంకర్, అశోక్, లిఖిత యాదవ్, లక్ష్మీరెడ్డి, అనిల్ గుప్తా, జోగారావు, పండాల మహేశ్వరి గౌడ్, లలిత, చిలుకూరి శ్యామల, తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరూ దైవచింతన అలవర్చుకోవాలి

- చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య



**చేవెళ్ల, జూన్ 30 (జనంసాక్షి) :** ప్రతి ఒక్కరూ దైవచింతన అలవర్చుకోవాలని చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య పేర్కొన్నారు. చేవెళ్ల మున్సిపల్ పట్టణ కేంద్రంలోని చంద్రారెడ్డినగర్ కాలనీలో పోచమ్మ ఆలయం మొదటి వార్షికోత్సవం సందర్భంగా సోమవారం చేవెళ్ల పీఏసీఎస్ చైర్మన్ దేవర సమతవెంకట్ రెడ్డి కుటుంబసభ్యుల ఆధ్వర్యంలో, కాలనీవాసులు ఘనంగా నిర్వహించారు. చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య పాల్గొని ప్రత్యేక పూజలు చేసి, తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం ఎమ్మెల్యే కాలే యాదయ్యను సొసైటీ చైర్మన్ దేవర వెంకట్ రెడ్డి, ఆలయ కమిటీసభ్యులు శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సభ్యులు చింపుల సత్యనారాయణ రెడ్డి, మర్పల్లి కృష్ణా రెడ్డి, మాజీ సర్పంచులు బండారి శైలజాఆగి రెడ్డి, మోహన్ రెడ్డి, భీమయ్య, నర్సింలు, మాజీ ఎంపిటీసీ గుండాల రాములు, పీఏసీఎస్ మాజీ వైస్ చైర్మన్ మల్లేష్, మాజీ ఉపసర్పంచ్ గంగి యాదయ్య, టేకులపల్లి శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల మున్సిపల్ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, నాయకులు గుడుపల్లి పెంటారెడ్డి, మధుసూధన్ గుప్తా, దామోదర్ రెడ్డి, అంజిరెడ్డి, శేఖర్ రెడ్డి, సాత ప్రవీణ్ కుమార్, జుకన్నగారి శ్రీకాంత్ రెడ్డి, వినోద్ గౌడ్, యాదయ్య పాల్గొన్నారు.

## ప్రజావాణి అర్జీలను వేగవంతంగా పరిష్కరించాలి

- జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్



**సూర్యాపేట ప్రతినిధి, జూన్ 30 (జనంసాక్షి) :** పని ప్రదేశాలలో లైంగిక వేధింపుల నివారణ కొరకు కార్యాలయాలలో ఇంటర్నల్ కమిటీ ఏర్పాటు చేయాలని అధికారులకు జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ పవార్ సూచించారు.సోమవారం కలెక్టరేట్ లో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ పి.రాంబాబుతో కలిసి పాల్గొని ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వారం రోజుల్లో జిల్లా,మండల స్థాయి కార్యాలయలాలో ఇంటర్నల్ కమిటీ ఏర్పాటు చేస్తూ వారం రోజుల్లో సంక్షేమ అధికారి కార్యాలయంలో సమర్పించాలని సూచించారు.కమిటీ ఏర్పాటు చేయకపోతే వారిపై చర్యలు తీసుకోవటం జరుగుతుందని తెలిపారు.ప్రజావాణిలో పరిష్కరించిన దరఖాస్తులు మరలా జిల్లా అదనపు కలెక్టర్ ఆధ్వర్యంలో అధికారులతో కలిసి ఏర్పాటైనా కమిటీ ప్రతి శాఖకు సంబందించిన దరఖాస్తులు యాదృచ్ఛికంగా మరలా పరిశీలించి దరఖాస్తులను పరిష్కరించటంలో నాణ్యత పాటిస్తున్నారా లేదా అని పరిశీలిస్తామని అర్జీలు పరిష్కరించటంలో ఏమైనా తప్పులు దొర్లితే చర్యలు తీసుకుంటామని అన్నారు.జిల్లా అధికారులు తమ శాఖ పరిధిలో ఉన్న లోకాయుక్త, మానవ హక్కుల కమిషన్, ఎస్సి, ఎస్టి కమిషన్, స్థానిక కోర్ట్ కేసులకు సంబందించి కౌంటర్ ఫైల్, కేసు క్లోజ్, కోర్ట్ ఆర్డర్ అమలు లాంటివి తప్పనిసరిగా అమలు చేయాలని సూచించారు. జిల్లా అధికారులు తమ పరిధిలోని సిబ్బందికి పరిపాలనకు సంబంధించి పలు సూచనలు చేస్తూ పనులు త్వరగా అయ్యేలా చూడాలని తెలిపారు.ప్రజావాణి దరఖాస్తులలో భూ సమస్యలపై 62, ఎంపిడిఓలకు 26, మున్సిపల్ కమిషనర్లకు 5, డిపిఓకు 4, డిఇఓ 4,ఇతర శాఖలకు సంబందించినవి 22, మొత్తం 123 దరఖాస్తులు వచ్చాయని, వాటిని పరిష్కరించేందుకు సంబందిత అధికారులకి పంపించటం జరుగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో డిఆర్డిఏ పిడి వివి అప్పారావు, డిపిఓ యాదగిరి, వ్యవసాయ అధికారి శ్రీధర్ రెడ్డి, డిఈఓ అశోక్, సిపిఓ కిషన్, సంక్షేమ అధికారులు దయానంద రాణి, శంకర్, శ్రీనివాస నాయక్, జగదీశ్వర్ రెడ్డి, అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాసమస్యలను తప్పనిసరిగా పరిష్కరించాలి

- ప్రభుత్వ పథకాలు పక్కాగా అమలు
- అధికారుల నిరంతర పర్యవేక్షణ
- జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్



**మెదక్ జిల్లా బ్యూరో, జూన్ 30 (జనం సాక్షి) :** ప్రజా సమస్యలు తప్పనిసరిగా పరిష్కరించాలని, ప్రభుత్వ పథకాలు పక్కగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. సోమవారం గ్రీవెన్స్ కార్యక్రమాన్ని పురస్కరించుకొని అదనపు కలెక్టర్ నగేష్ , జడ్పీ సీఈఓ ఎల్లయ్య, డి ఆర్ డి ఓ పి డి శ్రీనివాసరావు లతో కలిసి కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లా ప్రజల నుండి కలెక్టర్ వినతులను స్వీకరించారు. స్వీకరించిన దరఖాస్తులను సంబంధిత శాఖ వారికి అందజేస్తూ త్వరితగతిన ప్రజల సమస్యలను క్షేత్రస్థాయిలో విచారణ జరిపించి పరిష్కరించాలన్నారు. ఈనాటి గ్రీవన్స్ కి 97 దరఖాస్తు లు రాగా.... భూ సమస్యలు.33, ఇందిరమ్మ ఇండ్ల కొరకు. 20, పింఛన్ కొరకు -05, ఇతర సమస్యలు 39 సమస్యలు ఉన్నాయి. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా కృషి చేయాలన్నారు,అభివృద్ధి సంక్షేమ పథకాలు ప్రజలకు అందించే విధంగా పనిచేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## సర్కారు బడులపై శ్రద్ధ పెట్టండి

- నిజామాబాద్ జిల్లా కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి



**నిజామాబాద్ జిల్లా బ్యూరో, జూన్ 30 (జనం సాక్షి) :** నిజామాబాద్ జిల్లాలో ఉన్న అన్ని ప్రభుత్వ పాఠశాలపై విద్యాశాఖ అధికారులు దృష్టి పెట్టాల్సిన అవసరం ఏర్పడిందని, ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల సంఖ్య పెరిగేలా చర్యలు చేపట్టాలని నిజామాబాద్ జిల్లా కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయ సముదాయంలో సోమవారం జిల్లాలోని అన్ని మండలాల విద్యాశాఖ అధికారులతో ఆయన సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో డ్రాప్ అవుట్లు లేకుండా చర్యలు చేపట్టాలని, డ్రాప్ అవుట్లు ఎక్కువగా ఉన్న ప్రభుత్వ పాఠశాలలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో వారం రోజుల పాటు విద్యార్థుల ప్రవేశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అన్నారు. ప్రభుత్వ బడులలో మెరుగుపడిన మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని వివరించారు. ఉత్తీర్ణత, నాణ్యమైన విద్యా బోధన, ఉచిత యూనిఫామ్, టెక్స్టుబుక్స్ సమకూరుస్తున్న విషయాలపై విద్యార్థుల తల్లిదండ్రులకు వివరించాలన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన మరమ్మతు పనులను తొందరగా పూర్తి చేయించాలని అయన ఆదేశించారు. ఇంకా అవసరమైన బడుల్లో వంటశాల నిర్మాణాలకు ప్రతిపాదనలు తయారు చేసి పంపాలన్నారు. పదో తరగతిలో ఉత్తీర్ణులైన ప్రతి విద్యార్థి కళాశాలలో చేరేలా పర్యవేక్షించాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ అంకిత్, ట్రైయినీ కలెక్టర్ కరోలిన్ చింగ్తియాన్మావి, డీఈవో అశోక్, ఎంఈఓలు అధికారులు పాల్గొన్నారు.

## ముష్కి చెరువులో మురుగు నీటి సమస్యపై ఎమ్మెల్యేకు వినతిపత్రం



**రాజేంద్రనగర్, జూన్ 30 (జనం సాక్షి) :** మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని ముష్కి చెరువులో మురుగునీరు చేరకుండా అధికారుల చర్యలు తీసుకోవాలని మై హోమ్ అవుతార్, హాల్ మార్క్ విసినియా కమ్యూనిటీ సభ్యులు ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్‌కు వినతిపత్రం అందజేశారు. సోమవారం మాజీ కౌన్సిలర్ రామకృష్ణారెడ్డి, నాయకులు శ్రవణ్‌ల ఆధ్వర్యంలో ఎమ్మెల్యేని కలిసి ముష్కి చెరువులో మురుగునీరు చేరడం ద్వారా సంబంధిత కాలనీవాసులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై నిషితంగా స్పందించిన ఎమ్మెల్యే మణికొండ మున్సిపాలిటీ హెచ్ఎండిఏ, ఇరిగేషన్ అధికారుల దృష్టికి తీసుకువెళ్తానని హామీ ఇచ్చారు. అలాగే వెంటనే కమిషనర్ కు ఫోన్ ద్వారా ఇట్టి సమస్యను పరిష్కరించాలని ఆదేశించడంతో కమ్యూనిటీ వాసులు సంతోషం వ్యక్తం చేశారు.

## జూన్ నెలలో 105 శాతం ఉత్పత్తి సాధించిన మణుగూరు ఏరియా

- జూన్ నెలలో 9 లక్షల 86 వేల 500 టన్నుల బొగ్గు ఉత్పత్తి
- వార్షిక లక్ష్యాన్ని చేరుకునేలా ఉద్యోగులు పని చేయాలి
- అత్యధిక వర్షపాతం వల్ల తగ్గిన బొగ్గు ఉత్పత్తి..




**మణుగూరు, జూన్ 30 (జనంసాక్షి) :** వర్షాల కారణంగా ఓ బి వెలికి తీతలో ఆటంకం కలిగిందని మణుగూరు ప్రధాన అధికారి దుర్గం రామచందర్ పేర్కొన్నారు. సోమవారం జీఎం కార్యాలయ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ.. మే, జూన్ నెలలో వర్షపాతం ఎక్కువగా ఉండటం వల్ల ఓబీ బొగ్గు ఉత్పత్తికి అంతరాయం కలిగిందన్నారు. ఉత్పత్తి ఎక్కువగా వచ్చే మే నెలలో వర్షాలు పడటం వల్ల బొగ్గు తో పాటు ఓబీ తగ్గిందని అన్నారు. జూన్ నెలలో మణుగూరు ఏరియాలో బొగ్గు ఉత్పత్తి లక్ష్యం 9 లక్షల 86 వేల 500 టన్నులకు గాను 10 లక్షల 36 వేల 101 టన్నుల బొగ్గు ఉత్పత్తి అనగా 105 శాతం ఉత్పత్తి సాధించింది. ఏప్రిల్ నుండి జూన్ వరకు ప్రోగ్రెస్సివ్ బొగ్గు ఉత్పత్తి 29 లక్షల 01 వేల టన్నుల లక్ష్యానికి గాను 32 లక్షల 99 వేల 239 టన్నులు ఉత్పత్తి అనగా 114 శాతం సాధించడం జరిగింది. జూన్ నెలలో 9 లక్షల 93 టన్నుల బొగ్గు రవాణా అలాగే ఏప్రిల్ నుండి జూన్ వరకు ప్రోగ్రెస్సివ్ గా 33 లక్షల 04 వేల 509 టన్నులు రవాణా చేయడం జరిగిందన్నారు. జూన్ నెలలో ఓవర్ బర్డెన్ డిపార్ట్ మెంటల్ గా 13 లక్షల క్యూబిక్ మీటర్ల లక్ష్యానికి గాను 69 శాతం తో 9 లక్షల 2 వేల క్యూబిక్ మీటర్లు తీయటం జరిగిందనీ తెలిపారు.పదవి విరమణ,మెడికల్ ఉద్యోగులకు, పెన్షన్, గ్రాట్యుయిటి,నూతన చేరికలు, మెరిట్ స్కాలర్షిప్ తదితర అంశాలకు సంబంధించిన చెల్లింపులు చేయడం జరిగిందన్నారు. బొగ్గు ఉత్పత్తికి ఆటంకం కలగకుండా తగిన చర్యలు తీసుకుంటూ వార్షిక ఉత్పత్తి లక్ష్యాన్ని చేరుకునేలా పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓటు జి ఎం శ్రీనివాస చారి, డి జి ఎం పర్సనల్ ఎస్ రమేష్ , డీజీఎం(ఐ ఈ) కె వెంకటరావు, ఏరియా సెక్యూరిటీ అధికారి కె శ్రీనివాస్, సీనియర్ పర్సనల్ అధికారి సింగు శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

## ఫిర్యాదులపై వెంటనే చట్టపరంగా చర్యలు తీసుకోవాలి

- సూర్యాపేట జిల్లా ఎస్పీ నరసింహా



**సూర్యాపేట ప్రతినిధి, జూన్ 30 (జనంసాక్షి) :** శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా ప్రజా సమస్యల పరిష్కరిస్తూ బాధితులకు అండగా ఉంటూ ఫిర్యాదులపై వెంటనే చట్టపరంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా ఎస్పీ కె.నరసింహ అన్నారు.సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రజావాణి సందర్భంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులతో మాట్లాడి వారి అర్జిలను పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిర్యాదుదారులకు భరోసా కల్పించాలని అన్నారు.ప్రతి అంశాన్ని చట్ట పరిధిలో పరిష్కరించడంలో, బాధితులకు న్యాయం చేయడంలో వేగంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

## ఎస్‌హెచ్‌జీ సభ్యులకు బీమాతో ఆర్థిక భరోసా

- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా



**ముస్తాబాద్, జూన్ 30 (జనం సాక్షి) :** స్వయం సహాయక సంఘాల (ఎస్‌హెచ్‌జీ) సభ్యులకు రాష్ట్ర ప్రభుత్వం బీమా కల్పిస్తూ ఆర్థికంగా భరోసా కల్పిస్తుందని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా తెలిపారు. స్వయం సహాయక సంఘాలు తీసుకున్న రుణాలకు బీమా, సభ్యులకు ప్రమాద బీమా చెక్కులను జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, అధికారులతో కలిసి సోమవారం పంపిణీ చేశారు. ముస్తాబాద్ మండలంలో 14 మందికి రూ. 14,96,457, విలువైన చెక్కులు ఆయా స్వయం సహాయక సంఘాల బాద్యులకు అందజేశారు. ఇద్దరికి ప్రమాద బీమా పంపిణీ.అలాగే ముస్తాబాద్ మండలంలోని స్వయం సహాయక సంఘాలకు చెందిన ఇద్దరు సభ్యులు ప్రమాదవశాత్తూ మరణించగా, వారికి నామిని లకు రూ. 10 లక్షల చొప్పున మొత్తం రూ. 20 లక్షల విలువైన చెక్కులు కలెక్టర్ సందీప్ కుమార్ ఝా పంపిణీ చేశారు.కార్యక్రమంలో సిరిసిల్ల, వేములవాడ ఆర్డీవోలు వెంకటేశ్వర్లు, రాధాభాయ్, డీఆర్డీఓ శేషాద్రి, జడ్పీ సీఈవో వినోద్ కుమార్, జిల్లా అధికారులు కూర సావిత్రి, ఏపిఎం దేవరాజు ,తదితరులు పాల్గొన్నారు.

## నిజాముద్దీన్ కాంగ్రెస్ పార్టీకీ అందించిన సేవలు చిరస్మరణీయం



**హుజూర్‌నగర్ రూరల్, జూన్ 30 (జనం సాక్షి) :** మండలంలోని లింగగిరి గ్రామంలో ఆదివారం మృతి చెందిన సీనియర్ కాంగ్రెస్ నేత నిజాముద్దీన్ లేని లోటు పూడ్చలేనిదని రాష్ట్ర నీటి పారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ అనుబంధ మైనార్టీ సెల్ ఉమ్మడి నల్లగొండ జిల్లా అధ్యక్షులుగా,లింగగిరి గ్రామ సర్పంచ్ గా, జడ్.పి టి సి, గా ఆయన అందించిన సేవలు అజరామరమని ఆయన కొనియాడారు. కాంగ్రెస్ పార్టీకీ ఆయన అందించిన సేవలు మరువలేనివని ఆయన అన్నారు. ఆదివారం ఉదయం గుండెపోటుతో నిజాముద్దీన్ మృత్యు వాత పడ్డారని తెలిసిన వెంటనే తన అధికారిక కార్యక్రమాలు రద్దు చేసుకుని, ఆదివారం రాత్రి 10 గంటల సమయంలో హుటాహుటిన నిజాముద్దీన్ స్వస్థలం లింగగిరికి చేరుకున్నారు.నిజాం కుటుంబ సభ్యులను పరామర్శించిన అనంతరం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ కుటుంబానికి చెందిన నిజాముద్దీన్ కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ఆ భగవంతున్ని ప్రార్థిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. చివరి నిమిషం వరకు కాంగ్రెస్ పార్టీని ప్రాణప్రదంగా భావించిన నేత నిజాముద్దీన్ అని ఆయన చెప్పారు. వర్తమాన రాజకీయాలలో కాంగ్రెస్ పార్టీ భవిష్యత్ తరాలకు నిజాముద్దీన్ స్ఫూర్తి దాయకంగా నిలిచి పోతారని ఆయన ఉద్బోధించారు.

## ఎప్పటికప్పుడు సమస్యలు పరిష్కారం చేయాలి



**కరీంనగర్ జిల్లా బ్యూరో, జూన్ 30 (జనంసాక్షి) :** గాంధీ భవన్ ప్రజాపాలనలో భాగంగా ప్రతి రోజు ఇద్దరు కార్పోరేషన్ చైర్మన్లు గాంధీభవన్ లో కూర్చోని దరఖాస్తులు స్వీకరించి పరిష్కారానికి కృషి చేసే విధంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచన మేరకు పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ఆదేశాల ప్రకారం గాంధీ భవన్ నుండి గత ఇరవైరోజుల క్రితం షెడ్యూల్ విడుదల చేయడం జరిగిందని అందులో భాగంగా సోమవారం సాంస్కృతిక సారథి చైర్మన్ వెన్నెల పాల్గొనడం జరిగిందని సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి తెలిపారు. అనంతరం మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ ముప్పై వరకు వివిధ సమస్యలతో వచ్చిన దరఖాస్తులు స్వీకరించి అక్కడికక్కడే కొన్ని సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కరించడం జరిగిందని మిగితా దరఖాస్తులు సంభందిత శాఖలకు పరిష్కారానికి పంపడం జరుగుతుందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత అభివృద్ధి సంక్షేమం ఒకవైపు కొనసాగుతూనే ప్రజల యొక్క వివిధ సమస్యలపై నాయకులు ఎక్కడికక్కడ పరిష్కరించడానికి కృషి చేయడం జరుగుతుందని అన్నారు. ఇంత మంచి కార్యక్రమంలో భాగస్వాములమైనందుకు సంతోషంగా ఉందని నరేందర్ రెడ్డి, వెన్నెల పేర్కొన్నారు.




# ఫార్మా రంగంలో రెండో పెద్ద కంపెనీగా టొరెంట్

- టొరెంట్ ఫార్మా చేతికి జేబీ కెమ్
- ప్రమోటర్ల వాటా 49.19 శాతం కొనుగోలు
- సాధారణ వాటాదారుల నుంచి 26 శాతం
- దేశీయంగా ఔషధ రంగంలో మరో భారీ డీల్

**జనంసాక్షి:**ప్రయివేట్ రంగ దిగ్గజం టొరెంట్ ఫార్మాస్యూటికల్స్.. దేశీ కంపెనీ జేబీ కెమికల్స్ అండ్ ఫార్మాస్యూటికల్స్‌ను కొనుగోలు చేస్తోంది. తద్వారా దేశీ ఫార్మా రంగంలో రెండో పెద్ద కంపెనీగా అవతరించనుంది. జేబీ కెమ్ ప్రమోటర్ల నుంచి 46.39 శాతం వాటా కొనుగోలుకి తప్పనిసరి ఒప్పందాన్ని కుదుర్చుకున్నట్లు టొరెంట్ ఫార్మా పేర్కొంది. ఇందుకు మొత్తం రూ.19,500 కోట్లు వెచ్చించనుంది. ఈ డీల్‌లో భాగంగా తొలుత ప్రమోటర్, పీఈ దిగ్గజం కేకేఆర్ నుంచి 46.39% వాటా కొనుగోలు చేయనుంది. ఇందుకు రూ.11,917 కోట్లు చెల్లించనుంది. అంతేకాకుండా జేబీ కెమ్‌లో కొంత మంది ఉద్యోగుల నుంచి షేరుకి రూ.1,600 ధరలో 2.8 శాతం వాటాను సైతం సొంతం చేసుకోనుంది. ఇందుకు రూ. 719 కోట్లు వెచ్చిస్తుంది. తద్వారా 49.19% వాటా చేజిక్కించుకోనుంది. ఆపై నిబంధనల ప్రకారం సాధారణ వాటాదారులకు షేరుకి రూ. 1,639 ధరలో 26% వాటా కొనుగోలుకి ఓపెన్ ఆఫర్ ప్రకటించనుంది. ఇందుకు దాదాపు రూ. 6,843 కోట్లు కేటాయించనుంది. శుక్రవారం ముగింపు ధర రూ.1,799తో పోలిస్తే ఓపెన్ ఆఫర్ ధర 9% తక్కువకావడం గమనార్హం!దేశీ ఫార్మా రంగంలో టొరెంట్ పార్మా, జేబీ కెమికల్స్ డీల్ రెండో పెద్ద లావాదేవీగా నమోదుకానుంది. ఇంతక్రితం 2015లో సన్ ఫార్మాస్యూటికల్ ఇండస్ట్రీస్ మరో దేశీ దిగ్గజం ర్యాన్‌బ్యాక్సీ ల్యాబొరేటరీస్‌ను కొనుగోలు చేసిన డీల్ అతిపెద్ద లావాదేవీగా నిలుస్తోంది.100: 51 నిష్పత్తిలో: నియంత్రిత వాటా కొనుగోలు తదుపరి జేబీ కెమికల్స్‌ను టొరెంట్ ఫార్మాస్యూటికల్స్ విలీనం చేసుకోనుంది. ఇందుకు 100: 51 విలీన నిష్పత్తిని సైతం టొరెంట్ ఫార్మా ప్రకటించింది. జేబీ కెమ్ వాటాదారుల వద్దగల ప్రతీ 100 షేర్లకుగాను 51 టొరెంట్ ఫార్మా షేర్లను కేటాయించనుంది. తాజా డీల్ కారణంగా క్రానిక్ విభాగంలో సుప్రసిద్ధ జేబీ కేమ్ బ్రాండ్లను టొరెంట్ పొందగలుగుతుంది.




# వరుస లాభాలకు బ్రేక్..

## మళ్లీ 25,500 దిగువకు నిఫ్టీ

ముంబయి: దేశీయ స్టాక్ మార్కెట్ సూచీల వరుస లాభాలకు బ్రేక్ పడింది. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలు, విదేశీ మదుపర్ల కొనుగోళ్ల మద్దతు కొనసాగుతున్నప్పటికీ..ఫైనాన్షియల్, ఆటో మొబైల్ స్టాక్స్‌లో అమ్మకాలు సూచీలపై ప్రభావం చూపాయి. ముఖ్యంగా హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐసీఐసీఐ, రిలయన్స్ షేర్లు సూచీలను కిందకు లాగాయి. దీంతో నాలుగు రోజుల వరుస లాభాలకు బ్రేక్ పడింది. సెన్సెక్స్ ఓ దశలో 500 పాయింట్లకు పైగా నష్టపోగా.. నిఫ్టీ 25,550 దిగువకు చేరింది.సెన్సెక్స్ ఉదయం 84,027.33 పాయింట్ల వద్ద (క్రితం




ముగింపు 84,058.90) ఫ్లాట్‌గా ప్రారంభమైంది. రోజంతా నష్టాల్లోనే కదలాడింది. ఇంట్రాడేలో 83,482.13– 84,099.53 మధ్య చలించిన సూచీ.. చివరికి 452.44 పాయింట్ల నష్టంతో 83,606.46 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 120.75 పాయింట్ల నష్టంతో 25,517.05 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 85.74గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో యాక్సిస్ బ్యాంక్, కోటక్ మహీంద్రా బ్యాంక్, మారుతీ సుజుకీ, అల్ట్రాటెక్ సిమెంట్, బజాజ్ ఫైనాన్స్ షేర్లు ప్రధానంగా నష్టపోయాయి. ట్రెంట్, ఎస్‌బీఐ, బీఈఎల్, టైటాన్, బజాజ్ ఫిన్‌సర్వ్ షేర్లు లాభపడ్డాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ 67.58 డాలర్ల వద్ద ట్రేడవుతుండగా.. బంగారం ఔన్సు 3299 డాలర్ల వద్ద కొనసాగుతోంది.



## దిగొస్తున్న బంగారం ధరలు..

ఇటీవల కాలంలో స్థిర ఆదాయం సమకూర్చే కమోడిటీ మార్కెట్లపై పెట్టుబడిదారులు మొగ్గు చూపుతున్నారు. అందులో భాగంగా బంగారం ధరల్లో మార్పులు వస్తున్నాయని నిపుణులు చెబుతున్నారు.గత కొన్ని రోజులుగా భారీగా పెరిగిన బంగారం ధర క్రమంగా తగ్గుముఖ పడుతోంది. గరిష్ఠాల నుంచి గత వారం రోజులుగా బంగారం ధరలో క్షీణత కనిపిస్తోంది. సోమవారం కూడా పుత్తడి ధరలు తగ్గాయి. దాంతో ఈ ధరలు ఇంకెంత పడుతాయోనని బంగారం ప్రియులు వేచి చేస్తున్నారు. దేశంలోని ప్రధాన నగరాల్లో ఈరోజు బంగారం ధరలు ఎలా ఉన్నాయో కింద తెలుసుకుందాం.




## చైనా షావోమీ 'ఎస్‌యూ 7' కార్డు రికార్డు

### లాంచ్ అయిన 3 నిమిషాల్లోనే 2 లక్షల బుకింగ్స్

**జనంసాక్షి:**చైనా ఎలక్ట్రిక్ కార్ల తయారీ కంపెనీ షావోమీ ఎస్‌యూ 7 మోడల్ తర్వాత తన రెండో ప్రోడక్ట్ వైయూ 7ను చైనా మార్కెట్‌లో ఇటీవల లాంచ్ చేసింది. దీన్ని ఆవిష్కరించిన కొద్ది గంటల్లోనే రికార్డ్ స్థాయిలో బుకింగ్స్ వచ్చాయని కొన్ని సంస్థలు పేర్కొన్నాయి.కేవలం లాంచ్ అయిన 3 నిమిషాల్లోనే 2,00,000కు పైగా ఆర్డర్లు వచ్చా యని తెలిపాయి. దీని ధర వేరియంట్‌ను అనుసరించి సుమారు రూ.30.22 లక్షల(ఎక్స్‌షోరూమ్) నుంచి ప్రారం భం అవుతుందని కంపెనీ చెప్పింది.రాయిటర్స్ కథనం ప్రకారం.. ఈ కారు లాంచ్ అయిన 3 నిమిషాల్లోనే 2,00, 000కు పైగా



ఆర్డర్లు, 18 గంటల్లో 2.40 లక్షల ఆర్డర్లు, 24 గంటల్లో 2.89 లక్షల ఆర్డర్లను లాక్ చేసినట్లు తెలిపింది. ప్రస్తుతం చైనాలోని మొత్తం 351 షావోమీ ఈవీ రిటైల్ స్టోర్లలో వైయూ7 బుకింగ్స్ జరుగుతున్నాయి. అయితే షావోమీ ఇప్పటి వరకు ఎన్ని ఆర్డర్లు పొందిందో మాత్రం అధికారికంగా వెల్లడించలేదు.
ఫీచర్లు ఇవే..
ఈ వైయూ7 మోడల్‌లో 320 హెచ్‌పీ సామర్థ్యం కలిగిన మోటార్ ఉన్నట్లు కంపెనీ తెలిపింది. 528 ఎన్ఎం టార్క్‌తో గంటకు 240 కిలోమీటర్లు టాప్ స్పీడ్‌తో ఈ వేరియండ్‌ను లాంచ్ చేసినట్లు చెప్పింది.0–100 కిమీ/గంట వేగాన్ని 5.9 సెకన్లలోనే అందుకుంటుందని పేర్కొంది. ఒకసారి బ్యాటరీ ఛార్జ్ చేస్తే 835 కిలోమీటర్ల దూరం ప్రయాణించవచ్చని చెప్పింది.21 నిమిషాల్లో 10–80 శాతం ఛార్జ్ అవుతుందని పేర్కొంది.

## 'మెట్రో నగరాల్లో రియల్టీ మార్కెట్ ఓ ట్రాప్'



**జనంసాక్షి:**దేశంలోని మెట్రో నగరాల్లో రియల్టీ మార్కెట్‌ను ఉద్దేశిస్తూ ప్రముఖ ఫైనాన్షియల్ ఎడ్యుకేటర్, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్ అక్షత్ శ్రీవాస్తవ తాను గమనించిన అత్యంత అవినీతి రంగాల్లో రియల్‌ఎస్టేట్ మార్కెట్ ఒకటని చెప్పారు.ఈ రంగం నల్లధనంతో కుదేలైందని ఘాటు విమర్శలు చేశారు. ముఖ్యంగా ముంబయి, ఢిల్లీ, బెంగళూరు వంటి మెట్రో నగరాల్లో వాస్తవ గృహ డిమాండ్ ద్వారా కాకుండా అక్రమ పెట్టుబడి ప్రవాహాల వల్ల పట్టణ ప్రాపర్టీ ధరలు భారీగా పెరిగాయని శ్రీవాస్తవ పేర్కొన్నారు. సంపన్న పెట్టుబడిదారులు రియల్ ఎస్టేట్‌ను ఆసరాగా చేసుకొని పన్ను చెల్లించని డబ్బును నిల్వ చేసి కృత్రిమంగా ధరలు పెంచుతున్నట్లు తెలిపారు. సాధారణ ప్రజలను ఉద్దేశించి 'మీరు వాస్తవంగా రియల్టీ పెరుగుదలను పరిగణించి ఆస్తులు కొనుగోలు చేయడం లేదు. రిగ్గింగ్ గేమ్‌లో వాటిని కొంటున్నారు' అని అన్నారు. తన వాదనను మరింత సమర్థించేలా ముంబయిలో 20 శాతం రియల్ ఎస్టేట్ మార్కెట్‌లో తొమ్మిది కుటుంబాలదే పైచేయని తెలిపే డేటాను ఎత్తి చూపారు. స్థిరాస్తి ధరలు ఆకాశాన్నంటుతున్నప్పటికీ మెట్రో నగరాల్లో అద్దె రాబడులు మాత్రం 2–3% వరకు ఉంటున్నాయని చెప్పారు. ఇది రియల్ ఎస్టేట్‌ను ఉత్పాదక ఆస్తిగా కాకుండా, అనుమానాస్పద ఆర్థిక స్థితిలోని నెట్టివేస్తుందని తెలిపారు.

## ఐఓసీని వెనక్కి నెట్టి రిలయన్స్ దేశంలోనే నం.1..?

### నయారా ఎనర్జీలో 49.13 శాతం వాటాపై కన్ను

**జనంసాక్షి:**డైవర్సిఫైడ్ దేశీ దిగ్గజం రిలయన్స్ ఇండస్ట్రీస్.. రష్యా చమురు దిగ్గజం పీజేఎస్‌సీ రాస్‌నెఫ్ట్ ఆయిల్ కంపెనీ మధ్య డీల్ కుదరనున్నట్లు తెలుస్తోంది. సంబంధిత వర్గాల సమాచారం ప్రకారం రాస్‌నెఫ్ట్ దేశీ యూనిట్ నయారా ఎనర్జీలో 49.13 శాతం వాటాను రిలయన్స్‌కు విక్రయించనుంది. దేశీయంగా నయారా ఎనర్జీ 20 మిలియన్ టన్నుల వార్షిక సామర్థ్యంగల చమురు రిఫైనరీతోపాటు.. 6,750 పెట్రోల్ పంపులను నిర్వహిస్తోంది. నయారా కొనుగోలుకి రాస్‌నెఫ్ట్‌తో రిలయన్స్ ప్రాథమిక చర్చలు నిర్వహిస్తున్నట్లు తెలుస్తోంది.ఈ కొనుగోలు పూర్తయితే చమురు రంగ పీఎస్‌యూ దిగ్గజం ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్(ఐఓసీ)ను వెనక్కి నెట్టి అతిపెద్ద కంపెనీగా నిలిచే వీలుంది. అటు చమురు శుద్ధిసహా ఇటు పెట్రోల్ బంకుల నిర్వహణలో నంబర్ వన్ ర్యాంకును పొందనుంది. అయితే తొలి దశ చర్చలు మాత్రమే జరుగుతున్న నేపథ్యంలో డీల్‌పై అంచనాలకు రాలేమని సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. ఈ అంశంపై రెండు సంస్థల నుంచి తగిన సమాచారం లభించలేనట్లు తెలియజేశాయి. 2017లో రాస్‌నెఫ్ట్.. 12.9 బిలియన్ డాలర్లకు ఎస్సార్ ఆయిల్‌ను కొనుగోలు చేసింది.

# అఫ్గాన్లు వెంటనే వెళ్లిపోండి

## దేశంలో అక్రమంగా నివసిస్తున్న వారికి ఇరాన్ డెడ్‌లైన్..

తమ దేశంలో అక్రమంగా నివసిస్తున్న అఫ్గానీయులపై పాకిస్థాన్ చర్యలు తీసుకుంటుండగా.. ఇరాన్ సైతం కొరడా ఝుళిపిస్తోంది.జులై 6లోగా స్వదేశానికి వెళ్లిపోవాలన్న టెహ్రాన్ ఆదేశాలతో.. లక్షలాది మంది అఫ్గానీయులు మాతృభూమి బాటపట్టారు. ఈ ఏడాదిలో ఇప్పటివరకు 6.91 లక్షల మంది వెనక్కి వెళ్లినట్లు అంతర్జాతీయ వలసల సంస్థ (ఐవోఎం) తెలిపింది. ఒక్క జూన్‌లోనే 28వ తేదీనాటికి 2.30 లక్షల మంది ఇరాన్‌ను వీడినట్లు వెల్లడించింది.టెహ్రాన్ విధించిన డెడ్‌లైన్ సమీపిస్తుండటంతో ఇటీవలి కాలంలో పెద్దసంఖ్యలో అఫ్గానీయులు స్వదేశానికి చేరుకుంటున్నట్లు ఐవోఎం ప్రతినిధి తెలిపారు. "జూన్ 21–28 మధ్యకాలంలో 1.31 లక్షల మంది తరలివెళ్లారు. ఆ వారం చివర్లో రోజూ 30 వేలమందికిపైగా సరిహద్దు దాటారు. రానున్న రోజుల్లో ఈ సంఖ్య మరింత పెరుగుతుందని భావిస్తున్నాం. ఈ ఏడాదిలో ఇప్పటివరకు 6.91 లక్షల మందిని ఇరాన్ సాగనంపగా.. వారిలో 70 శాతానికిపైగా బహిష్కరణకు గురైనవారే" అని వెల్లడించారు.' 'ప్రాంతీయ అస్థిరత, ఇజ్రాయెల్– ఇరాన్ వివాదం పరిణామాలు, టెహ్రాన్ విధానాల్లో మార్పుల వంటివి ఇటీవల కాలంలో పెద్దఎత్తున అఫ్గానీయుల బహిష్కరణకు కారణమయ్యాయి" అని అఫ్గానిస్థాన్‌లోని ఐరాస మిషన్ ఓ ప్రకటనలో పేర్కొంది. ఇప్పటికే దుర్బ ల స్థితిలో ఉన్న అఫ్గాన్ మానవతా, అభివృద్ధి కార్యక్ర మాలపై ఇది ప్రభావం చూపుతోందని తెలిపింది. మరో వైపు.. నిధుల కోత కారణంగా శరణార్థులకు సాయం అందించలేని పరిస్థితి ఉందని ఐవోఎం చెప్పింది.



## 'సార్క్'కు పోటీగా చైనా–పాక్ కొత్త గ్రూప్?

**జనంసాక్షి:**చైనా–పాకిస్థాన్ కలిసి దక్షిణాసియా దేశాలతో ఓ సరికొత్త గ్రూప్‌ను ఏర్పాటుచేసేందుకు ప్రయత్నిస్తున్నాయి. ముఖ్యంగా సార్క్ (సౌత్ ఏషియన్ అసోసియేషన్ ఫర్ రీజనల్ కోపరేషన్)కు పోటీగా దీనిని తీసుకురానున్నట్లు తెలుస్తోంది. ఈమేరకు దౌత్యవేత్తలను ఉటంకిస్తూ పాక్ పత్రిక ది ఎక్స్‌ప్రెస్ ట్రిబ్యూన్ కథనం వెలువరించినట్లు పీటీఐ పేర్కొంది. ఇప్పటికే పాక్–చైనా మధ్య ఈ అంశంపై చర్చలు ముందుకెళ్లాయని వెల్లడించింది. ఈ సరికొత్త సంస్థ సార్క్ స్థానాన్ని భర్తీ చేస్తుందని పాక్ పత్రిక పేర్కొంది. ప్రస్తుతం సార్క్‌లో భారత్, అఫ్గానిస్థాన్, పాక్, బంగ్లాదేశ్, భూటాన్, మాల్దీవులు, నేపాల్, శ్రీలంక సభ్యదేశాలు.ఈ కొత్త కూటమి ఏర్పాటులో భాగంగానే ఇటీవల కున్మిన్‌లో చైనా, పాకిస్థాన్, బంగ్లాదేశ్ ప్రతినిధులు చర్చలు జరిపారు. సార్క్‌లోని ఇతర దేశాలను కూడా కొత్త కూటమిలోకి ఆహ్వానించడాన్ని లక్ష్యంగా పెట్టుకొన్నారు. మరోవైపు ఈ ప్రచారాన్ని బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వం తోసిపుచ్చింది. అది రాజకీయ సమావేశం కాదని.. కొత్త అలయన్స్ ఏమీ ఏర్పడటం లేదని వెల్లడించింది. "మేము ఏ కొత్త అలయన్స్ ఏర్పాటుచేయడం లేదు" అని బంగ్లాదేశ్ విదేశాంగశాఖ సలహాదారు ఎం.తౌఫిద్ హొస్సైన్ అన్నారు.



## రైల్వే ప్రయాణికులకు ఊరట!

### టికెట్ క్యాన్సిలేషన్ ఛార్జీల తగ్గింపు యోచన!

**జనంసాక్షి:**రైల్వే టికెట్ క్యాన్సిలేషన్ ఛార్జీల విషయంలో ప్రయాణికులకు ఊరట కలగనుంది. వెయిటింగ్ లిస్ట్ టికెట్ కన్ఫర్మ్ కానప్పుడు లేదా క్యాన్సిల్ చేసినప్పుడు ప్రయాణికులకు ఛార్జీలను రీఫండ్ చేసేటప్పుడు కోత విధించే 'క్లరికేజ్' (క్లరికల్ ఛార్జీలు)ను తగ్గించడం లేదా మాఫీ చేసే అవకాశాన్ని రైల్వే శాఖ పరిశీలిస్తోంది.ప్రస్తుతం రిజర్వ్‌డ్ ఏసీ, నాన్ ఏసీ టికెట్లకు రూ.60, అన్‌రిజర్వ్‌డ్ సెకండ్ క్లాస్ టికెట్లకు రూ.30 వాటిని క్యాన్సిల్ చేసుకున్నప్పుడు క్లరికల్ ఛార్జీల కింద మినిహాయించుకుని మిగిలిన మొత్తం రీఫండ్ చేస్తున్నారు. ఐఆర్‌సీటీసీ వెబ్సైట్ ద్వారా క్యాన్సిల్ చేసిన టికెట్లతో సహా అన్ని వెయిటింగ్ లిస్ట్ టికెట్లను క్యాన్సిల్ చేసుకున్నప్పుడూ ఈ ఛార్జీలు వసూలు చేస్తున్నారు.దీనిపై ప్రాథమిక చర్చలు ప్రారంభమైనట్లు సమాచారం. రైల్వే ఈ విషయంలో నిర్ణయం తీసుకుంటే టికెట్ క్యాన్సిల్‌చేసుకునే ప్రయాణికులకు ముఖ్యంగా వెయిటింగ్ లిస్ట్ టికెట్లతో ఉన్న ప్రయాణికులకు ఉపశమనం లభిస్తుంది. ఎందుకంటే టికెట్ కన్‌ఫర్మ్ కాకపోతే ఆటోమేటిక్‌గా క్యాన్సిల్ అవుతుంది. ఇందులో వారి ప్రమేయం ఏ మాత్రం ఉండకపోయినా చార్జీలు పూర్తిగా రీఫండ్ కాకుండా క్లరికేజ్ రూపంలో రైల్వే కోత విధిస్తోంది.ఇటీవలి సంవత్సరాల్లో ఎక్కువ మంది ప్రయాణికులు కౌంటర్ల నుండి కాకుండా ఆన్‌లైన్లో టికెట్లు బుక్ చేసుకోవడంతో టికెటింగ్ కోసం రైల్వే నిర్వహణ ఖర్చులు తగ్గాయని, దీన్ని పరిగణనలోకి తీసుకొని ఛార్జీలను తగ్గించే అవకాశాలను పరిశీలిస్తున్నట్లు రైల్వే వర్గాల ద్వారా తెలుస్తోంది. మరోవైపు రైల్వేకు చెందిన టికెటింగ్ అండ్ క్యాటరింగ్ విభాగమైన ఐఆర్‌టీసీ ఏసీ టికెట్లపై రూ.30, నాన్ ఏసీ టికెట్లపై రూ.15 కన్వీనియన్స్ ఫీజు వసూలు చేస్తోంది. కానీ టికెట్ క్యాన్సిల్ అయినప్పుడు క్లరికేజ్ ఆదాయం మొత్తం రైల్వేకు వెళ్తోంది.

## అనంత్ అంబానీ జీతం ఎంతో తెలిస్తే అమ్మో అన్నాల్సిందే..

**జనంసాక్షి:**రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్(ఆర్ఐఎల్)కు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా మే 1, 2025 నుంచి బాధ్యతలు నిర్వర్తిస్తున్న ముఖేశ్ అంబానీ చిన్న కుమారుడు అనంత్ అంబానీ వేతన వివరాలను కంపెనీ ఎక్స్ఛేంజ్ ఫైలింగ్‌లో తెలిపింది.మానవ వనరులు, నామినేషన్ అండ్ రెమ్యునరేషన్ (హెచ్ఆర్ఎన్ఆర్) కమిటీ వార్షిక సవరణలకు లోబడి ఆయన వేతనం ఏడాదికి రూ.10 కోట్ల నుంచి రూ.20 కోట్ల వరకు ఉంటుందని పేర్కొంది.
అలవెన్స్‌లు ఇలా..
బేస్ శాలరీ,ఇతర పరిహారం: ఏడాదికి రూ.10–20 కోట్లు.ప్రాఫిట్ లింక్డ్ కమిషన్: ఆర్ఐఎల్ వార్షిక నికర లాభం పనితీరుతో నేరుగా ముడిపడి ఉంటుంది.ఇతర బెనిఫిట్స్: వసతి లేదా ఇంటి అద్దె భత్యం చెల్లిస్తారు.యుటిలిటీ ఖర్చులు: గ్యాస్, విద్యుత్, వాటర్.. వంటి యుటిలిటీ ఖర్చులు సంస్థే భరిస్తోంది.అనంత్ అంబానీ, తనపై ఆధారపడిన కుటుంబానికి ప్రయాణ రాయితీలు కల్పిస్తుంది.జీవిత భాగస్వామి, సహాయకులతో సహా ప్రయాణం, భోజనం, వసతి కోసం పూర్తి కవరేజీ అందిస్తుంది.కంపెనీ అందించే వాహనాలు, కమ్యూనికేషన్ మౌలిక సదుపాయాలు అదనం.వ్యక్తిగత, కుటుంబ భద్రత కోసం సమగ్ర భద్రతా ఏర్పాట్లు చేస్తుంది.
ఇంతకీ ఆయన ఏం చేస్తారంటే..
రిలయన్స్ ఇండస్ట్రీస్ భవిష్యత్తును రూపొందించడంలో అనంత్ అంబానీ కీలక పాత్ర పోషిస్తున్నారు. కంపెనీ ఎనర్జీ, సస్టైయినబిలిటీ విభాగాల్లో పని చేస్తున్నారు. మే 1, 2025 నాటికి అతను ఆర్ఐఎల్ బోర్డులో హోల్ టైమ్ డైరెక్టర్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా ఎన్నికయ్యారు.

## హైకమాండ్ ఖర్గే కాదా..?

### కాంగ్రెస్ అధ్యక్షుడి వ్యాఖ్యలపై కర్ణాటక బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య సెటైర్లు

**జనంసాక్షి:**కాంగ్రెస్‌లో హైకమాండ్ తీసుకునే నిర్ణయాలకే కట్టుబడి ఉండాలనేది ఎప్పట్నుంచో వస్తుంది. రాష్ట్రాల్లో ఏదైనా కీలక నిర్ణయాలు తీసుకోవాల్సిన తరుణంలో అది హైకమాండ్ ఫైనల్ చేస్తుంది.ఈ విషయంలో రాష్ట్ర సీఎంలు కూడా హైకమాండ్ మాటకు ఎదురుచెప్పకూడదు. ఈ తరహా పరిణామాలను తరుచూ చూస్తూనే ఉన్నాం. మరి హైకమాండ్ అంటే ఎవరు?, ఏఐసీసీ అధ్యక్షుడే కాంగ్రెస్ హైకమాండ్ కదా.. మరి పార్టీ చీఫ్ అయిన మల్లిఖార్జున ఖర్గే నోట నుంచే హైకమాండ్ చూసుకుంటుంది అనే మాట వస్తే ఏమనాలి? ఇప్పుడు అదే జరిగింది. ఏఐసీసీ ప్రెసిడెంట్ మల్లిఖార్జున ఖర్గే.. 'హైకమాండ్ చేతుల్లో ఉంది' అంటూ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు తీవ్ర దుమారం రేపుతున్నాయి. కర్ణాటక రాజకీయాల్లో ఏమైనా మార్పులు ఉండబోతున్నాయా సీఎంను మార్చబోతున్నారా? అని మీడియా అడిగిన ప్రశ్నకు ఖర్గే ఒక్క ముక్కలో తెగ్గొట్టి చెప్పేశారు. అది హైకమాండ్ చేతుల్లో ఉంది అంటూ దాటవేత ధోరణి అవలంభించారు. ఇది బీజేపీకి మంచి టానిక్‌లా దొరికింది. అటు కాంగ్రెస్‌ను, ఇటు ఖర్గేపై విమర్శలు చేయడానికి అవకాశం దొరికినట్లయ్యింది.ఖర్గే చేసిన వ్యాఖ్యలపై కర్ణాటక బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య సెటైర్లతో విరుచుపడ్డారు. ' ఇక్కడ హైకమాండ్ అంటే ఎవరు? మీరు కాదా?, కాంగ్రెస్ చీఫ్‌గా ఉన్న మీరు హైకమాండ్ కాదా?, మరి ఇంకా హైకమాండ్ ఎవరు? అని తేజస్వి సూర్య పంచ్‌లు వేశారు. కాంగ్రెస్ హైకమాండ్ కనపడదు.. అది మనకు కనిపించదు.. వినిపించని దెయ్యంలా ఉంటుందేమో. మనం మాత్రం కాంగ్రెస్ హైకమాండ్ ఉందని ఫీలవుతూ ఉండాలి' అని సెటైరికల్ పంచ్‌లు విసిరారు.



## ఇండియన్లకు సమయం విలువ తెలియదు

### రూ.500 కోసం గంట సమయమైనా వృథా చేస్తారు

### ఆన్‌లైన్ ఫైనాన్షియల్ ప్లాట్‌ఫామ్ క్రెడ్ వ్యవస్థాపకులు, సీఈఓ కునాల్ షా

**జనంసాక్షి:**ఆన్‌లైన్ ఫైనాన్షియల్ ప్లాట్‌ఫామ్ క్రెడ్ వ్యవస్థాపకులు, సీఈఓ కునాల్ షా ఇటీవల 'డబ్బు–సమయం'పై తన అభిప్రాయాన్ని పంచుకున్నారు. ఫోర్బ్స్ తో మాట్లాడుతూ చాలా మంది భారతీయులకు డబ్బుకు సంబంధించి సమయం విలువ తెలియదని షా అన్నారు.'మిలియన్ డాలర్లు సంపాదించే అమెరికన్లు తమ గంట వేతన విలువను సరిగ్గా అర్థం చేసుకుంటారు. అదే భారతదేశంలో ఎవరినైనా గంటకు తమ జీతం ఎంత అని అడిగితే.. వారికి ఎలాంటి క్లూ ఉండదు' అని షా అన్నారు. ఈ ధోరణి దీర్ఘకాలంలో భారీ మొత్తం నష్టపోయేందుకు దారితీస్తుందని చెప్పారు. భారత్‌లో చాలామంది సమయాన్ని ఎక్కువగా వృథా చేస్తున్నట్లు తెలిపారు. 'గంటకు రూ.10వేలు సంపాదించే వారు విమాన టికెట్‌పై రూ.500 ఆదా చేసుకోవడానికి మరో గంట సమయం వెచ్చిస్తున్నారు' అని పేర్కొన్నారు. 'భారత్‌లో కాకుండా నేను వెళ్లిన ప్రతి మీటింగ్‌లోనూ పురుషుల కంటే మహిళలే ఎక్కువగా ఉండేవారు. ముఖ్యంగా ప్రొడక్ట్ టెక్ కంపెనీల్లో ఆర్థిక పరమైన అంశాలపై ఇతర ప్రాంతాల్లో మహిళలదే పైచేయి. కానీ భారత్‌లో వీరి సంఖ్య చాలా పరిమితంగా ఉంది. ఈ స్పష్టమైన వ్యత్యాసం దేశ ఆర్థిక భవిష్యత్తుపై ప్రశ్నలు లేవనెత్తుతుంది. శ్రామిక శక్తిలోనూ మహిళల భాగస్వామ్యం చాలా తక్కువగా ఉంది. పురుషులే పనిచేస్తే భారత్ తలసరి ఆదాయం పెరగదు. మహిళలకు ప్రాతినిథ్యం పెరగాలి' అని చెప్పారు.




## ఇరాన్‌కు నేనేమీ ఆఫర్ చేయలేదు

ఈ మేరకు ఆయన సోషల్‌మీడియా ట్రూత్‌లో స్పందించారు. "ఇరాన్‌కు నేను ఏమీ ఆఫర్ చేయడంలేదని ఆ బోగస్ డెమోక్రాట్ సెనెటర్ క్రిస్ కూన్స్‌కు చెప్పండి. వారికి బిలియన్ల డాలర్లు ఇచ్చి బాంబు తయారీకి జేసీపీవోఏ ఒప్పందంలా చేయను. ఇరాన్ అణు కేంద్రాలను నాశనం చేసిన నాటి నుంచి చర్చలు కూడా జరపలేదు" అని పోస్టు చేశారు.తమతో దౌత్య పరమైన చర్చలు మొదలు కావాలంటే భవిష్యత్తులో మరే దాడి చేయమని అమెరికా హామీ ఇవ్వాలి అని ఇరాన్ విదేశాంగశాఖ సహాయ మంత్రి మాజిద్ తక్త్ రావంచి డిమాండ్ చేశారు. చర్చలను పునరుద్ధరించాలని ట్రంప్ కార్యవర్గం మధ్య వర్తుల ద్వారా సందేశం పంపిందని బీబీసీకి ఆయన వెల్లడించారు.జూన్‌లో ఇజ్రాయెల్ వైమానిక దాడులు చేపట్టిన నాటి నుంచి అమెరికా–ఇరాన్ మధ్య అణు కార్యక్రమంపై చర్చలు జరుగుతున్నాయి. ఇక టెల్ అవీవ్ దాడులకు టెహ్రాన్ క్షిపణులతో సమాధానం చెప్పింది. జూన్ 21వ తేదీన అమెరికానే నేరుగా ఇరాన్ అణు కేంద్రాలపై దాడులు చేసి ప్రత్యక్షంగా యుద్ధంలోకి దిగింది.పౌర అవసరాల కోసం అణు విద్యుత్ ఉత్పత్తి చేసేందుకు టెహ్రాన్‌కు 30 బిలియన్ డాలర్ల(దాదాపు రూ.2.5 లక్షల కోట్లు) సాయం చేసేందుకు ట్రంప్ కార్యవర్గం సిద్ధమవుతోందని సీఎన్ఎన్ వార్తా సంస్థ పేర్కొంది. దీంతోపాటు బ్యాంకుల్లో సీజ్ చేసిన ఆ సంస్థ సొమ్ములు కూడా రిలీజ్ చేయించాలని భావిస్తున్నట్లు పేర్కొంది. ఈ నెల 13 న ఇరాన్‌పై ఇజ్రాయెల్ దాడులు చేయడంతో అమెరికా–ఇరాన్ మధ్య ఒమన్ మధ్యవర్తిత్వంతో జరుగుతున్న చర్చలు నిలిచిపోయిన సంగతి తెలిసిందే.

### తెలంగాణ ఉద్యమకారుడుకి
## బిఎన్ రావు ఫౌండేషన్ చేయూత



**కరీంనగర్ జిల్లా బ్యూరో, జూన్ 30 (జనంసాక్షి) :** తెలంగాణ ఉద్యమకారుడు ఆమరణ నిరాహార దీక్ష చేసిన న్యాయవాది మన్నే పరంజ్యోతి ఆరోగ్యం క్షీణించి ఆర్థిక ఇబ్బందులతో కుటుంబం ఇబ్బందులు పడుతున్న విషయాన్ని గ్రహించిన బిఎన్ రావు ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ బి.ఎన్.రావు , డాక్టర్ అలీమ్ తో కలిసి కుటుంబ సభ్యులను నగరంలోని విద్యానగర్‌లో ని బాధ్యని గృహములో కలిసి పరామర్శించారు. అనంతరం వారు సంస్థ తరఫున 20 వేల రూపాయల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ బి.యన్ రావు మాట్లాడుతతూ... తెలంగాణ ఉద్యమంలో కీలక నేతగా అడ్వకేట్ జేఏసీ కరీంనగర్ విభాగంలో కీలకంగా వ్యవహరించి తెలంగాణ ఉద్యమంలో పాల్గొని ఢిల్లీలో సైతం తన గళాన్ని వినిపించి ఉద్యమమే ఊపిరిగా పోరాడిన తెలంగాణ పోరాటయోధుడు మన్నే పరంజ్యోతి న్యాయవాది కి ఆర్థిక ఇబ్బందులను తొలగించాలని మానవతా దృక్పథంతో ఆర్థిక సహాయాన్ని అందించమన్నారు. బాధితునికి మరిన్ని వైద్య సేవలు అందించడానికి సంస్థ ముందుంటుందని ఆయన పేర్కొన్నారు. ప్రముఖ సామాజికవేత ఎం. శ్రీనివాస్ కుమార్, తెరాస నేత మైనార్టీ నాయకుడు మాజిద్ పాల్గొన్నారు.

## ఆర్జీలపై అధికారులకు ఆదేశాలు

- ప్రజావాణికి 157 దరఖాస్తులు
- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా



**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, జూన్ 30 (జనంసాక్షి):** ప్రజావాణిలో వచ్చే అర్జీలను కలెక్టర్ సందీప్ కుమార్ ఝా పరిశీలించి వాటిని పరిష్కారం చేయాలని ఆయాశాఖల అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి నిర్వ హించి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ప్రజావాణికి మొత్తం 157 దరఖాస్తులు వచ్చాయి. వీటిలో రెవెన్యూ శాఖకు 45, హౌసింగ్ శాఖకు 33, డీఆర్డీఓకు 15, జిల్లా విద్యాధికారి 11, మున్సిపల్ కమిషనర్ సిరిసిల్లకు 10, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కు 8, జిల్లా వ్యవసా య అధికారి,జిల్లా ఉపాధి కల్పన శాఖ అధికారికి నాలుగు చొప్పున, జిల్లా పంచాయతీ అధికారి, ఏడీ ఎస్ఎల్ఆర్, జిల్లా పౌర సరఫరాల అధికారికి మూడు చొప్పు న, ఫిషరీస్, జిల్లా సంక్షేమ అధికారి, ఈఈ నీటి పారుదల శాఖ, ఈఓ వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయానికి రెండు, ఎల్‌డీఎం, ఈఈ పీఆర్, మున్సిపల్ కమిషనర్ వేములవాడ, ఏడీ హ్యాండ్ లూమ్స్, మైనార్టీ, ఆర్టీసీ, జడ్పీ సీఈవో, ,సెస్, ఈఈ ఆర్ డబ్ల్యూఎస్, ఎస్పీ ఆఫీస్‌కు ఒకటి చొప్పున వచ్చాయి. ఈ కార్యక్రమంలో సిరిసిల్ల, వేముల వాడ ఆర్డీవోలు వెంకటేశ్వర్లు, రాధాభాయ్, జడ్పీ సీఈవో వినోద్ కుమార్, డీఆర్డీఓ శేషాద్రి, జిల్లా అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.

## బాన్సువాడను అన్ని రంగాలలో అద్దంలా మారుస్తా

- రాష్ట్ర వ్యవసాయ సలహాదారులు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం



**నిజామాబాద్ జిల్లా బ్యూరో జూన్ 30 (జనంసాక్షి) :** బాన్సువాడ నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేసి అద్దంలా మారుస్తానని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారులు, బాన్సువాడ శాసనసభ్యులు పోచారం శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. బాన్సువాడ నియోజకవర్గ పరిధిలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు ముఖ్య అతిథిగా హాజరై తన చేతుల మీదుగా పలు కార్యక్రమాలలో పాల్గొని ప్రారంభోత్సవాలను చేశారు. ఈ సందర్భంగా కామారెడ్డి జిల్లా నసురుల్లాబాద్ మండలం నెమ్లి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 40.50 లక్షల రూపాయలతో నూతనంగా నిర్మించిన అదనపు తరగతి గదులు మరియు సైన్స్ ల్యాబ్ ను మరియు నిజామాబాద్ జిల్లా రుద్రూర్ మండల కేంద్రంలో 48 లక్షల రూపాయలతో నూతనంగా నిర్మించిన రుద్రూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం గోదాంను అయన ప్రారంభించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ తాను రాజకీయాలలో రాక మునుపు బాన్సువాడ నియోజకవర్గం అన్ని రంగాలలో వెనుకబడి ఉన్నదని, ఇప్పుడు బాన్సువాడ నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేశానని అన్నారు. ఈ కార్యక్రమంలో బాన్సువాడ సబ్ కలెక్టర్ శ్రీమతి కిరణ్మయి, ఉమ్మడి బీర్కూర్ మండల మార్కెట్ కమిటీ అధ్యక్షులు శ్రీమతి దుర్గం శ్యామల శ్రీనివాస్, రుద్రూర్ సొసైటీ అధ్యక్షులు సంజీవ రెడ్డి, నసురుల్లాబాద్ , రుద్రూర్ మండలాల నాయకులు, అధికారులు, నెమ్లి పాఠశాల సిబ్బంది విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

### విద్య రంగంలో నారాయణ
## చేసిన సేవలు మరువలేనివి



**ఆర్మూర్, జూన్ 30 (జనంసాక్షి):** విద్యార్థులు చదువుకొని నిష్ణాతులు కావాలనే తపనతో గోగికర్ నారాయణ విద్య రంగానికి చేసిన సేవలు మర్చిపోలేనివని ఎంపీడీవో బ్రహ్మానందం అన్నారు. ఆర్మూర్ మండలం సుర్బిర్యాల్ జిల్లా పరిషత్ పాఠశాలలో సోమవారం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నారాయణ పదవి విరమణ సన్మాన కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొని ఆయన మాట్లాడుతూ చిన్ననాటి నుండి నారాయణ చదువులో చురుకుగా ఉండేవాడని చెప్పారు. నాయకత్వ లక్షణాలు, అందరిలో కలిసి పోయే మనస్తత్వం ఉందన్నారు. అప్పటి గురువులు మాడవేడి నారాయణ, చక్రధర్ స్వామీల చదువు తమను ఉన్నత వ్యక్తులుగా తీర్చిదిద్దిందన్నారు. ఉపాధ్యాయ వృత్తి స్వీకరి ంచిన తర్వాత ప్రభుత్వ పాఠశాలల్లోని అనేకమంది విద్యార్థులకు విద్య నేర్పించి నిష్ణాతు లుగా తీర్చిదిద్దారన్నారు. విద్య రంగానికి ఆయన చేసిన సేవలు మర్చిపోలేనివని ప్రశంసించారు. అనంతరం రాష్ట్రపతి అవార్డు గ్రహీత మాడవేడి నారాయణ, రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు చక్రధర్ స్వామి మాట్లాడుతూ తాము చదువు చెప్పిన విద్యార్థి ఉపాధ్యాయ వృత్తి స్వీకరించి ఎందరో విద్యార్థులను ఉన్నత వ్యక్తులుగా తీర్చిదిద్దడం హర్షించదగ్గ విషయం అన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. అనంతరం ప్రధానోపాధ్యాయులు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్తులు, వివిధ పాఠశాల నుంచి వచ్చిన ఉపాధ్యాయులు, చిన్ననాటి స్నేహితులు నారాయణ దంపతులకు పూలమాలలు, శాలువా, మెమెంటోలతో ఘనంగా సన్మానం చేశారు.

# అందరికీ పిఎం బీమా చేయించాలి

- సోలార్ విద్యుత్ వినియోగం పై అవగాహన కల్పించాలి
- మహిళా సంఘాల సభ్యులను ఓపెన్ స్కూల్ లో చేర్పించాలి
- జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి



**కరీంనగర్ జిల్లా బ్యూరో, జూన్ 30 (జనంసాక్షి) :** పీఎంజెజెబివై, ఎస్.బి.వై, ఏ.పీ.వై వంటి బ్యాంకు ఖాతాదారుల బీమా పట్ల ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించి అందరికీ బీమా చేయించాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి బ్యాంకర్లను, జిల్లా అధికారులను ఆదేశించారు. ప్రజా వాణి అనంతరం కలెక్టరేట్ ఆడిటోరియంలో జిల్లా అధికారులు, బ్యాంకర్లతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... అతి తక్కువ ప్రీమియంతో రెండు లక్షల ప్రమాద బీమా సౌకర్యం ఉన్న పీఎం బీమా యోజన పట్ల ప్రజలందరికీ అవగాహన కల్పించాలని అన్నారు. 17 సంవత్సరాల నుండి 70 సంవత్సరాల వరకు అర్హత ఉన్న ఈ ప్రీమియం వ్యక్తి ప్రమాదవశాత్తు మరణిస్తే కుటుంబ సభ్యులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ కళాశాలల్లో బ్యాంకర్ల సహకారంతో ఇంటర్ విద్యాశాఖ అధికారులు విద్యార్థులకు వర్క్ షాప్ నిర్వహించాలని అన్నారు. ఆన్లైన్ బెట్టింగ్, మాదకద్రవ్యాల వినియోగం, సైబర్ నేరాలు వంటి వాటిపై అవగాహన కల్పించాలని అన్నారు. వారందరూ పీఎం జేజేబివై బీమా చేసేలా చూడా లన్నారు. ప్రధానమంత్రి సూరజ్ ఘర్ ముక్త్ బిజిలీ యోజన కార్యక్ర మంలో భాగంగా ప్రతి జిల్లాలో ఒక రెవిన్యూ గ్రామాన్ని సోలార్ మోడల్ విలే జ్‌గా ఎంపిక చేయనున్నారని తెలిపారు. ఎంపికైన గ్రామానికి కోటి రూ పాయల నిధులు కేటాయించి గ్రామాన్ని మరింత అభివృద్ధి చేస్తారని తెలిపారు. ఐదువేలకు పైగా జనాభా ఉన్న గ్రామాల్లో ప్రతి ఇంటికి, ప్రతి ప్రభుత్వ కార్యాలయానికి సోలార్ ఏర్పాటు చేసుకునేలా ప్రోత్సహిం చాలని సూచించారు. స్వయం సహాయక సంఘాల్లోని మహిళలందరూ పదవ తరగతి, ఇంటర్ ఓపెన్ స్కూల్లో చేరేలా ప్రోత్సహించాలని అన్నారు. ఎంపీడీవోలు, ఎంపీఓలు ప్రత్యేక చొరవ తీసుకొని వీలైనంత ఎక్కువ మందిని ఓపెన్ స్కూల్లో చేర్పించాలని అన్నారు. అదేవిధంగా ఎక్కువమంది ఉత్తీర్ణత సాధించి రాష్ట్రంలో జిల్లాను మొదటి స్థానంలో నిలిపేలా కృషి చేయాలని తెలిపారు. పని ప్రదేశాల్లో మహిళలపై లైంగిక వేధింపుల నిరోధక చట్టం ప్రకారం ఐసీసీ కమిటీలను ఏర్పాటు చేయాలని, పది మంది కంటే ఎక్కువ ఉద్యోగులు ఉన్న ప్రభుత్వ ప్రైవేటు సంస్థలు, పరిశ్రమల్లో తప్పనిసరిగా ఈ కమిటీలను ఏర్పాటు చేసి నివేదిక సమర్పించాలని జిల్లా అధికారులను ఆదేశించారు. భూభారతిలో వచ్చిన దరఖాస్తులకు సంబంధించి అర్జీదారులందరికీ నోటీసులు జారీ చేసి పరిష్కరించాలని తహసిల్దార్లను ఆదేశించారు.

ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం వేగవంతం చేయాలని గృహ నిర్మాణ శాఖ పీడిని ఆదేశించారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, అడిషనల్ కలెక్టర్ లక్ష్మీ కిరణ్, జిల్లా రెవెన్యూ అధికారి వెంకటేశ్వర్లు, ఆర్డిఓలు మహేశ్వర్, రమేష్ బాబు పాల్గొన్నారు.

## మిడ్ మానేరు ముంపు గ్రామాల నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి కృషి

- గ్రామాల్లో ప్రత్యేక శిబిరం ద్వారా దరఖాస్తులు స్వీకరిస్తాము
- బోయినపల్లి మండల నిర్వాసితుల సమావేశంలో చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, హాజరైన కలెక్టర్ సందీప్ కుమార్ ఝా.



**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి జూన్ 30 (జనంసాక్షి):** మిడ్ మానేర్ ముంపు గ్రామాల నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం భరోసా ఇచ్చారు. మిడ్ మానేర్ ప్రాజెక్ట్ బోయినపల్లి మండలంలోని ముంపు గ్రామాలు కొదురుపాక, వరద వెల్లి, నీలోజిపల్లి గ్రామాలకు చెందిన నిర్వాసితులతో జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో సోమవారం సాయంత్రం జిల్లా కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, కలెక్టర్ సందీప్ కుమార్ ఝా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల వారీగా సమస్యలను అడిగి తెలుసుకున్నారు.తమ ఇండ్లకు పరిహారం, 18 ఏండ్లు నిండిన యువతకు పరిహారం రాలేదని, కమ్యూనిటీ హాళ్లు, ఆలయాలు, ఆర్టీసీ బస్ షెల్టర్, స్కూల్ బిల్డింగ్ పరిహారం రాలేదని ఇతర సమస్యలను ఎమ్మెల్యే, కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు.అనంతరం ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మాట్లాడుతూ మానవతా దృక్పథంతో అందరి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి అర్హులందరికీ పరిహారం, మిగితా బెనిఫిట్స్ వచ్చేలా కృషి చేస్తానని స్పష్టం చేశారు. దరఖాస్తులపై మరోసారి అధికారులతో సర్వే చేయిస్తానని, అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం చేస్తానన్నారు.

**గ్రామాల్లో ప్రత్యేక శిబిరం ద్వారా దరఖాస్తులు స్వీకరిస్తాము..**
కొదురుపాకలో బుధవారం, వరద వెల్లిలో గురువారం, నీలోజిపల్లిలో శుక్రవారం రెవెన్యూ అధికారులు ప్రత్యేక శిబిరం ద్వారా సమావేశాలు నిర్వహించి, నిర్వాసితుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తారని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, కలెక్టర్ సందీప్ కుమార్ ఝా తెలిపారు. ఆయా గ్రామాల నిర్వాసితులు తమ సమస్యల పై దరఖాస్తు చేసుకోవాలన్నారు.

వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో వేములవాడ ఆర్డీవో ఎస్డీసీ రాధాబాయ్, బోయినపల్లి తహసిల్దార్ నారాయణ రెడ్డి, కలెక్టరేట్ పర్యవేక్షకులు శ్రీకాంత్, ఆయా గ్రామల ప్రజలు పాల్గొన్నారు.

## ప్రాణాలను బలి తీసుకున్న అతివేగం

- మంబోజి పల్లి శివారులోని ఎన్ఎస్ఎఫ్ వద్ద జరిగిన ఘోరమైన దుర్ఘటన
- ఘటన స్థలాన్ని పరిశీలించిన మెదక్ రూరల్ సీఐ రాజశేఖర్ రెడ్డి



**మెదక్, జూన్ 30 (జనంసాక్షి):** మెదక్ మండలం మంభోజిపల్లి గ్రామ శివారులో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందారు. మంబోజి పల్లి గ్రామ శివారులోని నిజాం దక్కన్ షుగర్ ఫ్యాక్టరీ వద్ద ఆర్టీసీ బస్సు, ఆటో ఢీ కొట్టిన ప్రమాదంలో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. స్థానికుల కథనం మేరకు కొల్చారం మండలం పోతన్ శెట్టిపల్లి గ్రామానికి చెందిన సంపంగి శ్రీకాంత్ (26), కౌడిపల్లి కి చెందిన వడ్డెర నరేష్ (25)లు ఆటోలో మెదక్ వస్తున్నారు. ఆటో నడుపుతున్న శ్రీకాంత్ ఎన్ఎస్ఎఫ్ ముందుగా వెళ్తున్న బైకును ఓవర్ టేక్ చేసేందుకు ఆటో వేగం పెంచి నడిపాడు, కానీ ముందుగా వస్తున్న ఆర్టిసి బస్సును చూడకపోవడంతో దాన్ని ఢీకొట్టాడు. రెండు వాహనాలు వేగంగా ఉండడంతో ఆటో బస్సును ఢీ కొట్టి నుజ్జు నుజ్జు అయింది. అందులో ఉన్న శ్రీకాంత్, నరేష్‌లు అక్కడికక్కడే మృతి చెందారు. శ్రీకాంత్, నరేష్ లు వరుసకు బావ మరుదులు. ఈ విషయం తెలుసుకున్న మెదక్ రూరల్ సీఐ రాజశేఖర్ రెడ్డి, ఎస్సైలు ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాలను మెదక్ ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తామని పోలీసులు తెలిపారు.

### పాశమైలారం దుర్ఘటనలో గాయపడి
# బాధితులకు మెరుగైన వైద్య సేవలు

- వైద్య ఖర్చులు ప్రభుత్వమే భరిస్తుంది
- వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ



**సంగారెడ్డి ప్రతినిధి, జూన్ 30(జనంసాక్షి):** పాశమైలారం దుర్ఘటనలో గాయపడి బాధితులకు మెరుగైన వైద్య సేవలు అందిస్తామని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. సోమవారం పటాన్చెరు నియోజకవర్గంలోని ఇస్నాపూర్ పాశమైలారం చిగాచి ఫార్మా పరిశ్రమలో రియాక్టర్ పేలిన ప్రమాదంలో గాయపడి ధృవ, ప్రణామ్ హాస్పిటళ్లలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ పరామర్శించారు. బాధిత పేషెంట్ల ఆరోగ్య పరిస్థితిని డాక్టర్లు మంత్రికి వివరించారు. బాధితులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, ఇందుకు అయ్యే ఖర్చు మొత్తాన్ని ప్రభుత్వం భరిస్తుందని డాక్టర్లకు మంత్రి సూచించారు. ట్రీట్‌మెంట్‌లో ఎటువంటి కాంప్రమైజ్ ఉండొద్దని ఆదేశించారు.బాధితుల ఆరోగ్యం కుదుటపడే వరకూ హాస్పిటల్స్‌లోనే ఉండి వారికి అవసరమైన వైద్య సహాయక సేవలు అందించాలని జిల్లా డీఎంహెచ్‌వోను, ఇతర మెడికల్ అండ్ హెల్త్ ఆఫీసర్లను మంత్రి ఆదేశించారు. చికిత్స పొందుతున్న వారి కుటుంబ సభ్యులను హాస్పిటల్ వద్ద మంత్రి పరామర్శించి, వారిని ఓదార్చారు.జరిగిన ఘటన అత్యంత దురదృష్టకరమని పేర్కొన్నారు. బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని వారికి మంత్రి భరోసానిచ్చారు. చికిత్సకు అయ్యే ఖర్చు మొత్తాన్ని ప్రభుత్వమే భరిస్తుందని, ఎవరూ ఆందోళన చెందొద్దన్నారు. ఈ దుర్ఘటనలో గాయపడిన, మృతి చెందిన వారి కుటుంబాలను అన్ని విధాలుగా ఆదుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు.

## ఎర్రబోడ ప్రభుత్వ స్థలంలో అంబేద్కర్ ప్రజా భవన్ నిర్మించాలి



**రాజేంద్రనగర్, జూన్30(జనంసాక్షి):** రాజేంద్రనగర్ సర్కిల్ హైదర్గూడా ఎర్రబోడ సర్వేనెంబర్ 7లో ఉన్న 33 గుంటల స్థలంలో ప్రభుత్వ స్థలంలో విశాలమైన రీతిలో డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ పేరిట ప్రజా భవన్ నిర్మించాలని రాజకీయ పార్టీలు, పౌర సంఘాలు నిర్ణయించాయి. అంబేద్కర్ భవన్ ఎస్సీలతో పాటు పేదలకు అండగా, స్థానికులకు నీడగా ఉండే విధంగా రూపొందించాలని తీర్మానించాయి. సోమవారం శ్రీ సప్తగిరి వెంకటేశ్వర స్వామి దేవాలయంలో శివాలయం పునర్నిర్మిత కార్యక్రమం ప్రారంభమైంది. ఈ సందర్భంగా శ్రీ సప్తగిరి వెంకటేశ్వర స్వామి ఆలయ ధర్మకర్త గుమ్మకొండ మధుసూదన్ రెడ్డి అధ్యక్షతన జరిగిన జరిగిన సమావేశంలో స్థానికంగా దాదాపు అన్ని రాజకీయ పార్టీల నాయకులు, పౌర సంఘాల ప్రతినిధులు పాల్గొని ఈ తీర్మానం చేశారు. గతంలో ఇక్కడ దళిత సంఘాల కోసం ప్రభుత్వం కొంత భూమిని కేటాయించింది. కొన్ని కారణాలవల్ల ఈ స్థలం చాలాకాలంగా ఉపయోగంలోకి రాలేదు. ప్రస్తుతం రాజకీయ పార్టీలు , పౌర సంఘాలన్నీ ఏకతాటిపై కలిసి రావడంతో విశాల భవనం నిర్మాణంపై ఏకగ్రీవ తీర్మానం జరిగింది. ఈ కార్యక్రమంలో కొలన్ సుభాష్ రెడ్డి, మ్యాడం రామేశ్వర్ రావు, నారగూడెం మల్లారెడ్డి, మోంగ్ర కొమురయ్య, , కల్లు గోపాల్, వనం నర్సింహ, సోమారం రవీందర్, సోమారం రాజ్ కుమార్, సాబాద విజయ్ కుమార్, పౌర సంఘాల ప్రతినిధులు గుమ్మకొండ పెంటారెడ్డి, మ్యడం మధుసూదన్ , పుస్తకాల అశోక్, బర్ల మల్లారెడ్డి, కోడిగంటి బాల్ రెడ్డి పాల్గొన్నారు.

# ప్రపంచంలో భారత్ ప్రతిష్టను దిగజారుస్తున్న మోడీ

- ట్రంప్ బెదిరింపులకు మోడీ జీ హుజూర్
- తెలంగాణలో బీజేపీ గెలుస్తుందనడం హస్యాస్పదం
- సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు ఎస్.వీరయ్య




**సంగారెడ్డి టౌన్, జూన్ 30(జనంసాక్షి):** కేంద్ర ప్రభుత్వం ప్రపంచంలో భారత్ పరువు ప్రతిష్టతలను మంటగ్గలుపుతుందని, ప్రధాని మోడీ ట్రంప్ బెదిరింపులకు జీ హుజూర్ అంటున్నాడని సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు ఎస్. వీరయ్య ఘాటుగా స్పందించారు. ఒకప్పుడు భారత దేశానికి అలీనోద్యమాన్ని నడిపిన చరిత్ర ఉందని, మోడీ ప్రధాని అయ్యాక భారత్ పరువును పల్చన చేస్తున్నాడని దుయ్యబట్టారు. సోమవారం సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని కేవల్ కిషన్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ భారత్ -పాకిస్తాన్ మధ్య కాల్పుల విరమణ విషయంలో తాను బెదిరించడం వల్లనే రెండు దేశాలు రాజికి వచ్చాయని ట్రంప్ ప్రకటన చేయడంతో భారత్‌కు మర్యాద లేకుండా పోయిందన్నారు. అదే విధంగా అమెరికా నుండి భారత్ విద్యార్థులను చేతులకు సంకెళ్లు వేసి తరిమేసిన విషయంలోనూ మోడీ ట్రంప్‌తో మాట్లాడకుండా ఆయనతో చర్చలు జరిపి అధానీపై కేసులు పెట్టకుండా మాట్లాడుకున్నాడని పేర్కొన్నారు. సరుకుల దిగ్మమతి విషయంలోనూ ఇండియా పన్నులు తగ్గించాలని ట్రంప్ డిమాండ్ చేస్తే మోడీ ఆటోమొబైల్స్ వస్తులపై దిగ్నుమతి సుంకాల్ని తగ్గించడం వల్ల భారత రైతాంగ్నంపై భారం మోపబడిరదన్నారు. పక్కన ఉన్న చైనా మాత్రం ట్రంప్ బెదిరింపులకు భయపడకుండా సై అంటే సై అన్నట్లుగా ధీటుగా సమాధానం చెప్పిందన్నారు. ఇజ్రాయిల్ పాలస్తీన్కై దాడులు చేస్తుంటే మోడీ ఇజ్రాయిల్‌తో దోస్తీ చేస్తున్నాడని, గతంలో భాతత్ ఎప్పుడ్కైనా పాలస్తీనాకే మద్దతు తెలిపిందా అన్నారు. అంతెందుకు బీజేపీ ప్రధానిగా ఉన్న వాజ్‌పాయ్ కూడా అదే వైఖరి అనుసరించారని గుర్తు చేశారు. ప్రభుత్వ సభను రాజకీయ వేదిక చేయడం తప్ప పసుపుబోర్డు కార్యాలయం ప్రారంభం పేరిట నిర్వహించిన ప్రభుత్వ అధికారిక సభను కేంద్ర హోంమంత్రి అమిత్‌షా తమ పార్టీ రాజకీయ వేదికగా మార్చుకుని రాష్ట్ర ప్రభుత్వాన్ని విమర్శించడం సభబు కాదని ఎస్.వీరయ్య విమర్శించారు. పక్కన రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు ఉన్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వాన్ని విమర్శించడం సరైంది కాదన్నారు. బీఆర్ఎస్ మాదిరే రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కూడా రైతు వ్యతిరేక విధానాలను అమలు చేస్తుందంటూ, తెలంగాణ ధల్లీ కాంగ్రెస్‌కు ఏటీఎంగా మారిందని విమర్శించడం తప్పుడు పద్ధతి అన్నారు. మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు సునితంగా స్పందించినప్పటికీ సీఎం రేవంత్‌రెడ్డి మాత్రం అమిత్‌షా విమర్శలపై స్పందించాల్సిన అవసరముందన్నారు. ఈ సమావేశంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు, కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.నర్సింహులు, జిల్లా కమటీ సభ్యులు కృష్ణ పాల్గొన్నారు.

# రెడ్ క్రాస్‌సొసైటీకి జిల్లా యంత్రాంగం తరపున అన్నివిధాలా సహకరిస్తాం

- జిల్లా కలెక్టర్ సంతోష్



**గద్వాల నడిగడ్డ,జూన్ 30 (జనంసాక్షి):** జిల్లాలో రెడ్ క్రాస్ సొసైటీ భవిష్యత్తులో మరింత విస్తృతంగా సేవా కార్యక్రమాలు చేపట్టేందుకు జిల్లా యంత్రాంగం తరపున అన్ని విధాల సహకారం అందిస్తామని జిల్లా కలెక్టర్ బి.యం సంతోష్ పేర్కొన్నారు. సోమవారం కలెక్టర్ కార్యాలయ ములోని సమావేశ మందిరంలో నిర్వహించిన ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ వార్షిక సర్వ సభ్య సమావేశంలో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు .ముందుగా సర్ జీన్ హెన్రీ డ్యూ నాంట్ జయంతి చిత్ర పటానికి పూల మాలలు వేసి,జ్యోతి ప్రజ్వలన చేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రెడ్ క్రాస్ సొసైటీ 2022 నుండి 2025 వరకు చేసిన సేవా కార్యక్రమాలు అత్యంత అభినందనీయమైనవని పేర్కొన్నారు.సేవల కోసం స్వచ్ఛందంగా పనిచేసిన సభ్యులకు ఆయన హృదయపూర్వక అభినందనలు తెలిపి, మెమెంటోలు అందజేశారు. భవిష్యత్తులో మరింత విస్తృతంగా సేవా కార్యక్రమాలు చేపట్టాలని కోరు తూ,జిల్లా పరిపాలన తరపున అవసరమైన అన్ని విధాల సహకారం అందిస్తామని పేర్కొన్నారు.సొసైటీ యొక్క ప్రస్తుత కాలపరిమితి పూర్తయిన నేపథ్యంలో,రాబోయే సాధారణ సభ్యుల సమావేశం కోసం ఎన్నికల ప్రక్రియ చేపట్టాలని, అందుకోసం ప్రత్యేక ఎన్నికల అధికారిని నియమించినట్లు తెలిపారు.ఈ సందర్భంగా ఎన్నికల అధికారి విడుదల చేసిన షెడ్యూలు ప్రకారం,జూలై 1, 2 తేదీలలో ఓటర్ల జాబితాపై అభ్యం తరాలు స్వీకరించబడతాయని, అనంతరం జూలై 3న ఎన్నికల నోటిఫి.కేషన్ అధికారికంగా విడుదల చేయబడుతుందని తెలిపారు. జూలై 10న నామినేషన్ల స్వీకరణ, జూలై 11న నామినేషన్ల పరిశీలన జరగనున్నదని, జూలై 12న నామినేషన్ల ఉపసంహరణ ఉంటుందని తెలిపారు. అనంతరం పోటీలో ఉన్న తుది అభ్యర్థుల జాబితా ప్రకటించబడుతుం దని తెలిపారు.జూలై 18న ఓటింగ్ నిర్వహించబడుతుందని తెలిపారు. ఈ ఎన్నికల ప్రక్రియ మొత్తం గద్వాల పట్టణంలోని రైల్వే గేట్ పక్కన ఉన్న జిల్లా మహిళా సమాఖ్య భవనంలో నిర్వహించబడనుందని అన్నారు. ఎన్నికలు సమగ్రంగా,పారదర్శకంగా నిర్వహించేందుకు జిల్లా పరిపా లన పూర్తి సహకారం అందిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అద నపు కలెక్టర్లు లక్ష్మి నారాయణ, కో ఆపరేటివ్ అధికారి శ్రీనివాస్,రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ జి రమేష్, రాష్ట్ర ఈ.సి మెంబెర్ డా. మోహన్ రావు, వైస్ చైర్మన్ తాహిర్,రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులు,అధికారులు, పాల్గొన్నారు.



# మరో రికార్డు సృష్టించే దిశగా యశస్వి



జులై 2 నుంచి బర్మింగ్‌హామ్‌లోని ఎడ్జ్‌బాస్టన్ వేదికగా భారత్-ఇంగ్లాండ్ జట్ల మధ్య రెండవ టెస్ట్ మ్యాచ్ ప్రారంభం కానుంది. శుభ్‌మన్ గిల్ సారథ్యంలోని భారత జట్టు 0-1తో సిరీస్‌లో వెనుకబడి ఉంది. తొలి టెస్ట్‌లో జరిగిన తప్పిదాల నుంచి పాఠాలు నేర్చుకుని, రెండవ టెస్ట్‌లో బలమైన పునరాగమనం చేయాలని జట్టు లక్ష్యంగా పెట్టుకుంది. మొదటి టెస్ట్‌లో సెంచరీ సాధించిన యశస్వి జైస్వాల్ ప్రపంచ రికార్డు సృష్టించే దిశగా సమీపిస్తున్నాడు. లీడ్స్‌లో జరిగిన తొలి టెస్ట్ మొదటి ఇన్నింగ్స్‌లో జైస్వాల్ 101 పరుగులు సాధించాడు. అయితే, రెండో ఇన్నింగ్స్‌లో కేవలం 4 పరుగుల వద్ద ఔటయ్యాడు. అయినప్పటికీ, అతను అద్భుతమైన ఫామ్‌లో కనిపిస్తున్నాడు. ఈ ఊపుతో, పాకిస్తాన్ మాజీ బ్యాటర్ షాహిద్ అఫ్రిది టెస్ట్ క్రికెట్ రికార్డును బద్దలు కొట్టేందుకు సిద్ధంగా ఉన్నాడు.

టెస్ట్ క్రికెట్‌లో అత్యంత వేగంగా 50 సిక్సర్లు కొట్టిన రికార్డు అఫ్రిది పేరిట ఉంది, అతను 46 ఇన్నింగ్స్‌లలో ఈ ఘనత సాధించాడు. యశస్వి జైస్వాల్ ఇప్పటివరకు 38 ఇన్నింగ్స్‌లలో 40 సిక్సర్లు కొట్టాడు. మరో 10 సిక్సర్లు కొడితే, అఫ్రిది రికార్డును అధిగమించి కొత్త రికార్డు సృష్టించవచ్చు. జైస్వాల్ టెస్ట్ క్రికెట్‌లో ఇంగ్లాండ్‌పై ఆడిన 11 ఇన్నింగ్స్‌లలో 27 సిక్సర్లు కొట్టాడు, ఇది ఒకే జట్టుపై అత్యధిక సిక్సర్ల రికార్డు. రెండవ టెస్ట్‌లో 10 సిక్సర్లు కొట్టకపోయినా, రాబోయే 7 ఇన్నింగ్స్‌లలో 10 సిక్సర్లు సాధిస్తే అఫ్రిది రికార్డును బద్దలు కొట్టే అవకాశం ఉంది.

టెస్ట్ క్రికెట్‌లో అత్యంత వేగంగా 50 సిక్సర్లు కొట్టిన రెండవ బ్యాటర్‌గా భారత మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ ఉన్నాడు, అతను 51 ఇన్నింగ్స్‌లలో ఈ ఘనత సాధించాడు. ఇటీవల రోహిత్ టెస్ట్ క్రికెట్ నుంచి రిటైర్ అయ్యాడు. జైస్వాల్ రోహిత్ రికార్డును కూడా అధిగమించే అవకాశం స్పష్టంగా కనిపిస్తోంది.

జైస్వాల్ ఇప్పటివరకు 20 టెస్ట్ మ్యాచ్‌లలో 38 ఇన్నింగ్స్‌లలో 1903 పరుగులు సాధించాడు, 5 సెంచరీలు, 10 అర్ధ సెంచరీలతో రాణిస్తున్నాడు. ఈ టెస్ట్‌లో రాణిస్తే, అతను 2000 టెస్ట్ పరుగుల మైలురాయిని అందుకోనున్నాడు. ఎడ్జ్‌బాస్టన్ మైదానంలో భారత్ ఇప్పటివరకు 8 టెస్ట్ మ్యాచ్‌లు ఆడగా, ఇంగ్లాండ్ 7 మ్యాచ్‌లలో విజయం సాధించింది, ఒక మ్యాచ్ డ్రాగా ముగిసింది. శుభ్‌మన్ గిల్ సారథ్యంలోని భారత జట్టు ఈ టెస్ట్‌ను గెలిస్తే, ఎడ్జ్‌బాస్టన్‌లో భారత్‌కు తొలి విజయం సాధించిన ఘనత దక్కుతుంది. తొలి టెస్ట్‌లో భారత్ నుంచి 5 సెంచరీలు నమోదైనప్పటికీ, లోయర్ ఆర్డర్ బ్యాటర్లు కరుణ్ నాయర్, జడేజా స్కోరు చేయకపోవడం, బౌలింగ్ విభాగం బలహీనంగా కనిపించడం జట్టుకు ప్రతికూలంగా మారాయి. జస్ప్రీత్ బుమ్రా మాత్రం బౌలింగ్‌లో కొంత ఆకట్టుకున్నాడు. రెండవ టెస్ట్‌లో భారత జట్టు కొన్ని మార్పులతో బరిలోకి దిగే అవకాశం ఉంది.

# సాయి సుదర్శన్ ఆడట్లేదు





టెండూల్కర్-ఆండర్సన్ ట్రోఫీ కోసం భారత్-ఇంగ్లాండ్ మధ్య జరుగుతున్న ఐదు టెస్ట్ మ్యాచ్‌ల సిరీస్‌లో ఇంగ్లాండ్ 1-0 ఆధిక్యంలో ఉంది. లీడ్స్‌లో జరిగిన మొదటి టెస్ట్‌లో ఇంగ్లాండ్ ఐదు వికెట్ల తేడాతో విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో యువ బ్యాటర్ సాయి సుదర్శన్ భారత జట్టు తరపున టెస్ట్ అరంగేట్రం చేసినప్పటికీ, రెండు ఇన్నింగ్స్‌లలోనూ విఫలమయ్యాడు. ఇప్పుడు జులై 2 నుంచి బర్మింగ్‌హామ్‌లోని ఎడ్జ్‌బాస్టన్‌లో రెండవ టెస్ట్ జరగనుంది.

ఎడ్జ్‌బాస్టన్ టెస్ట్‌లో సాయి సుదర్శన్‌ను ప్లేయింగ్-11 నుంచి తప్పించే అవకాశం ఉంది. అతని స్థానంలో ఇండియా ఎ కెప్టెన్ అభిమన్యు ఈశ్వరన్‌కు అవకాశం లభించవచ్చు. ఎడ్జ్‌బాస్టన్‌లో భారత జట్టు ఇప్పటివరకు ఒక్క టెస్ట్ మ్యాచ్‌లోనూ విజయం సాధించలేదు. ఈ నేపథ్యంలో, ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ తన వ్యూహంతో చరిత్ర సృష్టించేందుకు అభిమన్యు ఈశ్వరన్‌ను ఎంపిక చేయవచ్చు. లీడ్స్ టెస్ట్‌లో సాయి సుదర్శన్ మొదటి ఇన్నింగ్స్‌లో నాలుగో బంతికే సున్నా వద్ద ఔటయ్యాడు, రెండవ ఇన్నింగ్స్‌లో 48 బంతుల్లో 30 పరుగులు (4 ఫోర్లతో) సాధించాడు. నంబర్-3 స్థానంలో బ్యాటింగ్ చేసిన అతను త్వరగా ఔట్ కావడంతో జట్టుపై ఒత్తిడి పెరిగింది. ఈ ప్రదర్శన కారణంగా, ఎడ్జ్‌బాస్టన్ టెస్ట్‌లో అతన్ని తప్పించే అవకాశం కనిపిస్తోంది.

ఇంగ్లాండ్ లయన్స్‌తో జరిగిన రెండు అనధికారిక మ్యాచ్‌లలో అభిమన్యు ఈశ్వరన్ రెండు హాఫ్ సెంచరీలు సాధించాడు. రెండవ మ్యాచ్‌లో ప్రతికూల పరిస్థితుల్లో 92 బంతుల్లో 80 పరుగులు చేసి తన సత్తా చాటాడు. అభిమన్యు తండ్రి, ఒక ఇంటర్వ్యూలో, "డెహ్రాడూన్‌లో నేను వార్తాపత్రికలు పంపిణీ చేసేవాడిని, ఐస్‌క్రీమ్ అమ్మేవాడిని. క్రీడకు ఏదైనా తిరిగి ఇవ్వాలనుకున్నాను. దేవుడు నాకు క్రికెట్ ఆడే కొడుకును ఇచ్చాడు," అని చెప్పాడు. అభిమన్యు డెహ్రాడూన్‌లో తన కొడుకు పేరిట అభిమన్యు క్రికెట్ అకాడమీని స్థాపించాడు. అభిమన్యు ఈశ్వరన్ గత కొన్ని సిరీస్‌లలో టెస్ట్ జట్టులో ఎంపికైనప్పటికీ, అరంగేట్రం చేసే అవకాశం రాలేదు. లీడ్స్ టెస్ట్‌లో సాయి సుదర్శన్‌కు ముందు అతనికి అవకాశం ఇవ్వకపోవడంతో కెప్టెన్ గిల్, కోచ్ గంభీర్ సోషల్ మీడియాలో విమర్శలు ఎదుర్కొన్నారు. అయితే, ఎడ్జ్‌బాస్టన్ టెస్ట్‌లో అభిమన్యుకు అవకాశం లభించే అవకాశం ఉంది. ప్రస్తుత ఇంగ్లాండ్ పర్యటనకు ఎంపికైన జట్టులో అభిమన్యు ఈశ్వరన్ అత్యధిక ఫస్ట్-క్లాస్ సెంచరీలు (103 మ్యాచ్‌లలో 27 సెంచరీలు, 31 హాఫ్ సెంచరీలు, 7841 పరుగులు, సగటు 48.70) సాధించాడు. ఇతర ఆటగాళ్లలో కరుణ్ నాయర్ 24 సెంచరీలు, కేఎల్ రాహుల్ 19 సెంచరీలు, సాయి సుదర్శన్ 7 సెంచరీలు సాధించారు.

**ఎడ్జ్‌బాస్టన్ టెస్ట్‌కు భారత జట్టు సంభావ్య ప్లేయింగ్-11:**
కేఎల్ రాహుల్, యశస్వీ జైస్వాల్, అభిమన్యు ఈశ్వరన్, కరుణ్ నాయర్, శుభమన్ గిల్ (కెప్టెన్), రిషబ్ పంత్ (వైస్ కెప్టెన్/వికెట్ కీపర్), రవీంద్ర జడేజా, శార్దూల్ ఠాకూర్, మహ్మద్ సిరాజ్, జస్ప్రీత్ బుమ్రా, ప్రసిద్ధ్ కృష్ణ

# కోహ్లీ రికార్డుపై కన్నేసిన పంత్



ఇంగ్లాండ్‌తో జరిగిన తొలి మ్యాచ్‌లో, రిషబ్ పంత్ వరుసగా రెండు సెంచరీలు సాధించి అద్భుతమైన ఆటను కనబరిచాడు. 5 మ్యాచ్‌ల సిరీస్‌లోని మొదటి మ్యాచ్‌లో అద్వితీయ స్కోరు సాధించిన తర్వాత, ఇప్పుడు మాజీ కెప్టెన్ విరాట్ కోహ్లీ రికార్డును బద్దలు కొట్టే అవకాశం అతనికి ఉంది. ఇంగ్లాండ్‌తో జరిగిన రెండో మ్యాచ్‌లో రిషబ్ పంత్ సెంచరీ సాధిస్తే కోహ్లీ రికార్డు బ్రేక్ అవుతుంది. ఇంగ్లండ్‌పై అత్యధిక సెంచరీలు చేసిన టెస్ట్ రికార్డు ప్రమాదంలో ఉంది. భారత టెస్ట్ వైస్ కెప్టెన్ రిషబ్ పంత్ విరాట్ కోహ్లీ పెద్ద రికార్డును దృష్టిలో ఉంచుకుని ఎడ్జ్‌బాస్టన్ టెస్ట్‌లోకి అడుగుపెడతాడు. లీడ్స్ టెస్ట్‌లో రెండు ఇన్నింగ్స్‌లలో సెంచరీలు సాధించిన తర్వాత, రెండవ మ్యాచ్‌లో కూడా అతని నుండి ఇలాంటి ఆట ఆశించబడుతుంది. అయితే, ఈ సెంచరీ ఇన్నింగ్స్ భారత జట్టుకు విజయాన్ని అందించలేకపోయింది. 371 పరుగుల భారీ లక్ష్యాన్ని ఛేదించిన ఆతిథ్య ఇంగ్లాండ్ గెలిచింది. ఇంగ్లాండ్‌పై టెస్టుల్లో భారతదేశం తరపున అత్యధిక సెంచరీలు (ఐదు) చేసిన రెండవ ఆటగాడిగా కోహ్లీ ఉన్నాడు. పంత్ ఇంగ్లాండ్ పై ఐదు టెస్ట్ సెంచరీలు కూడా చేశాడు. ఎడ్జ్‌బాస్టన్‌లో పంత్ మరో సెంచరీ చేస్తే, అతను కోహ్లీని మించిపోతాడు. 5 మ్యాచ్‌ల సిరీస్‌కు భారత జట్టు ఎంపిక కావడానికి ముందే విరాట్ కోహ్లీ టెస్ట్ క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించాడు. ఇప్పుడు అతను ఈ ఫార్మాట్‌లో ఆడటం కనిపించదు. ఇంగ్లాండ్‌పై టెస్టుల్లో అత్యధిక సెంచరీలు చేసిన భారత ఆటగాళ్లలో అతను మహ్మద్ అజారుద్దీన్‌తో చేరతాడు. అదే సమయంలో, టీమ్ ఇండియా కొత్త టెస్ట్ కెప్టెన్ శుభ్‌మాన్ గిల్ కూడా ప్రత్యేక రికార్డును సాధించడానికి దగ్గరగా ఉన్నాడు. అతను మరో సెంచరీ సాధిస్తే, ఇంగ్లాండ్ గడ్డపై భారత కెప్టెన్‌గా అత్యధిక సెంచరీలు సాధించిన ఆటగాళ్లలో అతను చేర్చబడతాడు. గిల్ తన పేరు మీద రెండు టెస్ట్ సెంచరీలు కలిగి ఉంటాడు. కోహ్లీ మరియు మహ్మద్ అజారుద్దీన్ తర్వాత ఇంగ్లాండ్‌లో రెండు సెంచరీలు సాధించిన భారత కెప్టెన్ అవుతాడు. తొలి టెస్టులో టీమిండియా రెగ్యులర్ స్పిన్నర్ లేకుండానే బరిలోకి దిగింది. అయితే రెండో టెస్టులో మాత్రం ప్రధాన స్పిన్నర్ కుల్దీప్ యాదవ్‌కు అవకాశం ఇస్తారని సమాచారం. అందులోనూ ఎడ్జ్ బాస్టన్ పిచ్‌పై టర్న్ లభిస్తుంది. దాంతో కుల్దీప్ యాదవ్ రాణించే అవకాశం ఉంది. అతడితో పాటు అర్ష్‌దీప్ సింగ్‌ను కూడా తుది జట్టులోకి తీసుకునే అవకాశం ఉందని సమాచారం. అయితే అర్ష్‌దీప్ సింగ్ ను బుమ్రా స్థానంలో తీసుకుంటారా? లేదంటే మరో ప్లేయర్‌ను తప్పించి తీసుకుంటారా? అనేది తెలియాల్సి ఉంది. బుమ్రాకు రెండో టెస్టు నుంచి విశ్రాంతి కల్పిస్తారని జోరుగా ప్రచారం జరుగుతుంది. అయితే అతడు నెట్స్‌లో బౌలింగ్ ప్రాక్టీస్ చేశాడు. ఇక పిచ్ విషయానికి వస్తే.. నాలుగో ఇన్నింగ్స్ కష్టంగా ఉంటుంది. టాస్ గెలిచిన జట్టు బ్యాటింగ్ ఎంచుకునే అవకాశం ఉంటుంది. ఇక్కడ నాలుగు ఇన్నింగ్స్‌ల సగటును చూస్తే.. తొలి ఇన్నింగ్స్‌లో 310 పరుగులు.. రెండో ఇన్నింగ్స్ లో 280 పరుగులు.. మూడో ఇన్నింగ్స్‌లో 230 నుంచి 250 పరుగులు.. నాలుగో ఇన్నింగ్స్‌లో 170 నుంచి 200 పరుగుల మధ్య ఉంది.

## డీపీఎల్ రెండో సీజన్ కోసం సన్నాహాలు

### అరంగేట్రం చేయనున్న కోహ్లీ, సెహ్వాగ్ వారసులు

ఢిల్లీ ప్రీమియర్ లీగ్ 2024లో ప్రారంభమైంది. ఇప్పుడు రెండో సీజన్ కోసం సన్నాహాలు ప్రారంభమయ్యాయి. ఢిల్లీ ప్రీమియర్ లీగ్ 2025 వేలం శనివారం, జులై 5న జరగనుంది. ఢిల్లీ ప్రీమియర్ లీగ్ వేలం జాబితా చాలా ఆసక్తికరంగా ఉంది. వేలం జాబితాలో విరాట్ కోహ్లీ అన్న కొడుకు పేరు కూడా ఉంది. అంతే కాకుండా దిగ్గజ క్రికెటర్ వీరేంద్ర సెహ్వాగ్ కొడుకులు కూడా వేలం కోసం రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. వీరేంద్ర సెహ్వాగ్ కొడుకు, విరాట్ కోహ్లీ అన్న కొడుకు పేరు కూడా ఆర్యవీర్ కావడం చాలా ఆసక్తికరమైన విషయం. 15 ఏళ్ల ఆర్యవీర్ కోహ్లీ.. విరాట్ కోహ్లీ అన్నయ్య వికాస్ కోహ్లీ కొడుకు. ఆర్యవీర్ ఒక లెగ్ స్పిన్ బౌలర్. ఆర్యవీర్ కోహ్లీ విరాట్ కోహ్లీ చిన్ననాటి కోచ్ రాజ్‌కుమార్ శర్మ ఆధ్వర్యంలో వెస్ట్ ఢిల్లీ క్రికెట్ అకాడమీలో శిక్షణ పొందుతున్నాడు. ఆర్యవీర్ కోహ్లీని వేలం జాబితాలోని కేటగిరీ సీలో ఉంచారు. గత సీజన్‌లో ఆర్యవీర్ కోహ్లీ ఢిల్లీ అండర్-16 జట్టు కోసం నామినేట్ చేయబడింది. ఢిల్లీ క్రికెట్‌లో నామినేట్ అయిన ఆటగాళ్లు 30 మందితో కూడిన తుది జట్టులో స్థానం సంపాదించిన వారు. అదే విధంగా వీరేంద్ర సెహ్వాగ్ 17 ఏళ్ల కొడుకు ఆర్యవీర్ సెహ్వాగ్ కూడా వేలం జాబితాలో ఉన్నాడు. అతడిని కేటగిరీ బీలో ఉంచారు. ఆర్యవీర్ సెహ్వాగ్ ఢిల్లీ అండర్-19 జట్టు తరపున ఆడాడు. ఆర్యవీర్ సెహ్వాగ్ మేఘాలయపై 297 పరుగుల అద్భుతమైన ఇన్నింగ్స్ ఆడాడు. వీరేంద్ర సెహ్వాగ్ చిన్న కొడుకు వేదాంత్ సెహ్వాగ్‌ను కూడా కేటగిరీ బీలో ఉంచారు. వేదాంత్ ఢిల్లీ తరపున అండర్-16 క్రికెట్ ఆడాడు. ఈ సారి ఢిల్లీ ప్రీమియర్ లీగ్‌లో మొత్తం 8 జట్లు పాల్గొననున్నాయి. గత సీజన్‌తో పోలిస్తే ఈ సారి ఢిల్లీ ప్రీమియర్ లీగ్‌లో 2 కొత్త జట్లు ప్రవేశించనున్నాయి. ఈ 8 జట్ల పేర్లు ఈస్ట్ ఢిల్లీ రైడర్స్, నార్త్ ఢిల్లీ స్ట్రైకర్స్, వెస్ట్ ఢిల్లీ లయన్స్, సౌత్ ఢిల్లీ సూపర్ స్టార్స్, పురానీ ఢిల్లీ 6, సెంట్రల్ ఢిల్లీ కింగ్స్.. 2 కొత్త జట్ల పేర్లు అవుటర్ ఢిల్లీ, న్యూ ఢిల్లీగా ఉన్నాయి.

## ట్రేడ్‌మార్క్ ట్యాగ్ కోసం దరఖాస్తు చేసుకున్న ధోనీ

**ముంబై :** టీమిండియా మాజీ కెప్టెన్, క్రికెటర్ ఎంఎస్ ధోనీని.. మిస్టర్ కూల్ అని సంబోధిస్తున్న విషయం తెలిసిందే. మైదానంలో ఉన్న సమయంలో అతన్ని కెప్టెన్ కూల్‌గా కూడా పిలిచేవాళ్లు. అయితే ఇప్పుడు కెప్టెన్ కూల్ అన్న ట్యాగ్ ట్రేడ్‌మార్క్ కోసం ధోనీ దరఖాస్తు చేసుకున్నట్లు తెలుస్తోంది. ఆ పదాన్ని తానే వాడుకునే రీతిలో అతను ట్రేడ్ మార్క్స్ రిజిస్ట్రీ పోర్టల్‌కు దరఖాస్తు చేసుకున్నాడు. ఉత్కంఠ రేపే మ్యాచ్‌లోనూ ధోనీ చాలా కూల్‌గా కెప్టెన్సీ బాధ్యతలు నిర్వర్తించేవాడు. అతని సారధ్య బాధ్యతలు చూసిన క్రికెటర్లు, అభిమా నులు అతన్ని మిస్టర్ కూల్ అని, కెప్టెన్ కూల్ అని పిలిచేవాళ్లు. ఇప్పుడు ఆ పదాన్నే తన సొంతం చేసుకోవాలని ట్రేడ్ మార్క్స్ రిజిస్ట్రీకి ధోనీ దరఖాస్తు పెట్టుకున్నాడు. ట్రేడ్ మార్క్స్ పోర్టల్ ఆ దరఖాస్తును అంగీకరించినట్లు తెలుస్తోంది. జూన్ 1వ తేదీన ట్రేడ్‌మార్క్ పోర్టల్‌లో దీన్ని పబ్లిష్ చేశారు. జూన్ 5వ తేదీన దరఖాస్తు చేసుకున్నట్లు తెలుస్తోంది.

## కాలేజీ కుర్రాడి వింబుల్డన్ ఎంట్రీ



అతను ఒక కాలేజీ విద్యార్థి, టెన్నిస్ అంటే అతనికి అమితమైన ఇష్టం. తొలి గ్రాండ్‌స్లామ్ ఆడుతున్నప్పటికీ, ఒలివర్ టార్వెట్ ఏమాత్రం ఒత్తిడికి లోనవలేదు. 21 ఏళ్ల ఈ బ్రిటన్ యువ ఆటగాడు వింబుల్డన్ టోర్నమెంట్‌లో పచ్చని కోర్టుపై ప్రేక్షకులను ఆకట్టుకుంటూ తన అరంగేట్రాన్ని అద్భుతంగా గుర్తుంచుకునేలా చేశాడు. సోమవారం జరిగిన వింబుల్డన్ ఫస్ట్ రౌండ్ మ్యాచ్‌లో, 733వ ర్యాంక్‌లో ఉన్న ఒలివర్, స్విట్జర్లాండ్‌కు చెందిన లియాండ్రో రీడీపై 6-4, 6-4, 6-4 స్కోరుతో మూడు సెట్లలో ఆధిపత్యం చెలాయించి, రెండో రౌండ్‌లోకి ప్రవేశించాడు. రాబోయే మ్యాచ్‌లో అతను టాప్ సీడ్ కార్లోస్ అల్కరాజ్‌ను ఎదుర్కొనే అవకాశం ఉంది. కోర్టు నంబర్ 4లో లియాండ్రోను చిత్తు చేసిన ఈ యువ ఆటగాడు తన విజయాన్ని కుటుంబం, స్నేహితులతో ఆనందంగా సెలబ్రేట్ చేసుకున్నాడు. "వింబుల్డన్‌లో ఆడటం ఎప్పటి నుంచో నా కల. రెండో రౌండ్‌కు చేరడం నన్ను అమిత ఆనందంలో ముంచెత్తింది. నా తొలి గ్రాండ్‌స్లామ్‌ క్వాలిఫై అవడమే కాకుండా, మొదటి విజయాన్ని సాధించడం థ్రిల్లింగ్‌గా ఉంది. కార్లోస్ అల్కరాజ్‌తో తలపడే అవకాశం గురించి ఆలోచిస్తేనే అద్భుతంగా అనిపిస్తోంది," అని మ్యాచ్ అనంతరం ఒలివర్ తెలిపాడు. లియాండ్రోపై విజయం సాధించిన వెంటనే, ఈ బ్రిటన్ యువ ఆటగాడు తన స్నేహితులను ఆలింగ నం చేసుకున్నాడు. అతను చదువుతున్న సాన్ డీగో యూనివర్సిటీ క్యాప్ ధరించి, టీ-షర్ట్ విప్పేసి కాలేజీ జెర్సీతో సంబరాలు చేసుకున్నాడు. ఇటీవలే ఒలివర్ వరుసగా రెండోసారి వెస్ట్ కోస్ట్ కాన్ఫరెన్స్ ప్లేయర్ ఆఫ్ ది ఇయర్ అవార్డు అందుకున్నాడు, తన ప్రతిభను మరోసారి నిరూపించాడు.

## కేశవ్ మహారాజ్ డబుల్ సెంచరీ



ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో 628 వికెట్లు తీసిన సౌతాఫ్రికా స్టార్ స్పిన్నర్ కేశవ్ మహరాజ్ అరుదైన ఘనతను సాధించాడు. టెస్ట్ ఫార్మాట్‌లో 200 వికెట్లు తీసి ఔరా అనిపించాడు. ఈ ఘనత సాధించిన దక్షిణాఫ్రికా తరపున తొలి బౌలర్‌గా నిలిచాడు. దక్షిణాఫ్రికా, జింబాబ్వే మధ్య జరిగిన తొలి టెస్టులో ఈ స్పిన్నర్ చరిత్ర సృష్టించాడు. తొలి ఇన్నింగ్స్‌లో 418/9 పరుగులు చేసి ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసిన దక్షిణాఫ్రికా, అద్భుతమైన బౌలింగ్ ద్వారా రెండో రోజు జింబాబ్వేను 251 పరుగులకు ఆలౌట్ చేసి 167 పరుగుల భారీ ఆధిక్యాన్ని సంపాదించింది. టెంబా బావుమా గాయ పడటంతో దక్షిణాఫ్రికా కెప్టెన్‌గా కేశవ్ మహారాజ్ ఉన్నాడు. తొలి ఇన్నింగ్స్‌లో 3 వికెట్లు తీసి మహారాజ్ పెద్ద రికార్డు సృష్టించాడు.

వియాన్ ముల్డర్ నాలుగు వికెట్లు తీసి జింబాబ్వే పతనాన్ని శాసించాడు. అరంగేట్రం చేసిన కోడి యూసుఫ్, కేశవ్ మహారాజ్ చెరో 3 వికెట్లు పడగొట్టారు. ఈ వికెట్లతో, కేశవ్ మహారాజ్ టెస్ట్ క్రికెట్‌లో డబుల్ సెంచరీ వికెట్లు పూర్తి చేశాడు. అతను టెస్టుల్లో 200 వికెట్లు పూర్తి చేశాడు. దక్షిణాఫ్రికా తరపున ఈ ఘనత సాధించిన దేశం నుండి మొదటి స్పిన్నర్ అయ్యాడు. మహారాజ్ 16.4 ఓవర్లలో 70 పరుగులకు 3 వికెట్లు పడగొట్టాడు. దక్షిణాఫ్రికా తరపున టెస్ట్ చరిత్రలో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గా ఇప్పటికే నిలిచాడు. కేశవ్ మహారాజ్ హనుమాన్ భక్తుడు. వికెట్ తీసిన ప్రతిసారి అతడు దేవుడిని మొక్కడం ఆనవాయితీ. 2016లో ఆస్ట్రేలియాతో జరిగిన టెస్ట్ మ్యాచ్‌లో మహారాజ్ తన అరంగేట్రం చేశాడు. అప్పటి నుండి ఈ ఫార్మాట్‌లో క్రమం తప్పకుండా ఆడుతున్నాడు. ఫస్ట్-క్లాస్ క్రికెట్‌లో చాలా కాలం పాటు కష్టపడి పనిచేసిన తర్వాత, అతనికి జాతీయ జట్టులో అవకాశం లభించింది.

ఈ ఫార్మాట్‌లో అతడు 628 వికెట్లు సాధించాడు. దక్షిణాఫ్రికా అత్యుత్తమ స్పిన్నర్. వికెట్ల పరంగా దక్షిణాఫ్రికాకు చెందిన రెండవ అత్యంత విజయవంతమైన స్పిన్నర్ హ్యూ టేఫీల్డ్. ఈ జాబితాలో పాల్ ఆడమ్స్ మూడవ స్థానంలో ఉన్నారు. పాల్ హారిస్, నిక్కీ బోజే నాలుగు, ఐదవ స్థానంలో ఉన్నారు.

## ఫైనల్లో నిఖత్ జరీన్

### టైటిల్ పోరుకు దూసుకెళ్లిన లొవ్లీనా, నీతూ



హైదరాబాద్ వేదికగా జరుగుతున్న ఎలైట్ ఉమెన్స్ బాక్సింగ్ టోర్నమెంట్ లో ఇందూర్‌కు చెందిన నిఖత్ జరీన్ తన జైత్రయాత్రను కొనసాగిస్తూ ఫైనల్‌కు చేరుకుంది. తన పంచ్‌ల శక్తితో ప్రత్యర్థులను వరుసగా మట్టికరిపిస్తూ, 51 కిలోల విభాగం సెమీఫైనల్‌లో బాక్సర్ లక్ష్యను 5-0 స్కోరుతో చిత్తు చేసి, రెండుసార్లు ఛాంపియన్‌గా నిలిచిన నిఖత్ టైటిల్ పోరుకు అర్హత సాధించింది. ఫైనల్‌లో ఆమె జ్యోతితో తలపడనుంది. టోక్యో ఒలింపిక్స్ కాంస్య పతక విజేత లొవ్లీనా బొర్గొహైన్ కూడా 75 కిలోల విభాగంలో తన ఆధిపత్యాన్ని చాటుతూ ఫైనల్‌కు చేరుకుంది. సెమీఫైనల్‌లో ఉత్తరప్రదేశ్‌కు చెందిన స్నేహను తొలి రౌండ్‌లోనే స్టాపేజ్ ద్వారా ఓడించి, లొవ్లీనా తన సత్తాను చాటింది. 2022 కామన్‌వెల్త్ క్రీడల్లో స్వర్ణం సాధించిన నీతూ గంగా కూడా 48 కిలోల విభాగం సెమీఫైనల్‌లో రైల్వే బాక్సర్ మంజూ రాణిని ఉత్కంఠభరిత పోరులో ఓడించి టైటిల్ పోరుకు అర్హత సాధించింది. టైటిల్ కోసం నీతూ శాయ్ బాక్సర్ చంచల్‌తో తలపడనుంది. ఇక 80 కిలోల సెమీఫైనల్‌లో స్వీటీ బోరా ఆలిండియా పోలీస్ బాక్సర్ బబితా బిష్త్‌ను ఓడించి ఫైనల్‌కు చేరుకుంది. ఈ టోర్నమెంట్‌లో నిఖత్ జరీన్, లొవ్లీనా, నీతూ, స్వీటీలు తమ పంచ్‌లతో ప్రత్యర్థులకు చుక్కలు చూపిస్తూ ఫైనల్‌కు దూసుకెళ్లారు.

# మహిళా శిశు సంక్షేమ శాఖకు అదనపు నిధులు మంజూరు చేయండి

- కేంద్ర మంత్రి అన్నపూర్ణాదేవినీ విజ్ఞప్తి చేసిన మంత్రి సీతక్క
- శంషాబాద్ ఎయిర్‌పోర్టులో కేంద్ర మంత్రి, రాష్ట్ర మంత్రి సీతక్క భేటీ
- రాష్ట్రంలో వినూత్న పథకాలు అమలు చేస్తున్నారంటూ ప్రశంస



**హైదరాబాద్, జూన్ 30 (జనంసాక్షి) :**
శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో సోమవారం కేంద్ర మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి అన్నపూర్ణాదేవితో రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ సీతక్క భేటీ అయ్యారు. మహారాష్ట్ర నుంచి ఢిల్లీకి తిరుగు ప్రయాణమైన కేంద్ర మంత్రి కాసేపు శంషాబాద్ ఉన్న క్రమంలో కేంద్ర మంత్రిని మహిళా సంక్షేమ శాఖ కార్యదర్శి అంతా రామచంద్రన్ తో కలిసి సీతక్క పలు అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క రాష్ట్రంలో అమలవుతున్న పథకాల వివరాలతో కూడిన వినతిపత్రాన్ని కేంద్ర మంత్రికి అందజేశారు. ఆరోగ్యలక్ష్మి, పోషణ్ 2.0, సంక్షేమ అంగన్వాడీ వంటి పథకాల ద్వారా తెలంగాణలో మహిళా, శిశు సంక్షేమానికి ప్రభుత్వం అధిక నిధులు వెచ్చిస్తోందని ఆమె తెలిపారు. ఇతర రాష్ట్రాల్లో లేని విధంగా అంగన్వాడీ ఉద్యోగులకు పదవీ విరమణ ప్రయోజనాలు కల్పిస్తున్న విషయాన్ని కేంద్ర మంత్రికి వివరించారు. అలాగే అంగన్వాడీ టీచర్లు, హెల్పర్ల జీతాల్లో కేంద్ర వాటాను పెంచాలని కోరారు. అంగన్వాడీ టీచర్లకు, హెల్పర్లకు రాష్ట్ర ప్రభుత్వం నెలకు రూ. 10,950, రూ.6450 చెల్లిస్తుండగా కేంద్రం తన వాటాగా నామమాత్రంగా కేవలం రూ. 2700, రూ.1350 మాత్రమే చెల్లిస్తుంది. ఈ మొత్తాన్ని పెంచాల్సిన అవసరాన్ని కేంద్ర మంత్రి కి సీతక్క వివరించారు. దీంతోపాటు రాష్ట్రంలో 11 వేలకుపైగా అంగన్వాడీ కేంద్రాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయని, వాటికి సొంత భవనాల నిర్మాణానికి కేంద్ర నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఆరోగ్య లక్ష్మి పథకం ద్వారా గర్భిణీలకు బాలింతలకు ప్రతిరోజు 200 %మీ% విజయ మిల్క్ ను అందిస్తున్నామని, త్వరలో చిన్నారులకు సైతం ఈ పథకాన్ని న్ని వర్తింప చేసే అంశం ప్రభుత్వ పరిశీలనలో ఉందని, కేంద్ర ప్రభుత్వం తన వంతు సహకారం అందించాలని మంత్రి సీతక్క కోరారు. మంత్రి సీతక్క వినతులను కేంద్ర మంత్రి అన్నపూర్ణాదేవి సానుకూలంగా స్పందించారు. తెలంగాణ రాష్ట్రం చేపడుతున్న పథకాలు అభినందనీయం అని ప్రశంసించారు. దేశవ్యాప్తంగా ఉన్న రాష్ట్రాల మహిళా శిశు సంక్షేమ మంత్రులు, అధికారులతో కలిసి తెలంగాణలో జాతీయ సదస్సు నిర్వహించి ఇక్కడి బెస్ట్ ప్రాక్టీస్ ను ఇతర రాష్ట్రాలకు పరిచయం చేస్తామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వంతో చర్చించి అధిక నిధుల మంజూరు పై నిర్ణయం తీసుకుంటామని కేంద్ర మంత్రి హామీ ఇచ్చారు.

### బ్యాంకింగ్ సంస్కరణలు, భవిష్యత్తు సవాళ్లపై...

# ఏఐఎస్ బీఓఎఫ్ జనరల్ కౌన్సిల్‌లో విస్తృత చర్చ

- ఏఐఎస్ బీఓఎఫ్ 29వ వార్షిక జనరల్ కౌన్సిల్ విజయవంతంగా పూర్తి

**హైదరాబాద్, జూన్ 30 (జనంసాక్షి) :**
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో అతిపెద్ద అధికారుల ప్రాతినిధ్య సంస్థ అయిన ఆల్-ఇండియా స్టేట్ బ్యాంక్ ఆఫీసర్స్ ఫెడరేషన్ (ఏఐఎస్ బీఓఎఫ్), దేశవ్యాప్తంగా లక్ష మందికిపైగా అధికారుల సభ్యత్వంతో, 2025 జూన్ 27 నుండి 29వరకు హైదరాబాద్లోని షామీర్పేటలోని లియోనియా హోలిస్టిక్ డెస్టినేషన్లో తన 29వ వార్షిక జనరల్ కౌన్సిల్ ను విజయవంతంగా ముగించింది. దీనికి సమాఖ్య అధ్యక్షుడు కామ్రేడ్ అరుణ్ కుమార్ బిషోయ్, సమాఖ్య ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ రూపమ్ రాయ్ నాయకత్వం వహించా రు. ఈ సెషన్లో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆఫీసర్స్ అసోసియేషన్ లోని 17 సర్కిల్ నుండి వచ్చిన 700 మంది ప్రతినిధులు, పరిశీలకులతో సహా దాదాపు 2000 మంది అధికారులు పాల్గొన్నారు. జనరల్ కౌన్సిల్ ను స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సీనియర్ ఎగ్జిక్యూటివ్ సత్కరించారు. వీరిలో మేనేజింగ్ డైరెక్టర్ (ఆర్బీఅండ్ఓ) వినయ్ ఎం. టోన్సే, డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ (హెచ్ ఆర్), సీడీఓ కిషోర్ కుమార్ పోలుదాసుబీ హైదరాబాద్ సర్కిల్ చీఫ్ జనరల్ మేనేజర్ సహదేవన్ రాధాకృష్ణన్ ఉన్నారు. ప్రముఖ ట్రేడ్ యూనియన్ నాయకులు ఏఐబీఈఏ జనరల్ సెక్రటరీ కామ్ సీహెచ్ వెంకటాచలం, ఎన్ సీబీఈ జనరల్ సెక్రటరీ కామ్ ఎల్ చంద్రశేఖర్, ఏఐబీఓసీ అధ్యక్షుడు కామ్. ఆర్ శేఖరన్ ప్రత్యేక అతిథులుగా హాజరయ్యారు. ప్రారంభ సెషన్‌లో వారి జ్ఞానోదయమైన చర్చ ఈ కార్యక్రమాన్ని సోదర ఉత్సాహం, మెరుపుతో ట్రేడ్ యూనియన్ నాయకుల స్వతంత్ర సమావేశంగా మార్చే అవసరమైన సారాంశాన్ని జోడించింది. గౌరవం, కృతజ్ఞతా చిహ్నం గా, దశాబ్దాలుగా అధికారుల ఉద్యమానికి అపారమైన కృషి చేసిన ఏఐఎస్ బీఓఎఫ్ అనుభవజ్ఞులైన నాయకులను సెషన్లో సత్కరించారు.

**కీలక అంశాలపై కౌన్సిల్ విస్తృత చర్చ**

అధికారుల సేవా పరిస్థితులు, మానవ వనరుల విధానాలు, బ్యాంకింగ్ సంస్కరణలు, భవిష్యత్తులో ప్రభుత్వ రంగ బ్యాంకులు అధికారులకు ఎదుర య్యే సవాళ్లకు సంబంధించిన కీలక అంశాలపై కౌన్సిల్ విస్తృతమైన చర్చను నిర్వహించింది. ఆడిట్ చేయబడిన ఖాతాలు, విధాన పత్రాలు, సంస్థాగత విషయాలను సభ ముందు ప్రవేశపెట్టి, చర్చించి, ఏకగ్రీవంగా ఆమోదించా రు. ప్రతినిధి సమావేశంలో అన్ని సర్కిల్ అసోసియేషన్ నుండి ప్రతినిధులు అధికారుల గురించి ప్రశ్నలు, సమస్యలను లేవనెత్తారు. ప్రతినిధులు లేవనెత్తిన అంశాలపై కామ్రేడ్ రూపమ్ రాయ్ తగిన నవీకరణతో ప్రతిస్పందించారు. సమాఖ్య జోక్యం అవసరమయ్యే అంశాలపై ప్రస్తుత పరిణామాల గురించి సభకు తెలియజేశారు. సాధారణంగా దాని సభ్యుల ప్రయోజనాలను, సమాజాన్ని పరిరక్షించడంలో సమాఖ్య పాత్రను బలోపేతం చేయడానికి అనేక ముఖ్యమైన తీర్మానాలు ఆమోదించబడ్డాయి. ఈ సమావేశంలో జరిగిన ఎన్నికలలో, 2025-2028 తమాసిక కాలానికి ఏఐఎస్ బీఓఎఫ్ అధ్యక్షుడిగా, ప్రధాన కార్యదర్శిగా కామ్రేడ్ అరుణ్ కుమార్ బిషోయ్, కామ్రేడ్ రూపమ్ రాయ్ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

# హెచ్ఐవీ బాధితులకు చేయూత



## కొత్తగా 14,084 మందికి పెన్షన్ మంజూరు

## మంత్రి సీతక్క వెల్లడి

హైదరాబాద్, జూన్ 30 (జనంసాక్షి) : హెచ్ఐవీ బాధితులకు ఆర్థిక భరోసా కల్పించేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మరోసారి మానవీయంగా స్పందించింది. పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క సోమవారం నాడు 14,084 మంది కొత్త హెచ్ఐవీ బాధితులకు చేయూత పెన్షన్లు మంజూరు చేస్తూ ఫైల్‌పై సంతకం చేశారు. ఈ పెన్షన్లు జూలై నెల నుంచి లబ్ధిదారులు అందుకోనున్నారు. హెచ్ఐవీ బాధితులు పూర్తి స్థాయిలో పని చేయలేని స్థితిలో ఉండటంతో పాటు, వారిపై నెలనెలా అధిక వైద్య ఖర్చులు కూడా పడుతున్నాయి. ఈ పరిస్థితిని దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. పేదరికంతో బాధపడుతున్న హెచ్ఐవీ బాధితుల జీవిత నాణ్యతను మెరుగుపరిచేందుకు చేయూత పథకం కింద ఈ సాయం అందించనున్నారు. ఇప్పటికే 34,421 మందికి నెలకు రూ.2016 చొప్పున పెన్షన్ అందుతోంది. ఇందుకోసం రాష్ట్రం నెలవారీగా రూ.6.93 కోట్లు ఖర్చు చేస్తోంది. 2022 ఆగస్టు తరువాత హెచ్ఐవీ కేటగిరీలో కొత్తగా పెన్షన్లు మంజూరవ్వలేదు. అయితే తాజాగా తెలంగాణ రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఆధ్వర్యంలో కొత్తగా నమోదు అయిన 14,084 మందికి అర్హతలు నిర్ధారించిన అనంతరం సెర్ప్ ద్వారా పెన్షన్లు మంజూరయ్యాయి.



అయితే జయశంకర్ భూపాలపల్లి, గద్వాల్, మంచిర్యాల, మెదక్, ములుగు, నాగర్‌కర్నూల్, నారాయణపేట, నిర్మల్, రంగారెడ్డి తదితర జిల్లాల్లో కొత్తగా ఒక్కరు కూడా నమోదు కాలేదని అధికారులు తెలిపారు. ఈ నూతన లబ్ధిదారులకు ఈ ఆర్థిక సంవత్సరానికి అంచనా వ్యయం రూ.28.40 కోట్లు కాగా, కావాల్సిన నిధులు ప్రభుత్వం వద్ద సిద్ధంగా ఉన్నాయని అధికార వర్గాలు స్పష్టం చేశాయి. ఇప్పటికే 4020 మంది డయాలసిస్ పేషెంట్లకు ఈ మద్యే పింఛన్ మంజూరు చేయగా.. తాజాగా హెచ్ఐవీ బాధితులకు పింఛన్ మంజూరు చేయడంతో ఈ వర్గాలు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపాయి.

| జిల్లాల వారీగా అర్హుల సంఖ్య | |
|---|---|
| హైదరాబాద్ | 3,019 |
| నల్గొండ | 1,388 |
| ఖమ్మం | 954 |
| సూర్యాపేట | 931 |
| కరీంనగర్ | 833 |
| ఆదిలాబాద్ | 482 |
| భద్రాద్రి కొత్తగూడెం | 556 |
| హన్మకొండ | 825 |
| జగిత్యాల | 306 |
| జనగాం | 228 |
| కామారెడ్డి | 702 |
| మహబూబ్ నగర్ | 452 |
| నిజామాబాద్ | 528 |
| పెద్దపల్లి | 567 |
| సంగారెడ్డి | 1242 |
| సిద్దిపేట | 527 |
| వికారాబాద్ | 544 |

# అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు చేరవేత





## సమాచార, పౌర సంబంధాల శాఖది కీలక పాత్ర

## ప్రత్యేక కమిషనర్ సి హెచ్ ప్రియాంక

హైదరాబాద్, జూన్ 30 (జనంసాక్షి) : ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు చేరవేయడంలో సమాచార పౌర సంబంధాల శాఖ కీలక పాత్ర పోషిస్తుందని సమాచారశాఖ ప్రత్యేక కమిషనర్ సి హెచ్ ప్రియాంక అన్నారు. సమాచార శాఖ ప్రధాన కార్యాలయంలో పౌర సంబంధాల అధికారి గా విధులు నిర్వర్తిస్తున్న ముళ్ళపూడి శ్రీనివాస్ కుమార్ సోమవారం ఉద్యోగ విరమణ పొందారు. ఈ సందర్భంగా హైదరాబాద్ రాష్ట్ర సమాచార శాఖ కార్యాలయంలో శ్రీనివాస్ కుమార్ ను కార్యాలయ అధికారులు, ఉద్యోగులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి ప్రత్యేక కమిషనర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వానికి, ప్రజలకు వారధిగా నిలిచి ప్రభుత్వం చేపట్టిన ప్రతి కార్యక్రమాన్ని ప్రజలకు చేరవేసేందుకు సమాచార శాఖ అధికారులు నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. సమాచార శాఖ కార్యాలయంలో ముళ్ళపూడి శ్రీనివాస్ కుమార్ తమ విధులను అంకితభావంతో సమర్థవంతంగా నిర్వర్తించారని ప్రియాంక ప్రశంసించారు. ఉద్యోగ విరమణ మరొక కొత్త జీవితం అని అన్నారు. ఉద్యోగంలో ఉన్నప్పుడు వ్యక్తి గత జీవితాన్ని చాలా కోల్పోతామని, ఉద్యోగం విరమణ తర్వాత కుటుంబ సభ్యులతో ఆనందంగా గడపాలన్నారు. అనంతరం శ్రీనివాస్ కుమార్ కుటుంబ సభ్యులను ప్రత్యేక కమిషనర్ పరిచయం చేసుకున్నారు. ముళ్ళపూడి శ్రీనివాస్ కుమార్ మాట్లాడుతూ తన 38 ఏండ్ల ఉద్యోగ జీవితం సంతృప్తిగా సాగిందన్నారు. అనేక పురస్కారాలు లభించాయన్నారు. చిత్తశుద్ధితో పని చేయడం వలన సమాచార శాఖ కు తాను చేసిన సేవల కంటే పొందినదే ఎక్కువ అని సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జీ అదనపు సంచాలకులు డి.ఎస్.జగన్, సంయుక్త సంచాలకులు కె.వెంకట రమణ, వెంకటేశ్వరావు, ఉప సంచాలకులు మధుసూధన్, వై వెంకటేశ్వర్లు, ప్రసాద్, హష్మీ , సమాచార శాఖ అధికారులు , ఉద్యోగులు పాల్గొన్నారు.

# ధరల నిర్ణయ కమిటీలు ఏర్పాటు చేయండి

## ఇసుక విక్రయ కేంద్రాలు పెద్ద సంఖ్యలో ఏర్పాటు చేయాలి

## సబ్ కమిటీ తీసుకున్న నిర్ణయాలు ప్రతిరోజు సమీక్షించాలి

## డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు



హైదరాబాద్ (జనంసాక్షి) : ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం నేపథ్యంలో సామాన్యులకు సిమెంటు, స్టీల్, ఇటుకలు, ఇసుక అందుబాటులో ఉండేందుకు మండల స్థాయిలో ధరల నిర్ణయ కమిటీలు సమావేశమై ధరలు నిర్ణయించాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. సోమవారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సచివాలయంలో రెవిన్యూ రిసోర్స్ మొబ లైజేషన్ సమావేశం జరిగింది. సమావేశంలో మంత్రులు సబ్ కమిటీ సభ్యులైన ఉత్తమ్ కుమార్ రెడ్డి, దుద్దిల్ల శ్రీధర్ బాబు పాల్గొన్నారు. గత సమావేశంలో తీసుకున్న నిర్ణయాలు, వాటి ప్రగతిపై శాఖల వారీగా మొదట మంత్రుల బృందం సమీక్షించింది. సామాన్యులకు ఇసుక రాష్ట్రవ్యాప్తంగా అందుబాటులో ఉండాలన్న నిర్ణయం గత సమావేశంలో జరిగింది ఈ నేపథ్యంలో రాష్ట్రంలో 20 కేంద్రాల్లో ఇసుక విక్రయ కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు అధికారులు వివరించారు. కాగా మార్కెట్ యార్డులు, ప్రభుత్వ స్థలాల్లో త్వరితగతిన రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద సంఖ్యలో సామాన్యులకు ఇసుకను అందుబాటులోకి తీసుకురావాలని సబ్ కమిటీ సభ్యులు అధికారులకు సూచించారు. ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిష్కారం వేగవంతం చేసేందుకు చేపట్టాల్సిన చర్యలపై మంత్రుల బృందం చర్చించింది. సబ్ రిజిస్ట్రర్ కార్యాలయంలో భూముల బేసిక్ విలువను పెంచితే దరఖాస్తుదారులు ముందుకు వచ్చే అవకాశం ఉంటుందని అధికారులు మంత్రుల బృందానికి సూచించారు. ఏజెన్సీ ప్రాంతాల్లో మధ్యవర్తుల ప్రమేయం లేకుండా గిరిజనులే ఇసుక క్వారీలు నిర్వహించేందుకు చేపట్టిన చర్యలపై సమావేశంలో చర్చించారు. రాష్ట్ర ప్రజలపై పన్ను భారం మోపకుండా ఆదాయం పెంచే మార్గాలను అన్వేషించాలని డిప్యూటీ సీఎం, సబ్ కమిటీ చైర్మన్ అధికారులను ఆదేశించారు. రెవెన్యూ రిసోర్స్ మొబలైజేషన్ సబ్ కమిటీ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను చీఫ్ సెక్రటరీ ఆధ్వర్యంలో ప్రతిరోజు సమీక్ష నిర్వహించాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. సబ్ కమిటీలో చర్చించిన విషయాల్లో ప్రగతి కనబరచాలని ఈ క్రమంలో అధికారులకు ఎక్కడైనా సమస్య ఉత్పన్నమైతే తనతో నేరుగా సంప్రదించి ఫైళ్ల కదలికలో వేగం పెంచాలని డిప్యూటీ సీఎం అధికారులకు సూచించారు. హైదరాబాద్ నగరంలోని కాలుష్య కారక పరిశ్రమలను ఔటర్ రింగ్ రోడ్డు వెలుపలకు తరలించే కార్యక్రమం పై పారిశ్రామిక వాడల వారీగా సబ్ కమిటీ అధికారులతో సమీక్ష నిర్వహించింది. మైన్స్ మరియు జియాలజీ శాఖలో అమల్లో ఉన్న వన్ టైం సెటిల్మెంట్ ప్రగతిని సబ్ కమిటీ సభ్యులు సమీక్షించారు. కమర్షియల్ ట్యాక్స్ విభాగానికి వస్తే దక్షిణాది రాష్ట్రాలతో పోలిస్తే మన రాష్ట్రం పరిస్థితి మెరుగైన స్థితిలో ఉందని సబ్ కమిటీ సభ్యులు అభిప్రాయపడ్డారు. సమావేశంలో ఆర్థిక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్ కుమార్ సుల్తానియా, కమర్షియల్ టాక్స్ ప్రిన్సిపల్ సెక్రెటరీ రిజ్వీ, మైన్స్ అండ్ జియాలజీ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ శ్రీధర్, డిప్యూటీ సీఎం స్పెషల్ సెక్రటరీ కృష్ణ భాస్కర్, కమిషనర్లు శశాంక, హరిత, హరి కిరణ్, గౌతం, సురేంద్రమోహన్ హైదరాబాద్ కలెక్టర్ హరిచందన, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.







# శాంతిచర్చలకు కేంద్రంపై ఒత్తిడి తేవాలి

## ప్రజాస్వామిక వాదులు, రాజకీయ పార్టీలకు శాంతి చర్చల కమిటీ పిలుపు

హైదరాబాద్ (జనంసాక్షి) : శాంతి చర్చలకు కేంద్రంపై ఒత్తిడి తేవాలని ప్రజాస్వామిక వాదులు, రాజకీయ పార్టీలకు శాంతి చర్చల కమిటీ పిలుపునిచ్చింది. ఎర్రమంజిల్ లోని పీస్ డైలాగ్ కమిటీ కార్యాలయంలో ఆదివారం జస్టిస్ చంద్ర కుమార్ అధ్యక్షతన శాంతి చర్చల కమిటీ సమావేశమైంది. ఈ సమావేశం లో శాంతి - చర్చల కమిటీ కేంద్ర ప్రభుత్వానికి, మావోయిస్టు పార్టీకి కాల్పుల విరమణ పాటించి శాంతి చర్చలకు రావాలని మరోమారు విజ్ఞప్తి చేసింది. అనంతరం శాంతి కమిటీ ఇటివల చేపట్టిన కార్యక్రమాలపై రివ్యూ చేసింది. 'ఆపరేషన్ కగార్' నిలిపివేయాలని , కేంద్రం కాల్పుల విరమణ ప్రకటించి , బేషరతుగా సిపిఐ(మావోయిస్టు) పార్టీతో వెంటనే శాంతి చర్చలు జరపాలని జూన్ 1 న నిర్వహించిన బిజెపి యేతర రాజకీయ పార్టీలతో రౌండ్ టేబుల్ సమావేశం, మరియు జూన్ 17న రాష్ట్ర రాజధాని హైదరబాద్‌లో జరిపిన భారీ ధర్నా పై సమీక్ష చేసింది. కేంద్రం మొండి పట్టుదలతో శాంతి చర్చలకు పూనుకోకుండా కగార్ ఆపరేషన్ దాడులను పెద్ద ఎత్తున చేపడుతూ మారణ హోమానికి పాల్పడుతున్న వైనం పై శాంతి చర్చల కమిటీ ఖండిస్తూ తీర్మాణం చేసింది. జులై మొదటి వారంలో హైదరాబాద్ లో శాంతి చర్చల కమిటి విశ్రుత స్థాయి సమావేశం ఏర్పాటు చేయాలని తిర్మానం చేసింది. ఇప్పటి వరకు ఏర్పడని పాత పది జిల్లాలలో శాంతి చర్చల కమిటీలను న్యాయవాదులు, ప్రజాస్వామిక వాదులు, డాక్టర్స్ ప్రగతి శీల శక్తులను నాయకత్వంలో ఉండేటట్లు చూసుకొని శాంతి చర్చల కమిటీలను ఏర్పాటు చేయడం. రాష్ట్రంలో పోడు భూముల సమస్య తీవ్రతరమై ఆదివాసీల జీవనం పై మనుగడ పై జరుగుతున్న దాడులపై శాంతి కమిటీ విలైన మేరకు ఆదిలాబాద్ నుంచి ఖమ్మం ఎజెన్సీ ప్రాంతాలలో పర్యటించి సమస్యలను శాంతి యుతంగా పరిష్కరించడానికి ప్రభుత్వం మీద ఒత్తిడి తేవాలని తీర్మానించింది. ఆగస్టులో దేశ రాజధాని ఢిల్లీలో ప్రపంచ ఆదివాసి దినోత్సవం సందర్భాంగా ఆగస్టు రెండో వారంలో మధ్య భారతం లో, ఈశాన్య భారతం షెడ్యుల్ ప్రాంతాలలో ఆదివాసీ ప్రాంతాలలో జరుగుతున్న హింస పై, విస్థాపన పై శాంతి చర్చలు నేపథ్యంలో శాంతి నెలకొల్పడానికి తీసుకోవల్సిన అంశాలపై దేశ వ్యాప్త ఆదివాసీ సమూహాల ప్రతినిధులు, వామపక్షాల, డెమోక్రటిక్ శక్తులు బిజెపి యేతర పార్టీల ప్రతినిధుల సమన్వయంతో మిటీంగ్ జరపాలని తీర్మానించింది. శాంతి - చర్చల కమిటీ కేంద్ర ప్రభుత్వానికి, మావోయిస్టు పార్టీకి కాల్పుల విరమణ పాటించి శాంతి చర్చలకు రావాలని విజ్ఞప్తి చేసింది. మావోయిస్ట్ పార్టీ శాంతి చర్చలకు సిద్ధం.. అనువైన వాతావరణం ఏర్పాటు చేయాలని వారి కేంద్ర కమిటీ అధికార ప్రతినిధి అభయ్ పత్రికా ముఖంగా ప్రకటన చేసారు.. తదుపరి మూడు సార్లు అ పార్టీ చర్చలకు సిద్ధం అని ప్రకటించినా కేంద్ర ప్రభుత్వం మొండిగా వ్యవహారిస్తూ కర్రే గుట్ట ఆపరేషన్ ను వేలాది బలగలాతో కొనసాగించడం ప్రజా స్వామ్య విధానం కాదని పీస్ డైలాగ్ కమిటీ అభిప్రాయ పడింది. పీస్ డైలాగ్ కమిటీ పిలుపు తరువాత దేశం లోని అనేక ప్రాంతాల్లో ప్రజలు, వివిధ ప్రజా సంఘాలు, పార్టీలు, సామాజిక సమూహాలు స్పందించి శాంతి చర్చలకు కేంద్రం ముందుకు రావాలని ఉద్యమిస్తున్నారు. ఇంకా ఈ ఒత్తిడి పెంచాలని దేశ వ్యాప్తంగా ప్రజా స్వామిక వాదులకు, అన్ని ప్రజా సమూహానికి, రాజకీయ పార్టీలకు శాంతి కమిటీ పిలుపునిచ్చింది. సమావేశంలో జస్టిస్ చంద్ర కుమార్, కంది మల్ల ప్రతాఫ్ రెడ్డి, ప్రొఫెసర్ పి. ఎల్. విశ్వేశ్వర్ రావు, , రహమాన్ ఎడిటర్, ప్రొఫెసర్ అన్వర్ ఖాన్, సోమ రామ మూర్తి, అజయ్ బాల్నే, జై సింగ్ రాథోడ్, అడ్వకెట్ వెంకన్న (ఐ ఏ పి ఎల్ )బండి దుర్గా ప్రసాద్,హాజరైన ఈ సమావేశం లో పై తీర్మానాలు చేసారు.






# సీఎంను కలిసిన సీపీఐ నాయకులు



జూబ్లీహిల్స్ నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిను సీపీఐ నాయకులు కలిసారు. ఎమ్మెల్యే కూనమనేని సాంబశివరావు, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, మాజీ ఎమ్మెల్యే పల్లా వెంకట్ రెడ్డి, తదితరులు కలిసి ప్రజా సమస్యలు, పలు అభివృద్ధి పనులకు సంబంధించిన అంశాలపై చర్చించారు. గ్రామ పంచాయతీ కార్మికులు, అంగన్వాడీ, ఆర్టీసీతో పాటు పలు ప్రజా సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజా ప్రభుత్వం ఎప్పుడూ ముందుంటుందని సీఎం స్పష్టం చేశారు.

**- హైదరాబాద్ (జనంసాక్షి)**




Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370